
వేదములు

# ఆర్ష సంస్కృతి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఆర్షసంస్కృతి

[ప్రసంగ వ్యాసముల సంపుటి]

*

రచయిత:

'ఆర్షవిద్యాలంకార'

శ్రీ కల్లూరి చంద్రమౌళి.

★

ప్రచురణ:

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1977

# శుభోదయము

* . *

భారతదేశమున రాజకీయ వేత్తలయ్యు, భాషావేత్తలయ్యు, ప్రజాసేవా పరాయణులై అనేక పర్యాయములు అమాత్య పదవుల నలంకరించి నిష్కామ వృత్తితో మహర్షివలె ప్రజాపరిపాలన మొనర్చుచు విద్వత్కవి లోకమునకు గౌరవ సంమానముల నొనరించు భోజుని స్మరింపజేసిన శ్రీయుత కల్లూరి చంద్రమౌళి మహాశయులు భారతదేశమున పరమ పవిత్రతా కేంద్రస్థానముగా ప్రఖ్యాతి గాంచిన తిరుమల మహాక్షేత్రమున కలియుగ ప్రత్యక్షదైవమై కామితార్థ ప్రదుడై వేంచేసియున్న శ్రీ స్వామివారి సన్నిధానమున స్వప్రకాశితార్ష సంస్కృతిసదస్సునందు ప్రజాశ్రేయమునకై భక్తి, శక్తి, యుక్తి, రక్తి భావములతో మధురాతిమధురములగునట్లు నవ పర్వేక్షు దండఖండములనువలె ఉపన్యాసముల నొనరించియుండిరి. ఆ ఉపన్యాసములు తాత్కాలిక శ్రవణ లుబ్ధులగు వారలకేకాక తదితరులకు నంతకంటె నధిక ముదమొనగూర్చి ముద్రణము కావింప యత్నించిన శ్రీ స్వామి దేవాలయాధికారులు కడుంగడు ప్రశంసార్హులు. ఈ యత్నము శ్రీ శ్రీనివాస భగవత్కృపాకటాక్ష విశేషమున ఫలవత్తరమై ప్రజాశ్రేయమును సమకూర్చునుగాక.

శ్రీమాన్ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు,
తి. తి. దేవస్థానం ఆస్థాన పణ్డితులు, తిరుమల.

# రాజర్షి చంద్రమౌళి

* * *

"తమేవం విద్వానమృత ఇహభవతి" – సర్వేశ్వరుని తత్త్వమును తెలిసికొనినవాడు ఈ జన్మమందే ఈ లోకమునందే అమృతత్వము నందునని వేదము చెప్పినది. అనేక జన్మములందంతయు ఆర్జించిన పుణ్యముయొక్క ఫలముగా అట్టి తత్త్వమును తెలిసికొనిన ధన్యజీవులలో చంద్రమౌళి ఒకరు. ఆజాన శుద్ధమగు వైష్ణవ వంశమందు జన్మించి, దేశకాలోచితముగ పాశ్చాత్య విద్యల నభ్యసించి, కృతార్థుడై ఉత్తమోత్తమాధికార పదవుల నధిష్ఠించి ప్రసిద్ధి జెంది సహజ పాండిత్య గరిమచే "ఆర్ష విద్యాలంకార" మొదలగు బిరుదుల నార్జించి వైదిక వాఙ్మయమున కెనలేని సేవచేసి. సప్తసంతానములచే సమృద్ధి చెందిన భాగ్యశాలి చంద్రమౌళి.

ఆంధ్రావనియందు భక్తపరాధీనుడై వెలసియున్న శ్రీ భద్రాద్రి సీతారాముని ఆలయము శిథిలావస్థలోనున్న దానిని, కలియుగ వైకుంఠముగ నవీకరణము చేసిన పరమభక్తుడు చంద్రమౌళి. క్రమముగా ఈ విధముగా శ్రీశైలము మొదలగు దివ్యక్షేత్రముల నవీకరణ మహావిభూతికి మార్గదర్శియై చైతన్యమును సృష్టించిన దివ్యవ్యక్తి చంద్రమౌళి.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడును, శ్రియఃపతియునగు శ్రీనివాస మహాప్రభుని దివ్యసన్నిధిని కొంతకాలమునకు ముందు సనాతన మత ప్రచారమునకై 'ఆర్షసంస్కృతి సదస్సు' కార్యక్రమమును విజయవంతముగా సాగించుచున్న సదస్సున కనుబంధముగా నేడు జరుపబడిన ప్రబోధము ఉపన్యాసరూపముగానే కాక దేశ దేశాంతరముల వారికి, తరువాత కాలమువారికి సహాయపడునట్లు గ్రంథస్థము చేసి సారస్వత సేవచేసిన సారస్వత పిపాసి చంద్రమౌళి.

'ఈశ్వరాత్ జ్ఞానమన్విచ్ఛేత్' అన్నట్లు జ్ఞానదాత చంద్రమౌళి ఈ ప్రచారమునకు అర్హుడు.

"హస్తేఽక్షమాలా హృది రామతత్త్వం
జిహ్వాగ్రభాగే వరరామ మన్త్రమ్.
యన్మస్తకే కేశవ పాదతీర్థం

శివం మహాభాగవతం .... ...." అనునట్లు పరశురామతారకము నుపదేశించుటకు అర్హుడు చంద్రమౌళి.

బంగారమునకు పరిమళమువలె, ముకుందమాలా నిర్మాతయగు కులశేఖర భూమిపాలునకు పద్మకరులవలె సకల సద్గుణ సంపన్నులగు నిరువురు శ్రీ శ్రీ శ్రీనివాసాచార్యులు, శ్రీ రంగాచార్యులు వార్లను సమకూర్చిన శ్రీ శ్రీనివాస మహాప్రభుని పరమ కృపను చూరగొనిన ప్రపన్న శిఖామణి చంద్రమౌళి.

ఈ పుస్తకమందు వివరించబడిన ప్రతి యంశము న్యాయబద్ధమగు విమర్శనలతో సాధించబడిన సారము కలిగియున్నదని తెలియుచున్నది. వేదములు, శ్రీ మద్రామాయణములపై ప్రత్యేక దృష్టితో పరామర్శించి చిరకాలమునుండి జీర్ణించుకొనిన పరమ రహస్యములను ఆయా సందర్భములలో గ్రంథరూపముగ శ్రీ చంద్రమౌళి ప్రచురణము చేసియుండుట పండిత లోకమునకు పరిచిత మగుటచే ఈ చిన్న పుస్తకమునకు వ్యాఖ్యానములుగా ఆ బృహద్గ్రంథములను పాఠకులు పరిశీలించ గలరు.

ఈ కార్యక్రమమును పోషించిన శ్రీ టి టి. డి. వారు అభినందనీయులు.

శ్రీమాన్ రొంపిచెర్ల పార్థసారథి భట్టాచార్యులు,
రాష్ట్రపతి బహుమతి గ్రహీత, తిరుమల.

# శుభాకాంక్ష

* * *

1) ఆర్షాం సంస్కృతి మాదరేణ హి భజన్ తద్వృద్ధి హేతోర్భవాన్
పతన్నిర్మితవాన్ సదః ప్రభుపదే స్థిత్వా పురా తత్కృతే
సర్వే తే దశపూర్వికాః పితృగణా స్తం బ్రహ్మలోకం గతాః
తేనామార్హతి లేఖనం కనకవర్ణైశ్చంద్రమౌళే తతః

*

2) నిద్రాణాన్ కలయన్ చిరం బుధజనాన్ శ్రీ వేంకటేశః ప్రభుః
ఖిన్నస్సన్ పునరత్ర బోధనకృతే త్వామత్రనీత్వా తతః
యావద్భారతయాత్రికాన్ దశదినాన్యశ్రావయత్తే గిరమ్
సంధ్యానానటదిందుశేఖర జటాజూటీయ గంగానిభామ్

*

3) ఆశాస్యం పునరుక్తమేవ భవతి శ్రీచంద్రమౌళే తవ
శ్రీవిద్యే అధిజగ్ముషః ప్రభుపదం పుత్రాదికాం సమ్పదమ్
విప్రత్వాదుత సోమయాజికతయా యత్కించిదాశాస్మహే
ఆర్షాం సంస్కృతి ముద్ధరన్ అహరహః కీర్తింభజేశ్శాశ్వతమ్

Dr డి. అర్కసోమయాజి,
*M.A., Ph.D.*

# మనవి

—*—

పరమేశ్వర విజ్ఞానమైన వేదమునకు - ఋషులు బహువిధ మధుర వ్యాఖ్యానములు గావించి లోకమున వెలయించియున్నారు. ఋషులచే ప్రబోధింపబడిన సంస్కృతి యగుటవలన మనసంస్కృతికి 'ఆర్షసంస్కృతి' - అని పేరు వచ్చినది. ఆర్షసంస్కృతి సకల మానవ సంక్షేమమును, లోకకల్యాణమును సమకూర్పగలదనెడి దృఢవిశ్వాసము గలవారిలో నేనొకడను.

కావుననే నేను తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల సంఘాధ్యక్షుడనుగ నున్న సమయమున - పెక్కుమంది యుద్దండపండితులైన వారి నాహ్వానించి - ఆర్షసంస్కృతి సముద్ధరణార్థము చక్కని కార్యక్రమములను నిర్వహించెడి పద్ధతినిగురించి సమాలోచనలు జరిపితిని. వారి సూచనలమేఱకు శ్రీ వేంకటేశ్వర ఆర్షసంస్కృతి సదస్సునేర్పాటు గావింప వలయుననెడి నిర్ణయమునకు వచ్చుట జరిగినది.

వేదపురాణపారాయణములు, పండితోపన్యాసములు, సంగీత కార్యక్రమములు, భజనగోష్ఠులు నాటినుండి సదస్సుపక్షమున నిర్వహింపబడుచుండుట ముదావహమైన విషయము. ఆ సదస్సు పక్షముననే తిరుమల తిరుపతి దేవస్థానములవారి ఆహ్వానముపై ఆర్షసంస్కృతి అనెడి అంశమును గురించి 16-3-74 నుండి 27-3-74 వరకు ప్రసంగములు సాగించెడి సదవకాశము నాకు కల్గినది.

ఆప్తమిత్రులు, పండితులు నగు వైద్యరత్న శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులుగారు, పండిత శ్రీమాన్ బృందావనం రంగాచార్యులుగారు నాతో చక్కగ సహకరించి-ప్రసంగకార్యక్రమములను జయప్రదము గావించినారు.

ఈ సందర్భమున నాకీయవకాశమును కలుగజేసిన తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల సంఘాధ్యక్షులకు సంఘసభ్యులకు నా కృతజ్ఞతా పూర్వకములైన ధన్యవాదములు తెలుపుకొనుచున్నాను.

మేము 15 వ తేది ఉదయము తిరుమలకు వచ్చినప్పటినుండి అన్ని విధముల శ్రద్ధవహించి-మా అవసరములను గుర్తించి సహకరించుచు-మా కార్యక్రమములు సకాలములో సక్రమముగ నిర్వహింపబడుటకు తోడ్పడుచు తన ఉద్యోగధర్మమును చక్కగ నిర్వర్తించినవారు రిసెప్షన్స్ ఆఫీసర్ శ్రీ ఆర్. వాసుదేవనాయుడుగారు. ప్రతివిషయమును స్వయముగ కనుగొనుచు వారు సహకరించుటవలననే మేమీకార్యక్రమములను నిర్విఘ్నముగ నిర్వహింప గలిగినాము.

మాయెడ వారుచూపిన ప్రేమపూర్వకమైన ఆదరాభిమాన విశేషమునకు మాహృదయపూర్వకమైన కృతజ్ఞతను తెలుపుచున్నాను.

మాకీ సందర్భమున లభించిన సదవకాశము మరియొకటి కలదు. శ్రీవేంకటేశ్వర వేదపాఠశాలా కులపతులుగా బహుకాలానుభవము గడించిన పూజ్యులు, మహాపండితులు, వేదవిదులు, శ్రీమాన్ ఆర్. కృష్ణస్వామిఅయ్యం గారు మా సభాకార్యక్రమముల కధ్యక్షత వహించినారు. వారి పర్యవేక్షణ క్రింద మా ప్రసంగములు కొనసాగింపబడుట మాకు ముదావహమైన విషయము.

సంస్కృతభాషలో నిష్ణాతులైన పండితులు, బహువిధశాస్త్ర గ్రంథములన దేవస్థాన పక్షమున పరిష్కరించి ప్రచురించినవారు, రాష్ట్రపతి బహుమ గ్రహీతలైన శ్రీమాన్ రొంపిచెర్ల పార్థసారథి అయ్యంగారు, ప్రాక్పశ్చి విజ్ఞానముల రెండింటను-సవ్యసాచిత్వము నెఱపగల్గిన దక్షులు, హింద ధర్మప్రతిష్ఠానము నిర్వాహకులు, యం.ఏ. పి. హెచ్.డి. బిరుదములనందిన వే వేత్తలు అగు శ్రీ ధూళిపాళ అర్కసోమయాజులుగారు-మాపట్లగల ప్రేమా

మానములతో మా గోష్ఠులలోపాల్గొని హితోక్తులు పలికినారు. ఈ పండితత్ర యముతో గలిసి–ఈ ప్రసంగకార్యక్రమములు నిర్వహించుట మాకు లభించిన–అదృష్టముగనే భావించుచున్నాము.

ఈ ముువ్వురు పెద్దల సహకారమునకు మా హృదయపూర్వక నమస్కారములు. ఈ సందర్భమున సహకరించిన వారికందరికిని మరొకమారు మా అభినందనల నందించుకొనుచు–'ఆర్షసంస్కృతి' అనెడి యీ ప్రసంగవ్యాస సంపుటిని దేవస్థానమువారికి ముద్రణార్థమై సర్వ స్వామ్యములతో సమర్పించుచున్నాను.

కృణ్వంతు విశ్వమార్యమ్,

సహనావవతు సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు
మావిద్విషావహై

కల్లూరి చంద్రమౌళి.

ఓమ్

# సర్వేశ్వరుడు

* * *

"మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్॥

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రియఃపతి కారుణ్యబలమున సృష్టియంతయు చిద్విలాసములతో వర్ధిల్లుచున్నది. మహోన్నత శైలరాజములు, నదీనదములు, తరులతాకుసుమములు, భిన్నవిభిన్న రూప విశేషములతో కన్నుల విందొనర్చెడి స్త్రీ పురుషాదులు, వరుస వరుసగా నవి యివి యని చెప్పనేల? సృష్టియందలి ప్రత్యణువు పరమేశ్వరుని లీలావిలాసమునే వ్యక్తీకరించుచుండును. మానవునకిది యంతయు దిగ్భ్రాంతినే కలుగజేయుచున్నది. నిరుత్తరుడై నిలిచిన మానవుడిందలి యాంతర్యమును గుర్తింపనేరక సర్వేశ్వరునకు సాగిలబడి మ్రొక్కి, నేటికిని - ఈ దేవరహస్యము నన్వేషించుటకై యత్నమాచరించుచునే యున్నాడు. దేవదేవుని యనంతసృష్టి వైభవము మానవుని యూహలకందుటలేదు.

మహోజ్జ్వలమైన ఈ సృష్టి సనాతనమైనట్టిది. మానవుని అనుభవముయొక్క పరిధి, మేధయొక్క దక్షత మిక్కిలి పరిమితమైనట్టివి. స్వల్ప సాధనముతో అనల్ప ప్రయోజనమును గడింపగల్గుట యెవ్వరికిని సాధ్యము కాదుగదా! నూత్నవినూత్నముగ ప్రతిక్షణము ప్రవర్ధమానమగుచున్నట్టిది సృష్టి.

మహామహిమోపేతుడై, దివ్యశక్తి సమన్వితుడై అఘటనఘటనాసమర్థతతో అలరారెడి పరమాత్ముడొక్కడే సర్వసృష్టికిని కారణభూతుడై యుండెననుట నిర్వివాదాంశము. నిండు మనస్సుతో సర్వవేళల సకల ప్రజలు విశ్వసింపదగిన నిత్యసత్యమిది. సృష్టియందలి

లవలేశమేనియు పరమాత్ముని యెఱుకలేక ప్రాదుర్భవించుట లేదు. యోగ్యతములైనవారు దైవశక్తికిగల ఈ యసాధారణ మహిమను కొంతవరకు గుర్తింపకలుగుదురు.

అహంకృతి బలిసి స్వశక్తిని జూచుకొని మానవుడు విఱ్ఱవీగ రాదు. సర్వమున కాధారభూతుడై వెలుగొందుచున్న సర్వేశ్వరుని పట్ల నమ్రత కలిగియుండుట నరునకు సర్వవేళల పరమకర్తవ్యము. పరమాత్మకు విధేయముగనుండుటయే జీవాత్మయొక్క పరమలక్ష్యము గావలయును. సకల చరాచరసృష్టికి హేతుభూతుడైన పరమాత్ముని విస్మరించిననాడు మానవుని మనుగడ నేలవిడిచినసాము; త్రాడుతెగిన గాలిపటము కాగలదు. నిరాధారము నిష్ప్రయోజనకరము నగు మనుగడను మానవుడు గడుపవలసివచ్చును. మానవులెల్లరు గుర్తింప వలసిన ముఖ్యాంశమది. ఒక్కమాటలో చెప్పవలెననిన, ఆత్మలన్నియు పరమాత్మునియొక్క దివ్యానుగ్రహసిద్ధికొరకే నిరంతరము యత్నించు చుండవలయును.

పరమాత్మతో ఆత్మకుగల ఈ సంబంధమును గుర్తింపగలిగిన వారిసంఖ్య లోకమున కొలదిగనే యున్నది. అట్టి జ్ఞానము నార్జించు కొనగలిగిన వారిని - ఆత్మజ్ఞానసంపన్నులని యందురు. వారే సృష్టి రహస్యమంతయు సర్వేశ్వరుడైన పరమాత్మునిపై నాధారపడియున్న దని గ్రహింపగలుగుచున్నారు. అట్టి కోవిదులసంఖ్య విస్తృతముగ వ్యాపించిననాడు జగత్కల్యాణ మక్లేశముగ సిద్ధించును. తాదృశమైన యాత్మజ్ఞానమును సముపార్జించుటకే నరులు యత్నించవలసియున్నది అది వారి పరమ కర్తవ్యము.

"జంతూనాం నరజన్మ దుర్లభమ్" —

ఈ సూక్తి ప్రాణికోటిలో నరునకుగల ప్రత్యేకతను విశదీకరించుచున్నది. నిజ మాలోచించినచో తదితరప్రాణులకన్న మిన్నగా మానవునకొక

విలక్షణలక్షణము కలదు. అది పరమాత్ముని కటాక్షఫలముగా మానవునకు దక్కిన వరము. అదియే జ్ఞానము. జ్ఞానబలమువలననే మానవుడు తదితరప్రాణులకన్న ఘనుడు కాగలుగుచున్నాడుగదా! పరమేశ్వరదత్తమైన అట్టి జ్ఞానవిశేషముతో పరమాత్ముని దివ్యశక్తిని గుర్తించుటకే నరుడు ముందుగ యత్నింపవలసియున్నది. అట్టివివేకము లేని పశుపక్ష్యాదులకు భగవత్తత్త్వమును గురించియు సృష్టిరహస్య మును గురించియు యోచనయేరాదు. మనోవికాసము, జ్ఞానవిశేషము కలిగియున్న మానవుడు మాత్రమే దైవచింతన కలవాడై సృష్టిరహ స్యమును, సృష్టికర్త మహిమను గుర్తించుటకు తీవ్రముగ పరితపించ వలసియున్నది. కావుననే తాదృశపరితాపము మానవుని పరమ ధర్మమని విజ్ఞులనుచున్నారు. పరమాత్ముని వరప్రసాదముగ లబ్ధమైన జ్ఞానశక్తితో పరమాత్ముని గురించియే యోచన సాగించుటకన్న మిన్నయైన కర్తవ్యము నరున కెద్దిగలదు?

విధ్యుక్త ధర్మమును గుర్తించి విశుద్ధమనస్తత్వముతో పరిశీల నము సాగించి, సకల సృష్టికి కారణభూతుడైన పరమాత్మ కలడని గాఢముగ విశ్వసించి, జీవితమును కొనసాగించెడి వారినే — ఆస్తికు లందురు. భారతభూమి ఆస్తికులకు పుట్టినిల్లు. మానవుల భావనల కందని మహామహిమలను సకల ప్రపంచమున ప్రకటించి, సర్వమును సంరక్షించుచున్న సర్వేశ్వరుని భారతీయులు సర్వ జగదాధారభూతు నిగ స్తుతించిరి. ఆయన నిరవగ్రహానుగ్రహశక్తివలననే సృష్టియం తయు నిరంతరముగ కొనసాగింపబడి, పోషింపబడి, సమయమువచ్చి నప్పుడు సమయింపజేయబడుచున్నదని భారతీయ తాత్త్వికశిరో— మణులు విశ్వవిశ్వాంతరాళములకు వినిపించిరి. ప్రపంచమునగల తదితర ఖండములవారికి తెలుకపడని ఈ సత్యమును భారతభూమియే తొలుత ఎలుగెత్తిచాటుట మనయదృష్టము. పరమేశ్వరుని దివ్యతత్త్వసమన్విత మైన పుణ్యసందేశమును భారతీయుడే తొలుదొలుత నలుమూలల

కందజేసినాడు. ఇది మనభాగ్యము. ఆస్తికభావసంపదకు వారసులైన భారతీయులు, సర్వవ్యాపకుడు - సర్వశక్తిమంతుడు - సర్వనియంతయనెడి నామములతో పరమాత్ముని ప్రస్తుతించిరి. మహర్షులు సర్వేశ్వరుని విష్ణువుగా అభివర్ణించియున్నారు. ప్రపంచమునందలి ప్రత్యణువు విష్ణుమయమే. లోకమంతయు దేవదేవుని యాజ్ఞాబద్ధముగనే నడచుచున్నది. ఆయన యిచ్ఛలేనిదే చిన్న మెత్తుపని జరుగదు జరుగనేరదు. అందువలననే శివుని యాజ్ఞలేనిదే చీమయును కుట్టదనెడి సామెత పుట్టినది.

పరమాత్మునికృప మూగవానిచే మాట్లాడింప చేయగలదు. కుంటివారిని కొండలకెక్కించి దుమికింప జేయగలదు. ఆ నియంత భావించినది అమలు జరుపబడవలసినదే. సర్వశక్తిసమన్వితుడైన యా భగవానుడు సర్వవ్యాపకుడై యుండెననుట విచిత్రమేమియును కాదు.

"ఇందుగల డందు లేడని
సందేహమువలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు"

అని శ్రీమద్భాగవతమీసత్యమునే వెల్లడించుచున్నది.

"ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపలనుండు లీనమై;
ఎవ్వనియందు డిందు; పరమేశ్వరుడెవ్వడు; మూలకారణం-
బెవ్వ; డనాదిమధ్యలయుడెవ్వడు; సర్వముతానయైనవాడెవ్వడు;"-

అని సూటిగా ప్రశ్నవేసికొని సుస్పష్టమైన భాషలో "ఆత్మభవుడు సర్వశరణ్యుడు నగువాడు సర్వేశ్వరుడొక్కడే"- అని ఋషితుల్యుడైన మహాకవి పోతన సమాధానము చెప్పుకొనుటలోగల పరమార్థమును గూడ మన మీసందర్భమున గుర్తింపవలసియున్నది.

ఈశావాస్యోపనిషత్తుపరమేశ్వరునిగురించి ఇట్లు ప్రస్తావించినది.

ఓం॥ స పర్యగా చ్ఛుక్ర మకాయ మవ్రణ
మస్నావిరగ్ం శుద్ధ మపాపవిద్ధమ్
కవిర్ మనీషీ పరిభూః స్వయంభూర్
యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధా -
చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః

"అనంతశక్తియుక్తుడై అజుఁడై సర్వవేళల సర్వప్రదేశములందుండెడివాడు పరమేశ్వరుడు. ఆయన న్యాయమూర్తి నిర్మలుడు. సర్వసాక్షి. నియంత, కల్పారంభమున సర్వేశ్వరుడు వేదముద్వారా శబ్దార్థములను, వానికి సంబంధము తెలుపు విద్యలను మనకు ప్రసాదించియున్నాడు. అట్లొనర్పకున్నచో మానవులలో నెవ్వరును విద్వాంసులయ్యెడివారుకారు. ధర్మార్థకామమోక్షముల ననుభవించుటకు సమర్థులయ్యెడివారుకారు. ఇట్టి మహోపకారమొనరించిన బ్రహ్మమునే మన మెల్లరము నుపాసింపవలసియున్నది."

"విష్ణు స్సర్వేషా మధిపతిః"

సకలలోకములకు విష్ణువే ప్రభువై యున్నాడు. విష్ణుశబ్దము సర్వవ్యాపకత్వమునకు సూచకము.

"పరమః పురాణః పరోలోకానాం"

ఆయన శ్రేష్ఠుడు, సనాతనుడు, లోకముల కతీతుడు.

"అజితో జితాత్మన్"

ఎవ్వనిచేతను జయింపబడనివాడు. తనను తాను నిగ్రహించుకొనగలిగినవాడు.

"సర్వజ్ఞః" - సర్వము తెలిసినవాడు. సర్వేశ్వరునిగురించి ఇట్లెన్నియో పదములను పేర్కొనవచ్చును.

"సర్వస్య చాహం హృది సన్నివిష్టః"

—గీత

పిపీలికాదిబ్రహ్మపర్యంతము నున్న సకలమును సృష్టించి నడుపుచున్న సర్వేశ్వరుడు-అణువుకంటె అణువైనవాడు, మహత్తునకంటె మహత్తరమైనవాడు, కావుననే సర్వజగతికాయన శరణ్యుడై యున్నాడు. చేతులారంగ శివుని పూజింపుమనియు, నోరునొవ్వంగ హరికీర్తి నుడువుమనియు, దయయు, సత్యంబులోనుగా దలపుమనియు భాగవతము ప్రబోధించుచున్నది. నదు లహర్నిశలు సర్వేశ్వరుని దివ్యానుగ్రహముకొరకు పరితపించుటే పరమకర్తవ్యమని యుపదేశించుచున్నది. ఆ పరంధాముని లీలావిలాసములనభివర్ణించుటే విశ్వవాఙ్మయ పరమాదర్శము. అట్టి వాఙ్మయమే నిజమైన వాఙ్మయము. ఆ విజ్ఞానమే సత్యమైన విజ్ఞానము. దానినే ఈశ్వరీయ విజ్ఞానమనుచున్నారు.

పరమేశ్వర సంబంధమైన ఈ విజ్ఞాన సర్వస్వమునకు వేదము నిలయము. మానవజాతి సంక్షేమముకొరకై పరమేశ్వర వరప్రసాదముగా ప్రపంచమునకు లభ్యపడిన పరమపవిత్ర విజ్ఞానమే వేదవిజ్ఞానము. వేదములు భగవన్నిశ్వాసములు-అపౌరుషేయములు. స్వతః ప్రమాణములు. స్వయంప్రకాశములు. వేదసిద్ధాంత ప్రమాణమును స్థిరీకరించుటకు మరియొక ప్రమాణము అవసరములేదు. తదితర విషయములకన్నింటికి వేద ప్రమాణ మవసరము. ఏ విషయమేనియు, వేద ప్రమాణమునకు నిలువనిచో భారతీయుల దృష్టియందది పరిత్యాజ్యమే కాగలదు.

పరమేశ్వర తత్త్వమును సమగ్రముగ, సాధికారముగ విశదీకరింపజాలిన మనోబలము వేదాధ్యయనము వలననే లభ్యపడగలదు. కావుననే వేదవిజ్ఞానమును నిజమైన ఈశ్వరీయవిజ్ఞానముగ మనము సంభావించుచున్నాము.

పరమేశ్వరుని శిరసావహించి పూజించినట్లుగనే వేదమునుగూడ శిరసావహించి పూజించుచున్నాము. పరమేశ్వరునివలెనే వేదము గూడ సనాతనమైనట్టిది. సర్వేశ్వరుడు సర్వమానవ సంక్షేమకరుడైన రీతిగనే వేదవిజ్ఞానముగూడ సర్వమానవ సంక్షేమకరము. సర్వమానవ శిరోధార్యము.

ఇట్టి ఈశ్వరీయవిజ్ఞానమునకు నిలయమైన వేదమే మన సంస్కృతికి మూలము. ఈ సంస్కృతి వికాసమునకు ఋషులు మూల పురుషులు. కావున వేదసంస్కృతిని ఆర్ష సంస్కృతియనియు, సనాతన సంస్కృతియనియు పిలుచుకొనుచున్నాము.

అసత్తునుండి సత్తునకు, చీకటినుండి వెలుగునకు విశ్వమును నడిపింపగలశక్తి సంపన్నమైన సంస్కృతి మనవేద సంస్కృతి. మృత్యువును నిర్జింపజేసి—అమృతత్వమును సర్వులకు ప్రసాదింపగల దక్షత సనాతన ధర్మమునకు మాత్రమేకలదు. నిత్యచైతన్య ప్రదాయినిగా వెలుగొందుచున్న—ఈ వేద సంస్కృతి సనాతనకాలము నుండియు భారతీయ జీవితమునకు ప్రాణవాయువుగా పరివర్ధమానమగుచున్నది.

వేదసంస్కృతి సమారాధనమును గావింపని జాతిభవిష్యత్తు మంగళకరముకాజాలదని ప్రగాఢవిశ్వాసము ప్రజలలో వ్యాప్తమైనది. కావుననే ఆస్తికహృదయులగు వారెల్లరు పరమానురక్తితో భక్తితో సర్వేశ్వరుని సంస్తుతించిన విధముగనే, వేదమాతను సంస్తుతించుచున్నారు. వేదధర్మానుసారముగ జీవితరీతులను దిద్దుకొనుచున్నారు. వేదాధ్యయనముతో వేదశారదను కొలుచుకొనుచున్నారు.

సర్వేశ్వరునిపట్లగల భక్తి ప్రపత్తులన్నియు వేదము వంకకు మరలినవి. వేదమే భగవానుడు. భగవానుడే వేదమనెడి పవిత్ర విశ్వాసము భారతీయులలో నెలకొనినది. ఈ తత్త్వమునే భారతీయ యోగికులతిలకులు ప్రపంచమునందలి దేశముల కన్నింటికి ప్రసా

దించి పరమోపకార మొనరించినారు. వేద సంస్కృతియనెడి మహా సౌధముయొక్క సింహద్వారమున 'సత్యం వద ధర్మం చర' అనెడి సూక్తిరత్నములు విశాల విశ్వమున వెలుగులను వెదజల్లుచున్న మణి దీపికలు. సత్యధర్మములు సనాతన సంస్కృతికి జీవనాడులు. వేద సంస్కృతి యొక్క వైభవము, వైశిష్ట్యము సత్యధర్మములమీదనే యాధారపడియున్నది.

సర్వేశ్వరుడు సత్యస్వరూపుడు. ధర్మము పరమాత్మకు మారు రూపము. కావున సత్యధర్మ సమారాధనము నిక్కముగ సర్వేశ్వరా రాధనమే కాగలదు. సత్యవాక్కు తేజస్వియై ఓజస్వియై జాతిని సర్వవిధముల సంరక్షించును. ధర్మబద్ధము, ధర్మసమ్మతమునగు విధా నము మానవుని మనుగడను మాన్య మొనర్చును. సత్యధర్మసారమే సనాతన సంస్కృతి. సత్యధర్మముల మహామహిమను మానవకళ్యా ణముకొరకు వినియోగపరచుకొనవలసియున్నది. ఈ దివ్యసందేశము నందజేసిన ఈశ్వరీయవిజ్ఞానమగు వేదము-ఋుగ్ యజు స్సామా ధర్వణములనెడి నాల్గువిధములుగా లోకమునందావిష్కృతమై వర్ధిల్లుట మానవజాతి మహాభాగ్యమనియే యెంచవలెను.

# అపౌరుషేయ వాణి

* * *

సకల జగదాధార భూతుడైన సర్వేశ్వరుని విజ్ఞానమే వేదము. వేదము దైవదత్తము. కావుననే దైవవాణిగా వేదము వ్యవహృత మగుచున్నది.

వైదిక వాఙ్మయమునందాదికావ్యము వేదమే. మనము సర్వమును దైవానుగ్రహముగనే భావించుచుందుము. దైవచింతనయే ధ్యేయముగాగల మనయూహ దైవమయము. సత్కార్య ప్రతిపాదకమై సర్వప్రాణ్యుద్ధారకమై సర్వశంకా నివారకమై సర్వజగదారాధ్యమై భగవన్నిశ్వాసముగ సంభావింపబడెడి వేదము దైవసంబంధమైనట్టిది. ఈశ్వరీయమైన విజ్ఞానమును లోకముల కందించుటలో ప్రధాన సాధనముగనున్నట్టిది దైవభాష. దైవము—దైవ విజ్ఞానము-దేవభాష - ఇట్లు దైవమయమైన వ్యవహారమిది.

నిత్య సత్యములైన దైవ వాక్కులు వేదములనుకొంటిమి. ఇవి స్వతః ప్రమాణములు. తదితరము లెవ్వియును వేదప్రమాణమును స్థిరీకరింపజాలవు. వేదమునకు వేదమే ప్రమాణము. వేద ప్రమాణమును శిరసావహించినంతవరకే యే యితర గ్రంథమునకేని యోగ్యత; ప్రామాణ్య గౌరవము దక్కుననుకొంటిమి.

వేదము స్వయంప్రకాశమైనట్టిది. అది అఖండజ్యోతివలె తాను ప్రకాశించుచు సకల విశ్వమునకు వెలుగును ప్రసాదించుచుండును. సర్వ విజ్ఞానమును మానవుని యెఱుకకు దెచ్చెడి భగవద్వాణియే వేదము. బహుభంగుల కోవిదులు వేదమును గురించి వ్యాఖ్యానించి యున్నారు.

"విద్యతే లభ్యతే జ్ఞానం — అనేన ఇతి వేదః" దేనివలన జ్ఞానమును పొందగలమో! సర్వము నెఱుగగలమో! అది వేదము.

'వింద్యత్యనేనేతి వేదః'

సర్వము దీనిచేత తెలియబడుచున్నది. కావుననే దీనిని వేదమనుచున్నారు.

'విందతి – లభతే అనేనేతి వేదః'

దేనివలన మానవులు 'అభ్యుదయమును నిశ్శ్రేయసము' ను పొందగలరో! అది వేదము.

వేదమును గురించి యిట్లెన్నియో వ్యాఖ్యానములున్నవి. వేదమునకు శ్రుతియనునది నామాన్తరము. భగవంతునిచే వినిపింపబడి ఋషుల శ్రవణములచే ధరింపబడుటవలన నిది శ్రుతియైనది. వినబడినవి కావున వేదములు శ్రుతులైనవి.

ఈశ్వరప్రోక్తములు శ్రుతులు
ఋషి ప్రోక్తములు స్మృతులు

ఋషి మంత్రద్రష్ట మాత్రమే. వేదమంత్రములకు స్రష్ట పరమేశ్వరుడు.

లోక కళ్యాణార్థము భగవంతునిచే ప్రసాదింపబడిన యీ వేదములను గురించి పురాతన కాలమునుండియు సుదీర్ఘములైన చర్చలు జరుపబడుచునేయున్నవి. ప్రాచ్య పాశ్చాత్య పండిత ప్రకాండులెల్లరీ చర్చలలో జాల్గొని వాదోపవాదముల సల్పుచునే యున్నారు. ఎవ్వరేమి వాకొనినను సత్యనిర్ణయమే యెల్లరికిని ధ్యేయమనుట నిర్వివాదాంశము. ఋషిని యెల్లరును మంత్రద్రష్టగనే యంగీకరించియున్నారు.

వేదములు ఋగ్యజుస్సామాథర్వణములను పేర్లతో నాల్గు విధములు. చతుర్వేదములు జాతికి తరణోపాయమును సూచించు

చున్న పరమేశ్వర విజ్ఞాన భాండాగారములు. నిత్యసత్యములు. రెండభిప్రాయములకు తావులేని యంశమిది.

'అగ్నేర్ ఋగ్వేదో వాయోర్యజుర్వేదః
సూర్యాత్ సామవేదః అథర్వాంగిరసోముఖమ్.'

అగ్ని, వాయువు, సూర్యుడు, అంగిరసుడనెడినల్గురుమునులలో విఖ్యాతమైన యీశ్వరీయవిజ్ఞానమునంతయు భగవానుడావిష్కరించెనట. వేదములుకీర్తించిన భగవచ్ఛక్తియొక్కటియే. వేదములన్నియు పరమేశ్వరునకు సంబంధించిన విషయములనే యేకముఖమున నుద్ఘోషించుచున్నవి. అందరికంటె — ఉత్తమోత్తముడు పరమేశ్వరుడొక్కడేయని యెల్గెత్తి చాటుచున్నవి. ఆశక్తినే కోవిదులు బహుముఖముల గీర్తించుచున్నారు.

'ఏకం సద్విప్రాః బహుధా వదన్తి'

అనెడి సూక్తియొక్క యంతరార్థమదియే. వేదములేమి వివరించినను - అదియంతయు భగవంతునకే సంబంధించినదగును.

'యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మాదపాకషన్
సామానియస్యరోమాని - అథర్వాంగిరసోముఖమ్
స్కంభం తం బ్రూహికతమస్మి దేవసః'

వేదములయందలి విషయము ప్రభుసమ్మితమైనట్టిది. వేదములందలి ఛందశ్శబ్దము ఒక్క వేదమునకేకాక నాలుగువేదములకు సూచకము. వేదములయందు భౌతికశాస్త్ర విజ్ఞానము - అధి భౌతిక విజ్ఞానము - అధిదైవిక విజ్ఞానము - ఆధ్యాత్మికమైన సర్వవిజ్ఞానము - బ్రహ్మవిజ్ఞానము బీజరూపమున గుప్తముగ నణగియున్నది. వేదము స్వతః ప్రమాణదత్తత కలదియని చెప్పుకొనినాము. బ్రాహ్మణాదులు స్మృతులు. శ్రుతికి స్మృతికి వైరుధ్యమేర్పడినప్పుడు స్మృతిని నిరాకరించి శ్రుతినే ప్రమాణముగ గైకొనవలయునని పెద్దలమతము.

నందినీధేనువు ననుసరించి నడచుచున్న సుదక్షిణాదేవి శ్రుతియొక్క యర్థము ననుసరించి వచ్చుచున్న స్మృతివలె నుండెనని కాళిదాసు వర్ణించినాడు. శ్రుతి స్మృతుల సంబంధమంతటి విస్పష్టమైన రీతిలో లోకమున ప్రచారమునకు వచ్చినది. వేదముల నభ్యసించు వారినే వేదపాఠకులందురు. వేదపాఠకు లధ్యయన మొనర్చునది వేదమంత్రములను సంహితలను మాత్రమే. బ్రాహ్మణాది గ్రంథముల నభ్యసించు వారిని వేదపాఠకులనరు. ఉదాత్తా నుదాత్తాది స్వరములు వేద మంత్రములకే యుండును.

పద, క్రమ, జటా, ఘన అనెడి పాఠములు వేదమంత్రములకే పరిమితములు. చారిత్రాత్మకములైన విషయములుగాని, నామవాచకములు గాని, స్త్రీపురుషుల జీవితగాథలు కాని, వేదములలో గనిపించవు. అపౌరుషేయములని వేదములను ప్రశంసించుట కిదియు నొక బలీయమైన కారణము. పతంజలిమహర్షి వేదములనుండియే "ఛందసి" అను పదము నుదాహరించినాడు. బ్రాహ్మణాది వ్యాఖ్యాన గ్రంథముల నామములు వేదములలో గన్పట్టవు. బ్రాహ్మణాదులలో మాత్రము వేదనామ ముదాహరింపబడియున్నది. వేదమంత్రముల అధ్యాయములలో మొదట చివర 'వేదము' - అను పదమునుగాంచుచుందుము. ఇట్టి దివ్య నియమములతో విరాజిల్లుచున్న - ఈశ్వరీయ విజ్ఞానమగు వేదము - ఒక ప్రాంతమునకో - ఒక జాతికో చెందినట్టిది కాదు. విశ్వమునగల సర్వమానవాళికి సంబంధించినట్టిది వేద విజ్ఞానము. ఈ సనాతన విజ్ఞానమునే విశ్వ విజ్ఞానమనియు - ఆర్ష విజ్ఞానమనియు కోవిదులు నుడువు చున్నారు.

'కృణ్వంతు విశ్వమార్యమ్'

స్త్రీ పురుష తారతమ్యము లేకయే వేదవిజ్ఞాన సముపార్జనకు మానవులు యత్నించవచ్చునని స్పష్టీకరింపబడినది. మనోబలము, మాన

నీయమైన కఠోరదీక్ష, సముజ్జ్వలమైన సాధనశక్తి, నిస్తులమైన ఏకాగ్రత, అచంచలమైన సహనముగల వారెవ్వరేని వేదమాత చరణసేవ గావింపవచ్చును. ఫలితముల సాధింపవచ్చును. వాచక్నవి-బడబ-గార్గి మొదలైన వారందరు స్త్రీలయ్యును నిరుపమానాధ్యయన తత్పరలై వేదవిజ్ఞానమును గడింపగల్గిరి. గడించుటయేగాదు; కొందరు స్త్రీలు వేదవిజ్ఞానమున మహోద్దండ పాండిత్యము నార్జించియున్న మహర్షుల నెదిర్చి గణనీయమైన విజయములను సాధింపగల్గిరి.

కావున యోగ్యతను సముపార్జించుకొనగలిగిన సర్వేశ్వరభక్తులందరికిని - ఈశ్వరీయ విజ్ఞానము సమానముగ సమారాధ్యము కాదగి నట్టిదేయని వ్యక్తమగుచున్నది.

వేదమనునది యొక మహాకావ్యము. విశ్వశ్రేయమే యీ మహాకావ్యమున కేకైకపరమలక్ష్యము. భగవానుడే వేదకర్త. పరమేశ్వర కావ్యము గాన వేదము నిత్యమంగళకరము. నిత్యశోభాయమానము.

'పశ్య దేవస్య కావ్యం - నమమార - నజీర్యతి'

సహజకాంతితో సదా దీపించెడి బృహత్కావ్యము వేదము.

వేదభాషయు నిత్యమైనట్టిది. దైవము మనకు సర్వదా సమారాధ్యము. ధర్మసూచనల గావించి మనల ధన్యులను గావించునది దైవ విజ్ఞానమగు వేదము. వేదభాష దైవభాష, సర్వమును దైవమయము గావించుకొన జాలినజాతి భారతజాతి దైవత్వసందీపితముగాని యేయంశమునుగూడ మనసా రౌదల దాల్చలేదు, దైవాంశతో చిహ్నితముగాని యేవిషయమునుగూడ వారు కర్ణపుటముల బడనీయ లేదు. దైవాజ్ఞనే వారు శిరసావహించిరి. దైవవిజ్ఞానమునే సముపార్జింప సన్నద్ధులయిరి. దైవ వాణియందే పలుకదొడగిరి. అహో! మహాభాగ్యము. సర్వమును దైవమయము గావించుకొనగల్గిన నాటి భారతీయ దివ్య జీవనవిధాన మెంతపవిత్రము?

## వేదభాష దేవభాష

భారతీయుల పరమార్థమేమి? భగవత్సంబంధమైన విజ్ఞానము నావిష్కరించుటయే. ఈ దివ్య నిర్ణయము తొలుతనుండియు భారతీయుల మనుగడకు మార్గదర్శకము.

'ధర్మేణ సహితం జ్ఞానం పరంబ్రహ్మ ప్రకాశయేత్'

ధర్మ సహితమైన జ్ఞానమొక్కటి మాత్రమే పరబ్రహ్మ ప్రకాశమునకు కారణభూతముగ నిల్చును. సంస్కృత భాష సరళసుందరమై సర్వేశ్వర విజ్ఞాన ప్రచారకరణదక్షమై పరిపూర్ణతను బడసినట్టిది. సకల భాషలకు జననిగ నిల్చి - వాని యభ్యుదయమునకు వలయు దోహదమొనర్చుచు చైతన్యమును గూర్చుచు సర్వతోముఖముగ తాను విస్తరింపజాలిన భాష సంస్కృత భాషయే.

మహాశక్తిమంతమైన యీ దేవభాషయందే పరమేశ్వరవాణి ప్రసారితమైనది. ఈశ్వరీయ విజ్ఞానమునకు కేంద్రములనదగిన వేదములు గీర్వాణ భాషాంబరమున తొలుదొలుత వెలుగుజిలుగులను వెలయించిన మేలి ధ్రువతారలు, నాటినుండియు భారతప్రజానీకమునకు పావన భారత భూభాగమునకు - మొక్కవోవని చెక్కుచెదరని - అపూర్వ కీర్తిని - అనంత సౌభాగ్యమును, సంస్కృత భాషయే సమకూర్చిపెట్టుచున్నది. చరిత్ర గర్భమునందీయంశమును స్పష్టీకరించెడి సాక్ష్యములు పరిశీలకులకెన్నియో లభ్యపడగలవు. మాధుర్యమును, దైవికశక్తిని సమ్మిళిత మొనర్చి వ్యక్తిత్వమును దిద్దుకొనినభాష సంస్కృతభాష. నిత్య నూతన తేజోవిరాజితమైన - ఆరణ్యక ప్రకృతిని దర్శించి - ఆత్మప్రబోధ సంలబ్ధానంద పరవశులగు మహర్షుల మధుర భావనల కన్నింటికిని దర్పణము పట్టిన భాషయిది. సర్వతోముఖముగ విస్తరించుచున్న సకలశాస్త్రగతాంశములకు సరసశైలిలో రూపకల్పన జేయ సర్వోత్తమమైనభాష అమరభాష. గుండెలలో పండు వెన్నెలలను

విరియింపగల ధోరణిలో కమనీయ కలస్వనముల రమణీయ కథారత్న ముల కొరపిడిబెట్టి దివ్య కాంతుల సర్వదా తేజరిల్లజేసిన భాష గీర్వాణభాష. వాక్కునకుగల నైశిత్యమును, లాలిత్యమును గుర్తించి - అనేకార్థముల నావిష్కరించు తెలుగున - అద్భుతాహ్లా దము ననుసంధించులీల - సురభాషా రసాలములపై నెక్కి; చిగుళ్ళు మెక్కి; మనోహర దివ్యకావ్యగానము లొనర్చిన కవికోకిలలు మన యూహాలయందలి శాశ్వతసత్యములను సర్వవేళల చాటుచుండును.

సర్వవిధముల సంస్తవనీయమైనదనియు - సంపూర్ణ వికాస వైభవోపేతమైనదనియు - సకల జన సముద్ధరణశక్తమైనదనియు- సర్వప్రపంచాభినందన పాత్రమైనదనియు సనాతనకాలమునుండియు ప్రశంసలందుకొనుచున్న సంస్కృతభాషయొక్క విశిష్టతను వాకొన బూనుట సూర్యభగవానుని యపూర్వతేజో విశేషముల నుగ్గడింప బూనుటవంటిదే కాగలదు. కొలదిగ నేదేని మనమాభాషను సంస్తు తించుటయనిన మనకాభాషపట్ల గౌరవ ప్రతిపత్తుల నానందముగ నభివ్యక్తీకరింపగావించిన కించిన్మాత్రపు ప్రయత్నమే కాగలదు.

ప్రపంచపు నలుమూలల ప్రఖ్యాతిగాంచిన యీ సంస్కృత భాషాప్రశస్తిని యెవ్వరెన్నివిధముల వర్ణించినప్పటికిని-అభినందించి నప్పటికిని- వాస్తవమును వక్కాణింపగల్గినవారు కాగలరా!

పుష్కలముగ నట్టి మహోజ్జ్వలస్థాయిని గడించుకొనియున్న భాష దేవభాష. భావనల కందని యేదో మహా మహిమాన్విత స్థితిని సంతరించుకొని-ప్రతిపదమునందు మాత్రమేకాక ప్రత్యక్షరమునందును దివ్యత్వమును దీపింపజేయుచు సకలమానవాళి హృదయములను స్పందింపజేసి-యుగ యుగాంతరముల వరకుగూడ మాయని-మరపు రాని; దివ్యసందేశము నందింపజేసి విశ్వప్రజా హృదయ భద్రపీఠమున అధికారము నెరపగల్గినది సంస్కృతభాష.

అట్టి దివ్యభాషయందు పరమేశ్వరునిచే ప్రసాదిత మొనర్పబడిన పవిత్ర విజ్ఞానమే వేదవిజ్ఞానము. సనాతనమైన వేదవిజ్ఞానమున కాకర మగు సంస్కృతభాషయొక్క ప్రాశస్త్యమునుగూర్చి పలువురు పాశ్చాత్య విద్వాంసులు భావించిన యంశములను - ప్రస్తుతించిన విధానములనుగూడ నీ సందర్భముననే యుల్లేఖించుట సముచితపద్ధతి.

"సంస్కృతభాషయొకగని-ఆ గనినుండి వలసినంత సామగ్రిని గైకొని తదితర భాషలు తుష్టిని పుష్టిని గడించుకొనినవి"

మోనియర్ విలియమ్సు పండితుని ప్రశంస యిది. 'సంస్కృతంనామ దైవీవాక్ అన్వాఖ్యాతా మహర్షిభిః' గీర్వాణవాణిని పలుతెఱగుల స్తుతించి గద్యకావ్యకుసుమములతో నర్చించిన దండిమహాకవి భక్తి మయభావనయిది. ప్రాచీనార్వాచీన పండిత ప్రకాండుల భావపరం పరల నిట్లెన్నేని యుదాహరింపవచ్చును. సురభాషకుగల ప్రత్యేకత యట్టిది. మన పండితులవలెనే-వాస్తవమును వెల్లడింపవలసివచ్చినచో మనవారికన్న మరికొంత మిన్నగనే యాధునిక కాలమున విదేశీయ పండితవరేణ్యులు గీర్వాణవాణికి జోతలర్పించుచున్నారు. బహు ముఖశ్రమలకోర్చి సంస్కృతము నభ్యసించి యందలి విశేషాంశ ములను గుర్తింపగల్గుటొక విశేషము. భావము నవగత మొనర్చు కొనినపిదప భాషయందలి స్వారస్యమునకుమురియనేర్చు టొక - ప్రతిభ. భాషామాధుర్యమును జుఱ్ఱుకొనిన యనంతరము-వ్యాకరణ వైశిష్ట్యముల దలదాల్చి కవి ప్రకటించిన వైదుష్యమును పరిశీలించి జాపురేయన గల్గుటొక ఘనత. శాస్త్రమర్యాదలకు దోసిలినొగ్గి రస బంధురముగ నలంకారయుక్తముగ నడచిన శైలీవిలాసమునకు ముగ్ధ ముగాగల్గుటొక విశేష విజ్ఞత. దీనినంతయు హృదయమున దాచు కొనక-తన యనుభూతిని బహిరంగముగ ప్రకటింపగల్గుటొక సహృద యత. ఇట్టివిలక్షణ విశాల భావన - పరఖండ పండితాగ్రేసరులనుండి వెలువడు టొక యపూర్వస్థితి. ఆ మంచితనమును వెల్లడించుకొన

గల్గిన యనఘుల నభినందింప వలదా! భక్తితో పఠింపవచ్చును. మమతతో మహిమ ననుభూతికి దెచ్చుకొనవచ్చును. మన గీర్వాణభాష సత్యముగ మహోన్నతము, మహోజ్జ్వలము నయినట్టిదే కావచ్చును. కాని 'ప్రశంస లందించినది, ప్రస్తుతుల నలరించినది' అని పాశ్చాత్యు డనుకొనినపుడు దేవభాషా మాహాత్మ్య ప్రాభవముతోఁబాటుగ పాశ్చాత్య విద్వాంసుని సహృదయతయు మనముందు నిల్చును. నిష్కలుషమైన పక్షపాతము లేని పరమ గౌరవప్రకటనయే పరమాదర్శము గాగల భావనతో పాశ్చాత్యు లీరీతిగ నమరభాష నర్చించిరి. అభినందించిరి. ఆనందించిరి. జర్మనీదేశీయులకు గల దేవభాషాభక్తి ప్రత్యేక ప్రశంసార్హమైనట్టిది. 1480 నాటికే వారు పంచతంత్రమును ప్రప్రథమముగా తమ భాషలోని కనువదించుకొనిరి. ప్రాథమిక పాఠశాలలో పాఠ్యగ్రంథముగ నిర్ణయించుకొనిరి. సంస్కృతభాషలో యెన్నదగిన పాండిత్యమును గడించుటకు జర్మనీదేశీయులు సల్పినకృషి యసాధారణమైనట్టిది. మహత్తరమైన శాస్త్రవిజ్ఞానసంపద గీర్వాణ భాషలో కలదని గాఢముగ విశ్వసించి - అందు ప్రజ్ఞను గడించుటకై అనన్యమైన శ్రమ యొనర్చిన విదేశీయులలో జర్మనీ దేశీయులను ప్రముఖులుగా పరిగణింపవచ్చును.

18 వ శతాబ్దమునాటికే జర్మనీ ప్రభుత్వము విశ్వవిద్యాలయములలో సంస్కృతవిద్యకు ప్రత్యేక పీఠములను విధిగ నెలకొల్పవలయునని శాసించినది. 1780 లో భగవద్గీత, 1789 లో అభిజ్ఞానశాకుంతలము, పాశ్చాత్యభాషలయం దనువదింపబడినవి. 1794 లో మనుధర్మశాస్త్రమును హెచ్. టి. కోల్ బ్రూక్ ఆంగ్లభాషలోని కనువదించి దానిని ప్రత్యేక వ్యాఖ్యానములతో వ్యాసరూపమున ప్రకటించినాడు.

స్కోపెన్‌హోయర్ అనెడి పాశ్చాత్య పండితుడు సమగ్రమైన సంస్కృతభాషావైదుష్యము నార్జించి 'ఉపనిషత్తే నా జీవితసర్వస్వ' మని తన్మయత్వముతో ప్రశంసించుట గమనించదగిన విషయము

గెటీ పండితుడు శాకుంతలము, గీతగోవిందము, మేఘసందేశము మొదలైన గ్రంథములమీద సువిస్తృతమైన పరిశ్రమ సాగించినాడు. పైన పేర్కొనబడిన గ్రంథములకు వ్యాఖ్యానము వ్రాయుటనిన, సంస్కృతభాషపై నెట్టి అధికారముగలవారు చేయదగిన పనియో, ఇంచుక యోచించిన గెటీ పండితుని విద్వత్తు మన కవగత మగును.

1849 నుండి మ్యాక్స్‌ముల్లర్ సంస్కృత భాషకు వేఃవిజ్ఞానమునకు చేసినసేవ చిరస్మరణీయమైనట్టిది. చరిత్రలో విదేశీయు లెవ్వరును వేదములపై సమష్టిగగాని; వ్యష్టిగగాని; సలుపలేని కృషిని మ్యాక్స్‌ముల్లర్ ఒక్కడే - ఏకైక వ్యక్తిగ నిలిచి సాగించినాడు. ఆయన షడ్దర్శనముల నాంగ్లమున కనువదించి ప్రచురించిన తత్త్వవేత్త. వేదములపై నాయన యొనర్చిన సాధికారకృషిని తిలకించినవారు మ్యాక్స్‌ముల్లరు భారతీయ యోగికులతిలకుడా! యని శంకించుచుందురు. వేదములపట్ల, దేవభాషపట్ల పుణ్యభూమియైన భారతదేశముపట్ల ఈయనకుగలభక్తి అపారమైనట్టిది. వివేకానందు డీమహానీయుని అపరసాయణాచార్యునిగా అభివర్ణించియున్నాడు. ఇట్లెందరినో సంస్కృత భాషాభక్తులైన పాశ్చాత్య పండితులను వరుసవరుసగా పేర్కొనుచు బోవసాగిన నదియొక బృహద్గ్రంథమే కాగలదు. మచ్చునకుమాత్రమే కొందరి మహనీయుల సచ్చరిత్రలిచట ముచ్చటింపబడినవి. ప్రతిదేశమున - ప్రతిరాష్ట్రమున సంస్కృత భాషపట్ల పలువురిలో ఇట్టి గౌరవభావములే వ్యక్తమగుచు వచ్చినవి. గీర్వాణవాణి నర్చించు విషయమున ప్రపంచపు టెల్లలు తుడిచివేయబడినవేమో! విశ్వమునగల భాషాసేవకులందరు విశాలదృష్టితో సంస్కృతము నట్లభిమానించిరి. కాలక్రమమున మనమే సంస్కృతమును విస్మరించినట్లు తోచుచున్నది. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత అమరవాణి అంతస్తు కించిన్మాత్రముగనేని వృద్ధి చెందినదా? సముచిత ప్రోత్సాహము సమకూరినదా?

"సంస్కృతమును భారతదేశమునకన్న పాశ్చాత్యదేశములే బాగుగ గౌరవించుచున్నవి. మనపాడియావు పెఱవారియింట క్షీర ధారలు కురియుచున్నది. అనురక్తితో వారారగించుచున్నారు. మనమూ గోమాతవంక కన్నెత్తిచూడము. పట్టుమని గట్టిగా పట్టెడు పరకలు విదిలించెడి ప్రయత్నముచేయము. నీడకు రానీయము. నీళ్ళు పట్టము. ఆవు శల్యావశిష్టమైనను బ్రతికియున్నది. అదియొకతృప్తి. దానిని చాననీయము. జీవించుటకు మార్గములు కల్పించము. ధేనువు మాత్రము మనదేయని గొప్పలుచెప్పుకొని పొంగిపోవుచుందుము."

నేడు సంస్కృత భాషపై మనకుగల భక్తి నిజముగ నిశ్లేయున్నది. ఒకనాడు దేవభాషను దైవసమముగ నారాధించి, సంస్కృతశారదా దివ్యానుగ్రహబలముతో వేదమాత కరుణను జూరగొనుటకు గురు కులములలో దేశికోత్తముల చరణసన్నిధియందు నిరంతర తపస్సు గావించినజాతి నేడిట్లగుట శోచనీయము. మన సంస్కృతికంతటికిని మూలభూతమైన వేదము పవిత్రము; శక్తిమంతము. దీనిని సంస్కృత భాషయందే పరమేశ్వరుడు ప్రవచించియుండుట మహాభాగ్యము. వేదహృదయ మర్మములు గీర్వాణభాషాధ్యయన దక్షులైన వారికే సుబోధకములగును వేదార్థములు సువిదితములైనపుడే మనము మనసంస్కృతిని గుర్తింపగలము.

"సర్వోప్యయం వేదః ప్రత్యక్షానుమానాభ్యాం
అనవగతేష్టానిష్టప్రాప్తిపరిహారోపాయప్ర—
కాశనపరః; సర్వపురుషాణాం నిసర్గత
యేవ తత్ప్రాప్తిపరిహారయో ఒరిష్టత్వాత్"

(శంకరాచార్యులు)

ఇష్టప్రాప్తి అనిష్ట పరిహారము సర్వప్రాణులకు వాంఛనీయమే యగును గదా!

ఇక వేదముల స్వరూప స్వభావముల గురించి ఈ సందర్భమున గ్రహించు టెంతయు నవసరము. వేదములు సత్యార్థ ప్రతిపాదకములు.

సర్వప్రాణ్యుద్ధారకములు, సర్వశంకా నివారకములు. జగద్ధితకరములు. వేయిమాట లేల!

"సత్యం సత్యం పునస్సత్యం
ఉద్ధృత్య భుజముచ్యతే
వేదాచ్ఛాస్త్రమ్ పరం నాస్తి
న దైవం కేశవాత్పరమ్."

కేశవునకంటె మిన్నయగు మరియొక దైవము - వేదమునకంటె శ్రేష్ఠమైన మరియొక శాస్త్రము లోకమునలేదు. ముమ్మాటికి సత్యమైన విషయమిది. చేయెత్తి చాటదగిన మాటయిది.

వేదములు నాలుగు. ఋగ్యజుస్సామాథర్వణములు. సనాతన కాలమునుండి సర్వభారతీయులు సభక్తికముగ వీని నర్చించుచున్నారు. సర్వకాల సర్వావస్థలయందును సర్వదేశములలోగల యెల్లరికిని సమాన ఫలములను ప్రసాదించుశక్తిగలవి యివే వేదములు.

అనుశ్రుతముగ గురుశిష్య పరంపరలో కంఠస్థము గావింపబడి వినిపింపబడుచు వచ్చుచుండుటవలన వేదములకు శ్రుతులనెడి పేరు వచ్చినది. భగవంతునిచే చెప్పబడినపుడు యోగ్యతముులైన నల్గురు ఋషుల శ్రవణములచే ధరింపబడినవి యగుటవలనను వేదములకు శ్రుతులని వ్యవహారనామము కల్గినది. తాము వినిన విషయములపై ఋషులు గావించిన వివరణలే స్మృతులు. ఈశ్వరప్రోక్తములు శ్రుతులు. ఋషిప్రోక్తములు స్మృతులు.

ఋషిమంత్రద్రష్ట. ఆయన మంత్రమునకు స్రష్టమాత్రముకాడు. ఋషిత్వమెట్లు సిద్ధించును? యమనియమాదులవలన యోగ్యతను గడింపగల్గిన లోకకళ్యాణభావనలు ఋషిత్వసిద్ధికి దగినవారని యెంచవచ్చును.

స్త్రీ పురుష దేశకాల జాతిమతకులవిచక్షణలతో నిమిత్తము లేకయే నైష్ఠికబల ప్రభావముతో నైతికశీల సంపత్తితో ఋషిత్వము నందు పొందవచ్చును. వాత్స్యాయనుని నిశ్చితసిద్ధాంతమిది.

నిత్యసత్యములుగ పేర్కొనబడెడి యీ నాల్గు వేదములను సర్వేశ్వరుడు అగ్ని వాయువు అంగిరసుడు ఆదిత్యుడు ననెడి నల్వురు ఋషులలో నావిష్కరించినాడు. పరమేశ్వరుడీయావిష్కరణము నెపుడొనర్చె ననెడి ప్రశ్న నిష్ప్రయోజనకరమైనట్టిది. కాలపుకొలబద్దలతో వేదపుటునికిని మనికిని కొలువవలెనని - విలువగట్టవలెనని యత్నించుట వెఱ్ఱితనమే కాగలదు. వేదములు పరమేశ్వరునివలె సనాతనములు. శాశ్వతములు. సర్వవిధ ఫలప్రదములు. ఇంద్ర, మిత్ర వరుణ, మాతరిశ్వ సువర్ణ మొదలైన నామములను వేదము ప్రవచించుచున్నది. కాని ఇవి సర్వేశ్వరుని సకలవిధ శక్తులను సద్గుణ సంపత్తిని సూచించు శబ్దములుమాత్రమే. భగవచ్ఛక్తియొక్కటే. తత్స్వరూపమే ఓంకారము. ఇది సర్వసృష్టికి హేతుభూతమైన పరమేశ్వరాంశ. ఓంకారము ప్రణవాత్మకము. ఓంకార సమన్వితముగ నుచ్చరింపబడని యే మంత్రమునకును విలువలేదు.

"గారెలులేనివిందు, సహకారములేనివనంబు, తొల్త నోంకారములేని మంత్ర, మధికారములేని ప్రతిజ్ఞ." మొదలైనవన్నియు వ్యర్థములేయని కంఠోక్తిగ నొక ప్రాచీనాంధ్ర కవీంద్రుడుద్ఘోషించినాడు. వేదమున సూచింపబడిన దేవతలలో న్యూనాధిక్యభావనకు తావులేదు. శక్తియంతయు నొక్కటే. రెండభిప్రాయములకు చోటులేని విషయమిది.

వేదము దైవీవాక్కు. దీనికి ఛందస్సు, [illegible], బ్రహ్మ, సంహిత, మంత్రము, శ్రుతి మొదలయినవి నామాంతరములు.

"తస్మాద్యజ్ఞాత్సర్వహుతః
ఋచః సామాని జజ్ఞిరే

Q1:(Y:1)
35L77
CENTRAL LIBRARY
T. T. DEVASTHANAMS,
TIRUPATI.
Acc No. 798
Date 15-6-81
TIRUPATI

ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మా
ద్యజుస్తస్మాదజాయత

.... .... .... ....

.... .... .... ....

తస్మాద్యజ్ఞాత్సర్వహుతః
ఋచః సామాని జజ్ఞిరే
ఛందోహ జజ్ఞిరే తస్మాత్
యజుస్తస్మాదజాయత."

ఇందు ప్రయుక్తమైన ఛందశ్శబ్దము నాల్గు వేదములకు సూచకము.

మధుర భావనలతో మానవాళి నలరించుచు మహత్తరోపదేశము గావించుచు మనుగడలను ధన్యమొనర్చెడి వేదమాతఋణము నెవ్వరును దీర్చుకొనజాలరు. వేదాధ్యయన తత్పరతతో వేద ధర్మానుష్ఠానానురక్తితో మాత్రమే కొంతవరకు నరులీయప్పును దీర్చుకొనగల్గుదురు.

అనుక్షణము నరులమధ్య సమైక్యభావ ధోరణిని ప్రోత్సహించుచు విశాలదృష్టిని గలుగజేయుచున్న వేదగానములు జాతియొక్క యభ్యుదయమునకు నిధానములు.

"ప్రియం మా కృణు దేవేషు ప్రియం రాజసు మాకృణు
ప్రియం సర్వస్య పశ్యత - ఉతశూద్ర ఉతార్యే."

సర్వజీవుల ప్రేమకు నన్ను పాత్రుని గావింపుమని భగవానుని యాచించుచున్న నరునిప్రార్థన యెంత యుదాత్తమైనట్టిది?

"రుచం నో దేహి బ్రాహ్మణేషు రుచం రాజసు నస్కృధి
రుచం వైశ్యేషు శూద్రేషు మయి దేహి రుచారుచం."

సర్వవర్ణములవారు ప్రేమసూత్ర బంధితులై యుండవలెననెడి యాకాంక్ష యిందు సువ్యక్తమగుచుండును. సర్వావయవములు సుదృఢములై పరస్పరానుకూల భావమున వర్తించినపుడే దేహికి సుఖము. సర్వప్రజలు నట్లు వ్యవహరించినపుడే సమాజమునకు శాంతి.

స్త్రీల విషయమునగూడ వేదము మహోదార భావములనే వెలయించినది.

"చోదయిత్రీ సూనృతానాం
చేతంతీ సుమతీనాం
యజ్ఞం దధే సరస్వతీ"

ఇచట సరస్వతీ శబ్దము స్త్రీపర్యాయముగ ప్రయోగింపబడినది.

మధురసత్యములను ప్రకటించుచు, బుద్ధిమంతులగు వారిని ప్రేరేపించుచు, బుద్ధిమంతురాలయిన స్త్రీ యజ్ఞము నిర్వహించుచున్నది. యోగ్యత నార్జించుకొనజాలిన స్త్రీలు వేదాధ్యయనమొనర్పవచ్చుననియు, యజ్ఞములు నిర్వహింపవచ్చుననియు వేదము సమ్మతించెననుట కిదియొక ప్రబలోదాహరణము. స్త్రీలు వ్యవహరింపవలసిన తెఱగును నిర్దేశించుచు వేదము కఠిన నియమములనే నిష్కర్షగ ప్రతిపాదించెనని యీ క్రింది మంత్రమువలన గ్రహింపవచ్చును. చెప్పవలసిన విషయమును, చేయవలసిన శాసనమును వేదము అసందిగ్ధముగ ప్రతిపాదించెననుటలో విప్రతిపత్తి యెందును గన్పట్టదు.

'అధః పశ్యస్వ మోపరిసంతరాం
పాదకౌహరమాతే
కశప్లకౌదృశన్ స్త్రీః బ్రహ్మా బహూవిధా'

'నడచునపుడు క్రిందికి చూడుము. పైకి చూడకుము. పాదముల నస్తవ్యస్తముగ నడ్డదిడ్డముగ నాడింపకుము. గుప్తావయవములు

ప్రకటితముగాని తెలుగున మిక్కిలి శ్రద్ధ వహింపుము. బ్రహ్మవగుటకు యోగ్యురాలవు కాగలవు!

స్త్రీలకు చేసిన యుపదేశమిది. యోగ్యతను గడించి స్త్రీలు బ్రహ్మలై యజ్ఞములు నిర్వహింపవచ్చునని యిందువలన సువ్యక్తమగు చుండెను గదా! యోగ్యతగలవారికే వేదమాతృసమారాధనార్హత సిద్ధించును. వైదుష్యమున్నవారికే వేదమాతృహృదయము సమగ్రముగ నర్థమగును. కనుక వైదుష్యమెల్లరికిని వలయునని దానిని నార్జించుటకు శ్రద్ధవహింపుమని జాతికి వేదము ప్రబోధమునందించినది.

"ఉత్వతః పశ్యన్ న దదర్శ వాచం
ఉతత్వః పశ్యన్ న శృణోత్యేనాం
ఉతోత్వస్మై తన్వం విసస్రే
జాయేవ పత్య ఉశతీసువాసా."

విద్వాంసుడు కానివాడు కనుచుండియును జూడజాలడు. వినుచుండియు వినలేడు. సర్వాలంకార సమన్వితయు ననుకూలవతియునగు భార్య, యోగ్యుడు ప్రియతముడునగు నాథునింబలె- వాక్కన్య విద్వాంసునే యలరించును.

శం నో అస్తు ద్విపదే శం చతుష్పదే.

మానవుడు రెండుకాళ్ళుగల ప్రాణికోటికి మాత్రమేకాక నాలుగు కాళ్ళుగల ప్రాణికోటికిగూడ సుఖము శుభము కలుగవలయునని కాంక్షించుట వేదసంస్కృతియందు మాత్రమే చూచుచుందుము.

ప్రపంచమునగల చతుష్పాత్తులకుగూడ సుఖము సర్వదా లభ్యమగుగాక యనెడి తత్త్వమును నరనరముల జీర్ణింపజేయుచున్న ఈశ్వరీయవిజ్ఞానము నెట్లు ప్రస్తుతింపవలెనో యోచింపుడు! భగవంతుని సామ్రాజ్యము ప్రపంచము. తన రాచరికము సుభిక్షముగను, శాంతియుతముగను కొనసాగుటకు ప్రతిప్రభుత్వము కొన్ని చట్టము

లను సృష్టించుకొనుట పరిపాటి. పరమేశ్వరుని రాజ్యాంగమునకు చట్టములు వేదములు. కావుననే వివిధ వివరణలతో మధుర మంజుల గీర్వాణభాషలో సర్వేశ్వరు డీచట్టమును ప్రస్తావించినాడు.

ఇతర సాధనములచే నేవిషయములను తెలిసికొనజాలమో! వాని నన్నింటిని వేదము వివరించి చెప్పుచుండును. పుణ్యాపాపములు, ధర్మాధర్మములు, స్వర్గసుఖములు, కర్మానుభవరహస్యములు—వీనికి సంబంధించిన యనుభూతులు త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణశ్రోత్రేంద్రియములచే తెలియబడవు. వేద మిట్టిసందర్భములం దిట్టియంశముల నన్నింటిని జక్కగ విశదీకరించి మానవుని యనుభవమునకు గొనిరాగలదు. తాదృశమైన యసాధారణశక్తి వేదమునకు మాత్రమేకలదు. వేదము తల్లివంటిది. తల్లి బిడ్డను లాలించును. పాలించును. తండ్రి యనుగ్రహమునకు పాత్రుల గావించును. యోగ్యతను ఘటించును. నిర్దుష్ట జ్ఞానము నందించును.

మానవులపై వేదమాతకుగల కరుణ యపారము. సకల ప్రజలను విజ్ఞుల నొనర్పవలయుననియు సత్ప్రవర్తనాతత్పరుల జేయవలయుననియు, జగత్పితయొక్క దయకు సృష్టియందలి యెల్లరను పాత్రుల గావింపవలయుననియు వేదమాత కాంక్షించుచుండును.

విశ్వమునగల వారెల్లరు వైదుష్యము నార్జించినవారై పరస్పర ప్రేమభావ సమన్వితులై—ధర్మమార్గానుసారులై సత్యపథానుగాములై సాధుతత్త్వమున వ్యవహరించి సర్వేశ్వరుని కటాక్షమున సఫలమనోరథులై చరితార్థులు గావలయుననెడి విశ్వకళ్యాణకాంక్షయే వేదములందు సర్వత్ర వ్యక్తమగుచుండును.

"వ్యవస్థితార్యమర్యాదః కృతవర్ణాశ్రమస్థితిః
వేదైస్తు రక్షితో లోకః ప్రసీదతి న సీదతి"

ఆర్య మర్యాదలను జీవితమున నెలకొనజేసి వర్ణాశ్రమ ధర్మ పాలనగావించుట కలవడిన లోకము వేదములచేత సర్వదా రక్షింప

బడును. క్రమక్రమముగ నభివృద్ధి వికాసముల నందుకొనును. దాని కెన్నడును నాశనము లేదు.

ఇట్టి సర్వఫలప్రదమైన వేదమును నిర్ణీతవయస్సునుండియే యధ్యయనము గావించుటకు ప్రయత్నింపవలయును. విద్యార్థిగ నున్నప్పుడే బ్రహ్మచర్యానురక్తి, పారమార్థికజీవితభక్తి సిద్ధింప వలయును. అదనుదప్పినవెనుక సర్వము నిరుపయోగకరమే కాగలదు. కావున వేదాధ్యయనమునకు పూనుకొనబోవుబాలుడు, ప్రత్యేకశ్రద్ధ వహించి తనవయస్సును సద్వినియోగ మొనర్చుకొని, తన సాధనను ఫలవంతము గావించుకొనవలయును. తనకృషి తనయొక్కనికే కాక తనజాతిమొత్తమునకు కళ్యాణమును ఘటించునట్టిదనెడి దృఢవిశ్వాస ముతో తాదృశమైన సామూహిక ప్రయోజనార్థము తనను తానం కితము గావించుకొని యాదర్శప్రాయమైన మనుగడ నడుపవలసి యున్నది. వేదవిద్యాధ్యయన మొనర్చువారికిగల నియమములు కఠినాతికఠినములు. అనుక్షణము వ్యక్తియొక్క సహనము నవి పరీక్షించు చుండును. విద్యార్థి ఈ పరీక్షలయందు నెగ్గి తనలక్ష్యము వంకకు పురోగమింపవలయును.

వాఙ్నియమము, చేష్టానియమము వేదవిద్యార్థికి ముఖ్యము లైన విధులు. అత్యావసరములైనవి, సత్యములైనవి యగు మాటలను మాత్రమే యతడు పలుకవలయును. పరోపకారమునకు తాపీయని, పరులనొప్పింపనిచర్యలను మాత్రమే గైకొనవలయును. సాధ్య మైనంత వరకు చేష్టలను మరచి తగినంత మౌనమును పాటించుచు దృష్టిని యధ్యయనమునందే నిమగ్న మొనరింపవలయును. సత్వ గుణమును పెంపొందించెడి యాహారమునే స్వీకరింపవలయును. మద్య మాంసాదుల జోలికేగరాదు. గంధమాల్యాదులపట్ల అసక్తిని విసర్జింప వలయును. కామక్రోధ మోహలోభాదులకు వశపడక స్థిరచిత్తమున వ్యవహరింపవలయును. బ్రహ్మచర్యమును త్రికరణశుద్ధిగ పాటింప

వలెను. శ్రీమంతుని కుమారుడైనను మధుకరవృత్తి నవలంబింప వలసినదే. నిరుపేద సరసనజేరి కలసిమెలసి జీవితమును గడపుచు విద్య నార్జింపవలసినదే. ఇది యొకవిధముగ - అహంకారమణగుటకు దగ్గరదారి. ఇది నిక్కముగ సమతను, మమతను పెంపొందించెడి పవిత్రధోరణి. వేదవిద్యాధ్యయన సమయమున పాలింపవలసిన నియమము లిట్లుండుటవలననే, వేదవేత్తల జీవితములు నిరంతరాదర్శ ప్రాయములై వర్ధిల్లగలిగినవి. వారిపలుకునకు వాడి, వేడి యేర్పడినవి. వారిభావనకు ప్రబలశక్తి సమకూరినది. వారిదీవెన యమోఘమైనట్టిదై లోకకళ్యాణమునకు హేతుభూతముగ నిల్చినది. ఆ వయస్సునందు కఠోర దీక్షతో వేదసరస్వతిని ప్రసన్నురాలినిగ గావించుకొనగలిగినవారెంతయు ధన్యులు, మాన్యులు.

ఇట్లు విద్యాధ్యయనమును ముగించుకొనినవారు వేదోక్త పద్ధతిలో గృహస్థాశ్రమమును స్వీకరింపవలసియున్నది. జీవితము నందిది యొక మంచి మలుపు. వివాహవ్యవస్థ జాతిప్రగతికి శాస్త్ర విహితమైన పవిత్ర విధానము. ఎనిమిది తరముల పితృబంధువులలో గాని - ఐదు తరముల మాతృబంధువులలో గాని చేరనట్టి శుభలక్షణ సమన్వితయైన కన్యను విధివిధానముగ పెండ్లియాడి యువకుడు గృహస్థుడగును. మనవారు వివాహమునకు జీవితమార్గమున ప్రముఖ ప్రాధాన్యము నిచ్చియుండిరి. గృహస్థాశ్రమమున వ్యక్తి సమాజో పయోగకరములగు సత్కార్యముల నెన్నింటినో యాచరింపవలసి యున్నది. యజమానిగా వ్యక్తి జీవిత ధర్మనిర్వహణ మొనరింప బూనుకొనుతరి తదనుగుణయోగ్య గుణసంపదగల స్త్రీని యెన్నిక చేసికొని వివాహమాడవలయుననుటలో నెంతయో విశాలమైన యర్థమున్నది.

ధర్మార్థం పత్నీ = ధర్మపత్నీ. ధర్మనిర్వహణము కొరకై తనతో సహకరింపుమని కోరి తెచ్చుకొనిన స్త్రీ ధర్మపత్నియట. ఎట్టి

ఉదాత్తమైన యుజ్జ్వల భావనతో భార్యయనెడి మాటకు మనవారు పర్యాయపదమును కల్పించుకొనిరో తిలకించినయెడల మనము ముగ్ధులమగుదుము. కేవలము - ఇంద్రియసుఖముల ననుభవించు నిమిత్తమె వివాహమాడుట భారతీయ సంప్రదాయమునలేదు. సాధువులను, యోగ్యతములైన యతిథులను గృహస్థు సేవింపవలసియున్నది. పంచయజ్ఞముల నాచరింపవలసియున్నది. బహుముఖధర్మకార్యముల నిర్వర్తింపవలసియున్నది. కావున నిట్టి సందర్భములలో గృహస్థాశ్రమమున తనకు చేదోడువాదోడుగ నుండుటకై యజమాని పత్నిని స్వీకరించుచున్నాడు. మన వివాహవ్యవస్థయందలి పరమరహస్యమిది.

మగవా డెంతటిఘనుడైనను గృహగౌరవము నిలుపవలసిన బాధ్యత గృహిణిపైననే కలదు. గృహస్థాశ్రమముయొక్క పరమాశయసిద్ధియు గృహిణిమీదనే యాధారపడియున్నది.

'గృహిణీ గృహభాగ్య ముచ్యతే'

గృహముయొక్క మహాభాగ్యమే గృహిణి. సర్వము నిర్వహించెడివాడు పురుషుడైనను గృహవైభవ మెప్పుడును గృహిణిమీదనే యుండుట సంఘజీవితమున స్త్రీకి మనవారిచ్చిన ప్రాధాన్యమును సూచించుచున్నది. గృహము గృహిణిదే. ఇల్లాలుపద మీయర్థమునే వ్యక్తీకరించుచున్నది.

జాయా పదముతోగాని (ఏ స్త్రీ యందు తాను జన్మించుచున్నాడో ఆమె జాయ) భార్యాపదముతోగాని (పోషణచేయబడెడిది) స్త్రీని సంబోధించుటకు మనవారంతగ సమ్మతింపలేదు. కేవలమవి పర్యాయ పదములుగనే యుండవలయుననియు — లేదేని తాదృశభావ ప్రకటనసందర్భమున నవి స్త్రీలవిషయమున నుపయోగింపబడవలయుననియు భావించియుందురు. సర్వ సందర్భములలో ధర్మపత్నీ పదమునే విరళముగ వారుపయోగించుట మన మరయవచ్చును.

'మమ ధర్మపత్న్యా సహ' అని సంకల్పించియే యజమాని ప్రతివైదిక కార్యక్రమమును ప్రారంభించుచున్నాడు. ప్రతిమంగళకర కార్యక్రమమునకు పూనుకొనుచున్నాడు. ధర్మపత్నీరహితుడైనవ్యక్తి దైవిక కార్యకలాప నిర్వహణలకుగాని, లౌకిక శుభకార్యనిర్వహణ లకుకాని యోగ్యుడుకాడని శాస్త్రము నిష్కర్షగ వివరించుచున్నది. సాంఘిక వ్యవహారముల సమాలోచనసల్పుతరి ధర్మపత్నితో యజ మాని ముచ్చటించిన యనంతరమే యొకనిర్ణయమునకు వచ్చుట యనుభవ పూర్వకముగ లోకమున మనము చూచుచున్న సత్యము.

'మూర్ధానం పత్యురారోహ ప్రజయా చ విరాడ్భవ'

కళ్యాణ సమయమున పురుషునిచే స్త్రీ యిట్లు కోరబడుచున్నది. దాంపత్యజీవిత మీవిధముగ సర్వవిధముల నాదర్శవంతమై సౌభాగ్య వంతమై యలరారవలయునని మనవారి యభిమతము. కాని వారు కాంక్షించినతెఱగున విద్యార్థిజీవితముగాని, వివాహజీవితముకాని నేడు సవ్యపథమున కొనసాగకుండుటయే విచారకరవిషయము. తత్కారణముగనే నేడు సమాజ జీవితమున యూహలకందని వికృత ధోరణులు సముత్పన్నములగుచున్నవి. విద్యార్థులకు గురువులకు మధ్య సత్సంబంధము గగనకుసుమ ప్రాయమై పోయినది. విద్యాధ్య యనకాలమున విద్యార్థియందు క్రమక్రమాభివృద్ధి నందవలసినదీక్ష, నమ్రత, సహనము, మొదలైనవి కొరతబడసాగినవి. విధ్యుక్తధర్మము సమగ్రముగ నిర్వహింపవలసియున్నదనుమాట విస్మరింపబడినది. బాధ్య తలను మరచి ప్రయోజనములను స్వత్వములను వాంఛించెడితత్వము బలపడ సాగినది. గొప్పవారు - కొద్దివారనెడి తారతమ్య భావన విద్యార్థిదశయందే భావిపౌరులు కావలసినవారి హృదయములలో వ్రేళ్ళూదన్నుకొని పరమ మైత్రీభావమునకు బాధకముగ పెంపొంద సాగినది. నిరాడంబరత దూరదూరముగ తరలిపోయినది. క్రమ శిక్షణ మటుమాయమైనది. నియమ నిగ్రహములు నశించినవి. విశృంఖ

లత విచ్చలవిడి నృత్యమొనర్చుట కింతకంటె యనుకూల వాతావరణ మెక్కడ లభ్యపడును? వీరే గృహస్థులైనతరి సంఘ జీవితమున నెట్టి వికార పరిస్థితులుదయించునో వేరుగ వివరింపవలసినపనిలేదు.

గృహస్థాశ్రమమును స్వీకరించిన వ్యక్తి సర్వదా ఋణత్రయము నుండి విముక్తుడగుటకు యత్నమాచరింపవలయును.

'జాయమానో నరః త్రిభిః ఋణవాన్ జాయతే'

పుట్టుచున్న ప్రతిమానవుడు మూడు ఋణములతో పుట్టుచున్నాడు. శాస్త్రోక్త విధానమున సంయమనశీలుడై నిత్యము దేవతల నర్చించుచు సకల సృష్టిని, సకలప్రాణి పరిపాలనను సమర్థవంతముగ నిర్వహించుచున్న సర్వేశ్వరునకు కృతజ్ఞతా పూర్వకముగ జోతలనర్పించువాడు దేవఋణమునుండి విముక్తుడు కాగలడు. నిత్యము వేదాధ్యయన మొనర్చుచు సంధ్యాసమయములలో పరమేశ్వరోపాసన విధివిధానముగ నొనర్చుచు వేదవిహిత కర్మలపట్ల శ్రద్ధయు భక్తియు కలవాడైన నరుడు ఋషి ఋణమును తీర్చుకొనవచ్చును. యోగ్యతములు వంశోద్ధారకులు కులగౌరవదీపకులునగు బిడ్డలను కని పెంచి పెద్దవారి నొనర్చుటయే పితృఋణమును తీర్చుకొనుటకు మార్గము. నేడెందరీ దివ్యపథము ననుసరించి సంచరించుచున్నారు? పరమప్రయోజనదాయకమైన ఈ సనాతన జీవనవిధానమేల విస్మరింపవలసివచ్చినది? ఎవ్వరేని యెక్కించుక మనస్సు నీవంకకు మరల్చియోచింప నారంభించిన - వారుపరిహాస పాత్రులగుచున్నారు. కారణమేమి? కాల మహిమయందమా? మానవుల మనస్సులపై కాలపుతెరలపొరలు నిజముగ నిట్టి వికృత పరిస్థితులను ప్రాదుర్భవింపజేయ సమర్థవంతములైనవే యగుగాక! చిరంతనమైన సంస్కృతి మహిమ ఏమైనది? ఆ సంస్కృతికి వారసత్వమువహించిన మనభావబలమున కర్థమేమి? ప్రత్యుత్తరములు లభ్యపడని ప్రశ్నలివి.

(1) దేవతారాధనము (1) పితృతర్పణము (3) స్వీయులకే కాక పరులకుకూడ ప్రేమగ భోజనముపెట్టుట (4) ఆర్ష గ్రంథపఠనము (5) భూతబలి ప్రదానము మొదలైన పంచయజ్ఞములు మానవుడు నిత్యము నిర్వహింపవలసియున్నది. ఈదృశమైన పరమపవిత్ర విధాన మును భక్తి భావముతో నాచరణయందిడుకొని వర్ధిల్లిన భారతజాతి సకల విశ్వమున కాదర్శప్రాయమైన యొరవడినే దిద్దగలిగినది. వైదిక జీవిత వైశిష్ట్యమును పలుభంగుల ఇట్లభినందించిన మాత్రమున నేమగును? తదాచరణమునకు పూనుకొనినపుడే జాతిలో నొక నూతన చైతన్య ముద్భవిల్లును.

వేదములవలెనే వేదాంగములుకూడ మానవాళికి మహత్తర ప్రయోజనములను ప్రసాదించు నిమిత్తమై ప్రపంచితములైనట్టివే. ఇవి యారు. (1) శిక్ష (2) వ్యాకరణము (3) కల్పము (4) నిరుక్తము (5) ఛందస్సు (6) జ్యోతిషము.

శిక్ష :— అక్షరముల ఉచ్చారణ విషయమున పాటింపవలసిన విధినియమములను, ఉదాత్తానుదాత్త స్వరితములను, స్వరకాల స్థాన ములను విశదీకరించునది శిక్ష. బాల్యముననే ఛాత్రులీ విభాగమును పూర్తిచేసి మంచిజ్ఞానమును పెంపొందించుకొనవలసియున్నది.

వ్యాకరణము :— భాషాతత్త్వమును శాస్త్రాంశములతో వివరించు నది వ్యాకరణము. పాణిని వ్యాకరణ సూత్రములు బాగుగ నధ్యయన మొనర్చి బాలురీవిషయమున ప్రజ్ఞగడించుటకు యత్నించెదరు వ్యాకరణాధ్యయనమునకు దీర్ఘకాలమే పట్టవచ్చును. శబ్దమంజరి ధాతుమంజరి మొదలైనవానిని 5, 6 సంవత్సరముల వయస్సునాటికే బాలురు పూర్తిచేయ గలిగియుండి, పాణిని సూత్రముల వంకకు దృష్టిని మరల్చుట శ్రేయోదాయకము. పిమ్మట సాహిత్యతర్కా లంకార శాస్త్రములు సులభముగ వశపడగలవు.

ఛందస్సు:- వృత్తనిర్మాణమున కవసరమగు యతిప్రాసాది విజ్ఞానమును, గురులఘు వివేకమును, గలుగజేసెడి లక్షణశాస్త్రమిది.

నిరుక్తము – యౌగికార్థముల వివరించెడి నిఘంటువుగా బేర్కొనదగిన బృహద్గ్రంథము.

జ్యోతిషము:- సూర్యచంద్రాదులగమనము ననుసరించి నక్షత్రములయొక్క నడకనుబట్టి కాలమున నేర్పడెడి విశేషాంశము లను విశదీకరించెడి ఖగోళశాస్త్రము.

కల్పము:- యజ్ఞములు, వాని నిర్వహణ పద్ధతి, వ్రతములు, వానినాచరించు విధానము, మొదలైన యంశములిందుండును. వేదా ధ్యయన తత్పరులు వీనినన్నింటిని క్రమవిధానమున పూర్తిచేసి సకల లోకాభినందనపాత్రమైన వైదికసంస్కృతికి వన్నెలు దిద్దిరి.

లోకకళ్యాణము నుద్దేశించి యొకానొక పవిత్రస్థాయిలో మాన వాళి కుపదేశింప బడిన యజ్ఞనిర్వహణ పద్ధతియందును క్రమముగ కాలుష్యమేర్పడినది.

'యజ దేవపూజా సంగతికరణ దానేషు' అను ధాతువు నుండి యజ్ఞమను పదమేర్పడినది.

'న ధ్వరతీతి అధ్వరః' హింసాకర్మకు తావులేనిది కనుక యజ్ఞ మున కధ్వరమనెడి పేరు వచ్చినది.

'యజ్ఞోవై విష్ణుః' విష్ణువేయజ్ఞము. యజ్ఞ మొనర్చుటనగా విష్ణువును పూజించి సేవించుట. కావున యజ్ఞము విష్ణు ప్రీతికరము.

'యజ్ఞోవై శ్రేష్ఠతమం కర్మ' యజ్ఞము శ్రేష్ఠమైన యొక దివ్య కర్మయని వ్యక్తమగుచున్నది. యజ్ఞము దేవకార్యము. యజ్ఞముల మూలమున సృష్టికి క్షేమము కలుగును. యజ్ఞము జాతికి వికాసము నందించును. ఇది ప్రపత్తిరూపకమైన దివ్యభావనను మానవులలో

నెలకొల్పును. యజ్ఞప్రతిభ విశాలజీవితప్రతిభకు సూచకము. యజ్ఞమార్యులకు సంఘజీవితమున మహోన్నత స్థానమును కల్పించినది.

నిజముగ యజ్ఞమొక పవిత్రకర్మ. అది మానవుని బంధింపదు. కొందరు శ్రోత్రాదులయిన యింద్రియములను నిగ్రహమనెడి అగ్నియందును, కొందరు శబ్దాదులగు విషయములను ఇంద్రియములనెడి అగ్నియందును, ఇంక కొందరు ఇంద్రియ కర్మములను ప్రాణకర్మములను మనోనిగ్రహమనెడి అగ్నియందును ప్రేల్చుచున్నారు. మరి కొందరు మితాహారము భుజించుచు ప్రాణాయామాది కార్యములను ఆచరించుచున్నారు. ఇట్లు ద్రవ్యయజ్ఞములు, తపోయజ్ఞములు, యోగయజ్ఞములు, స్వాధ్యాయ యజ్ఞములు, జ్ఞానయజ్ఞములు పెక్కు రకములు గలవు. ఈ యజ్ఞము లెంతటి పవిత్రభావోపేతములో చూచితిరా! యజ్ఞమునకు హృదయము శ్రద్ధ. శ్రద్ధ విశ్వాసమును, నిగ్రహమును, పవిత్రతను, అర్చనమును ప్రకటింపజాలును - ఈ యజ్ఞభావరూపమున, తదాచరణరూపమున భారతీయులు ప్రపంచమున కొక దివ్యసందేశము నందించినారు. శాంతిసాధనమును చూపినారు. ఉత్తమాదర్శమును ప్రకటించినారు.

ఒక్కమాటలో చెప్పవలెనన్న యజ్ఞశాలలన్నియు ఆర్ష భావ ప్రయోగశాలలై సనాతన పవిత్ర భావవికాసమునకు దోహదప్రాయములైనవి. ఈ పవిత్ర భావనతో యజ్ఞకాండ సాగివచ్చినను నిర్వహణలో క్రమక్రమముగా కొన్ని వికృతములైన మార్పులేర్పడినవి. దినములు గడచిన కొలదియు నవి ముదురుపాకమునబడినవి. యజ్ఞపద్ధతి చెడు దారుల బట్టినది. యజ్ఞకాండ అపహాస్యమునకు గురియైనది.

యజ్ఞమున సోమపానమొనర్పవచ్చునని యొక నియమము కలదు. సోమయనెడి పేరుగల యోషధీరసమును యజ్ఞకర్తగ్రోల వచ్చునని దీని యర్థము. సోమరసపానమువలన యజ్ఞనిర్వహణ మొనర్చువారికి మంచి సత్తువ, యుత్సాహములేర్పడి యలసట

తొలగునని యిట్టి నియమము నేర్పరచియుందురేమో! కాని కాలాంతరమునందీ నియమము యథేచ్ఛగా మద్యపాన మొనర్చుట వలన కలిగెడి - మత్తువంటి మత్తును పొందుటకు వీలు కలుగ జేసినది. అది యొక వికృత పరిణామము.

'స్వర్గకామో యజేత'

స్వర్గసుఖములననుభవించుటకే యజ్ఞములనొనర్చవలయుననెడి విచిత్రవ్యాఖ్యాన మమలునకు వచ్చినది. యజ్ఞకర్మల విషయమున, త్యాగభావము విశాలదృష్టి, లోకకళ్యాణము మఱుగున బడిపోయినవి. అశ్వమేధ, గోమేధ, నరమేధాది యజ్ఞములలో గుఱ్ఱములను గోవులను మొదలైనవానిని చంపి వానివపను మనసార నాఘ్రాణించుట కరవు దీర భుజించుట మొదలైన యంశములు స్వేచ్ఛగనే యాచరణము నందుంచబడినవి.

'అగ్నిర్వా అశ్వః' 'ఆజ్యం మేధః'

అగ్నియందాజ్యమును పోసి వ్రేల్చుటే నిజమైన అశ్వమేధమున కర్థము. కాని ఈయర్థముల నెవ్వరును గమనించినట్లుతోచదు. శతపథ బ్రాహ్మణము - ఐతరేయ బ్రాహ్మణము మొదలైనవి యజ్ఞకాండకు సంబంధించిన యంశములనే సవిస్తరముగ ముచ్చటించినవి.

"బ్రాహ్మణాని మంత్రార్థ వివరణాని తత్ర తత్ర
యజ్ఞోపయోగిని భవం తీతి"

బ్రాహ్మణములయందు విధివాక్యములు పుష్కలముగ నున్నవి.

అగ్నిహోత్రారాధనము, యజ్ఞములు మొదలైన భారతీయుల దివ్యాచారములలోగల పవిత్రతత్త్వమునందలి సత్యమునరసిన పాశ్చాత్య పండితులెందరో పలురీతుల శ్రమించి బ్రాహ్మణారణ్యకముల నధ్యయన మొనర్చిరి. అందలి మహిమల నాస్వాదించి యానందించిరి.

పిమ్మట యుపనిషత్తులు, భగవద్గీత మొదలైన వాని వంకకు దృష్టిని సారించిరి. వానిపై బ్రహ్మాండమైన పరిశ్రమ కొనసాగించిరి. వీరికృషి అనంతమై శాఖోపశాఖలతో వన్నెలచిన్నెలగలిగి విరాజిల్లుట విశేషము. కర్మకాండకు, యజ్ఞములకు ప్రాధాన్యము నొసగిన బ్రాహ్మణముల పట్ల పాశ్చాత్య పండితులు భక్తిప్రపత్తులట్లుండెను. మనవారిలో మాత్రము బ్రాహ్మణములు వివరించిన యజ్ఞయాగాదుల విషయమున భిన్న విభిన్న భావనలు పెరిగి వైఖరులు వైచినవి. బ్రాహ్మణము లను గురించి మరింకెన్నియో వైరుధ్యము లేర్పడినవి. పాశ్చాత్యులు మాత్రము బ్రాహ్మణములన్నింటిని యుపనిషత్తులతో బాటుగ, భగవద్గీతతో బాటుగ వారి భాషయందనువదించుకొని మురియసాగిరి.

సర్వమానవాళికి జెందిన సర్వేశ్వరసాహిత్యసమగ్ర స్వరూప మగు వేదమునుగురించి ప్రాక్తనకాలమునుండియు నీ విధముగనే బహువిధ భావవైరుధ్యము లుండెననుట నిర్వివాదాంశము. మంత్రములు మాత్రమే వేదభాగములని కొందరి యూహ. వానితోబాటుగ బ్రాహ్మణములనుగూడ వేదభాగములుగనే సంభావింపవచ్చునని కొందరి సిద్ధాన్తము. ఆరణ్యకములనుగూడ వదలవలసినపని లేదనియు, నవిగూడ వేదభాగములే యగుననియు కొందరి నిర్ణయము. ఉపనిషత్తు లేల వేదభాగములు గావని కొందరి ప్రశ్న. మంత్ర బ్రాహ్మణారణ్యకోపనిషత్సర్వమును గలిసియే వేదమగునని కొందరియభిప్రాయము. మంత్రబ్రాహ్మణములకు మాత్రమే వేదనామార్హత గలదని కొందరివాదన. ఉపనిషత్తులనే వేదసర్వస్వముగ నెంచదగునని కొందరి ప్రతిపాదన. పలువురీ విధముగ వారివారిబుద్ధి వికాసమున కనుగుణముగ చిత్రవిచిత్రనిర్ణయములు గావింపదొడగిరి.

ఇట్టి వింత వ్యాఖ్యానముల వలన వేదస్వరూప మవగాహన మగుటకు మారుగ గందరగోళపు పరిస్థితి యేర్పడినది కాలము గడచుకొలది, వాదముల సంఖ్య పెరుగసాగినది. వ్యవహారమున

బడిన చిక్కుముడి మరింతగ బిగిసికొనిపోవ నారంభించినది. ఈ వాదములను లేవనెత్తినవారిలో ప్రాచీనార్వాచీన కాలములకు జెందిన పండితులును గలరు. వారివాదనలన్నియు వినుటకు యుక్తియుక్తములుగ నుండవచ్చును. సత్యబద్ధములైనవానివలె దోచవచ్చును. కాని వాస్తవముగ నాలోచించినచో వీరి నిర్ణయము లెవ్వియును నామోద యోగ్యములు గానేరవు. వీరి వాదనలకు వేదముల యందు ప్రమాణము గన్పింపదు. వేదసమ్మతములుగాని యంశములకు విలువ శూన్యము. సమయ సందర్భముల ననుసరించి-ఈ వాదముల నుత్పన్నము గావించిన వారిలో ఆవేశము స్వైరవిహార మొనర్ప సాగినది. ఉద్రేక పరిస్థితి సత్యప్రకటనమున కడ్డుకట్టయే యగునుగదా!

ప్రశాన్తవాతావరణమున పరస్పర ప్రేమాభిమానములతో రాగద్వేషముల కతీతముగ నాలోచించవలసిన సమస్యలివి. అహము ముందునకువచ్చి 'నామాటయే' నెగ్గవలెననెడి యాలోచన యిట్టి వారిలో రాదగదు. కాని వచ్చినది. కావుననే వేదస్వరూపము నిదమిత్థమని ప్రామాణిక దృష్టితో నిర్వచించి, నిర్ణయించుట కవకాశము క్షీణించినది.

మొత్తముమీద నీయనభిమత సమస్యా పరిష్కరణకొఱకై సముద్ధతమైన యాత్మశక్తితో సముద్యోగించి సత్యార్థ ప్రకాశన మొనరింపజాలిన మహత్తర గౌరవము స్వామిదయానంద సరస్వతికి దక్కినది.

మంత్రములు - సంహితలు మాత్రమే వేదములని నుడివిన దయానందులవారి మేధాబలముతో నొక మార్గమేర్పడినది. వారి సముచిత నిర్ణయమునకు బలిష్ఠ ప్రమాణములను వేదముల నుండియే కోకొల్లలుగ వారుదాహరించిరి.

సత్యదృష్టిగల యీ మహనీయుడు సత్యానుష్ఠాత. సత్యమును మహోన్నత పీఠముపై నిల్పి విజయ పతాక నెగురవేయ సంకల్పించి

'సత్యార్థ ప్రకాశము 'ను గావించిన సంయమిచంద్రుడు. పలువురు పెద్దలు ప్రముఖులు నగు వారీ సత్యభావనుని సంస్తుత్యనిర్ణయమును సర్వవిధముల నభినందించిరి. దివ్యజ్ఞాన సంపన్నుడైన యీ మహా యోగి యోచన ఫలముగ హేతుబద్ధము. శాస్త్ర సమ్మతమునగు బరిష్కార మీ విషయమున గుదిరినది. ఇది యామ్నాయరంగమున గలిసివచ్చిన మహాదృష్టము, సర్వేశ్వర సంకల్పము. ఇక బ్రాహ్మణ ముల విషయమును గూర్చి యించుక చెప్పవలసి యున్నది.

బ్రహ్మ యన వేదము. తద్వ్యాఖ్యయే బ్రాహ్మణము.
'ఇత్యపి నిగమో భవతి ఇతి బ్రాహ్మణమ్'

— యాస్కుని నిరుక్తము.

'ఛందో బ్రాహ్మణాని చ తద్విషయాణి'

— పాణిని – అష్టాధ్యాయి.

బ్రాహ్మణములపై నిట్టి చక్కని వివరణలున్నవి. అయినను మధ్య మధ్య నిట్టి వాదోపవాదములు వాదుల వాక్ చతురతకు నిదర్శనములు గనే సమావిర్భూతములై యుండవచ్చును. వాదకౌశలముగల వారి మేధాబలమునకు మాత్రమే యవి ప్రత్యక్ష సాక్ష్యములు. కాకున్న వేదహృదయమును విపుల విశేషములతో వ్యాఖ్యానించెడి బ్రాహ్మణ ములు వేదము లెట్లు కాగలవు ?

దయానందులవారు తుదకీవిధముగ నీయంశముపైన సందిగ్ధ ముగ సర్వజనామోదయోగ్యమైన తీర్పునే యిచ్చిరనవచ్చును.

ఏది యేమైనను మనము వినదగినది వేదసందేశము. మనము శిరసావహింపదగినది వేదపరమార్థము. విశ్వమునగల ప్రతిజీవియు ప్రతిక్షణము సంస్మరింప దగిన పరమ రహస్యమిదియే. పరమోత్తముడు పరంధాముడునగు పరమేశ్వరుని దివ్యకటాక్షమునకు పాత్రులము గావలయుననిన మార్గాంతరములేదు.

శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః
ఆయేధామాని దివ్యానితస్థుః
వేదాహమేతం పురుషం మహాన్తం
ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్

'తమేవ విదిత్వాతి మృత్యుమేతినాన్యః పన్థావిద్యతేఽయనాయ.' దివ్యలోక నివాసభాగ్యమునందజాలిన యమృత పుత్రులారా! వినుడు. మీరెల్లరి యజ్ఞాన జలధి నవలీలగ దాటవలయుననిన పరమ శ్రేష్ఠమైన పవిత్ర పథమొకటి యున్నది. అజ్ఞానాంధకారమునకవ్వల వెలుగొందు పరమపురుషుని గనుగొనుటయే - ఆమార్గము. మరొకమార్గము లేదు. కలదని భ్రమించి ప్రాకులాడవలదు; వేదమంత్రముల పవిత్రార్థము లిపగిది. దేవాదిదేవుని బిడ్డలమైన మనము, దివ్యదేశవాసులమైన మనము, దివ్యజ్ఞానసాధనానురక్తులమైన మనము, నిజముగ నమృత పుత్రులమని నిరూపించినది.

పురుషోత్తముడైన సర్వేశ్వరుని దర్శించుట కన్న అజ్ఞానజలధి నవలీలగదాటుటకు మిన్నయైన మార్గాంతరము సున్నయనియు నెలుగెత్తి చాటినది. మనయందు గుప్తముగ నణగియున్న యజ్ఞానాంధకారమును పారద్రోలగల మహత్తరశక్తి పరంజ్యోతిస్వరూపునకొక్కనికే కలదనెడి నిశ్చయ భావమును సర్వమానవాళిలో రేకెత్తింప జేసినది. ఆవెలుగును తిలకించుటకే - తిలకించి పులకించుటకే యత్నమును కొనసాగింపుడనియు నుద్బోధించియున్నది.

"లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటికవ్వల నెవ్వం
డేకాకృతిలో వెలుఁగు—

అని ప్రశ్నించుకొని పోతనమహాకవి - అట్లు వెలుగునది, పరంజ్యోతి స్వరూపుడైన పరమాత్ముడొక్కడేయనియు, ఆ దివ్యమూర్తినే

భజింతుననియు పారవశ్యమున వాకొనినాడు. పూర్ణ భగవద్విశ్వాస ముతో చిత్తశుద్ధితో నిండు భక్తితో మనుగడను ఫలవంత మొనరించు కొనుమని నరుని వేదవిజ్ఞాన మాదేశించుచున్నది.

వైషమ్యములు లేని సోదరభావ సంపన్నమైన పరస్పరాను రాగ పూర్ణమైన సహానసఖ్య సమన్వితమైన సమతా దృష్టియుతమైన శాంతిమయ సుఖజీవితమునే మనము వాంఛింపవలసియున్నది. వైదిక విజ్ఞానమంతయు మనలనందర నాక్రమమున తీర్చిదిదుటకే బహు ముఖముల పరివ్యాప్తమైనది.

ఈ ఋగ్వేద మంత్రమును వినుడు.

"సంగచ్ఛధ్వమ్ సంవదధ్వమ్ సంవోమనాంసి జానతామ్
దేవాభాగం యథాపూర్వే సంజానానా ఉపాసతే

సమానో మంత్రస్సమితి స్సమానీ
సమానం మనః సహచిత్తమేషామ్
సమానం మంత్ర మభిమంత్రయేవః
సమానేన వో హవిషా జుహోమి
సమానీవ ఆకూతిః సమానాహృదయాని వః
సమానం అస్తు మే మనో యథావః సుసహోసతి"

(ఋగ్వేదము : 10–191–2)

సకల వేదవిజ్ఞాన సమష్టి సారమగు సనాతన ధర్మము విశాల దృక్పథముతో విస్తరించినది. మహర్షుల మహనీయ మధుర వాక్కుల బలమున సాంఘిక సంక్షేమమును సంఘటించుచు వచ్చుచున్నది. బ్రహ్మాండమైన లక్ష్యము నిడుకొని నరుడు భగవదనుగ్రహపాత్రుడై తరించు నిమిత్తము—భగవదారాధనమే జన్మకు మహత్తరాదర్శమని గుర్తించు నిమిత్తము—సనాతన ధర్మమొక ప్రబల సాధనమగుట మహా భాగ్యము.

# సనాతన ధర్మజ్యోతి

* * *

స్మృతులతో బాటుగ మరియొక వంక ఉపనిషత్తులుగూడ సనాతన ధర్మోద్దీప్తికి దోహద మొనర్చుచు వర్ధిల్లసాగినవి. వేదతాత్పర్యము సర్వమానవులకు సులభముగ నవగాహనమగుటకొఱకై లోకసంక్షేమ కాంక్షతో మహర్షులు స్మృతులను వెలయింపజేసినారు. స్మృతులు పలురూపములలో నున్నవి. చాలవరకు స్మృతులన్నియు నాయా మహర్షుల నామములతో వ్యవహృతములై యుండుట గమనార్హ విషయము. మనుస్మృతి, పరాశరస్మృతి, అంగిరసస్మృతి, హారీతస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి మొదలయిన వన్నియునట్టివే. ఆచారకాండను, వ్యవహారకాండను, ప్రాయశ్చిత్తకాండను బేర్కొనుచు స్మృతి సర్వస్వమునగల విషయము ముఖ్యముగ మూడు విభాగములక్రిందికి వచ్చుచున్నది. చక్కని సంస్కారమును నరులలో నెలకొల్పుటకు స్మృతులీ విధముగ రాచబాటలైనవి.

స్మృతులు ప్రతిపాదించెడి జీవితవిధానము పరమయోగ్యమైనట్టిది. సర్వతోముఖ సముచితత్వమునే ప్రసాదించెడి యీ స్మృతులు సంఘమునందాధ్యాత్మికానురక్తిని, పారమార్థిక భావభక్తిని మహోన్నత శీలసంపాదనాసక్తిని, మానవులకందించుచున్న వనుటలో విప్రతిపత్తి యించుకేనియు లేదు.

స్మృతులతో బాటుగ సనాతన జీవిత తత్త్వ ప్రాభవమును పెంపొందింప సమకట్టి ముందునకు వచ్చినవి యుపనిషత్తులు. సామాన్యమానవు లుపనిషత్పారాయణ మనునది వార్ధక్యమునగలవారికే పరిమితమైన యంశమని యెంచుచుందురు. వేదాంతులకు మాత్రమే యుపయోగపడెడి విషయము లుపనిషత్తులలో కథితములైనట్లు దుర్భ్రమ జెంది పెక్కుమంది యుపనిషత్తుల నలక్ష్య మొనర్చుచున్నారు.

వాస్తవమునకిది సత్యమైన యూహ గానేరదు. ప్రతి మానవున కత్యవసరములైన యంశములెన్నియో యిందున్నవి. ఈ సత్యమును సమస్త ప్రజలు గుర్తింపవలసి యున్నది.

మానవత యెట్లు సిద్ధించుచున్నది? జన్మకర్మల కంతరార్థము లెవ్వి? మరల మరల పుట్టుచుండుటకు హేతువులేమేనిగలవా? పునర్జన్మముగలదా? ఉండిన, దానికేదైన ప్రత్యేకార్థమున్నదా? జీవునకు నాత్మకుగల సంబంధమేమి? మొదలయిన చిత్రవిచిత్రాంశముల కెన్నింటికో యుపనిషత్తులందు సమాధానములు లభ్యపడును.

జగత్తంతయు పరబ్రహ్మమయమనియు నాతనిపై నాధారపడియే జగత్తు నడక సాగించుచున్నదనియు ప్రతిక్షణము నరులకు గుర్తుచేయునవి యుపనిషత్తులు. లోకమును జ్ఞానమయమొనర్పవలెననియు, జ్ఞానమార్గమున మానవుని నడిపింపవలెననియు నుపనిషత్తులుద్బోధించుచున్నవి. మానవుని సంసార దుఃఖమునుండి విముక్తుని గావించునవియే యుపనిషత్తులు. ప్రజలలో చక్కని జ్ఞానమునుదయింప జేయుటే యుపనిషత్తుల లక్ష్యము.

112 ఉపనిషత్తులు గలవని విజ్ఞులొక లెక్కనుగ్గడించుచున్నారు కాని వీనిలో పదమూడు మాత్రమే ప్రాచీనోపనిషత్తులు.

మహామంత్రముల యర్థమును సముచితవైఖరిలో సమన్వయించి మానవునకు మనశ్శాంతిని కలుగజేయుటకొఱకే యిట్టి సందర్భమున నుపనిషత్తుల నుత్పత్తిల్ల జేయవలసివచ్చినది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ
నమోబ్రహ్మణే నమః"

అనెడి మంత్రములనే బోధించుచు జాతిని తరింపజేయ నుపనిషత్కర్తలు విశుద్ధమైన ప్రణాళికను నిర్మించి ఉపనిషత్పరిచయము

మానవునకెంతయు ముఖ్యమైన యంశము. ఉపనిషత్ప్రియూషమును సర్వవిశ్వమునకు బంచియిచ్చిరి. ఆ సాధు భావన—సంస్తవనీయము.

సనాతన ధర్మమున కాధారభూతమైన వాఙ్మయమునందు కల్పసూత్రములు ప్రధానభాగములు. శ్రౌతసూత్రములనియు, స్మార్త సూత్రములనియు రెండు విధములు. విభిన్న విధములైన సోమయాగములు-అగ్నిత్రయాధానము-అగ్నిహోత్రవిధి మొదలైన విషయములను గురించి శ్రౌతసూత్రము విపులముగ చర్చించినది.

గృహ్యసూత్రములు, ధర్మసూత్రములు నను పేర ద్వివిధముగ స్మార్తసూత్రములు ప్రచారమునకు వచ్చినవి. మానవుని నిత్యజీవితమున కవసరమగు షోడశసంస్కారవిధి విధానము తత్ప్రాశస్త్యము గృహ్యసూత్రములలో మహోదాత్తముగ వర్ణింపబడియున్నది.

ప్రభువునకు ప్రజలకుగల కర్తవ్యములను గురించియు, మతవిషయికములైన నియమములను గురించియు, ధర్మమునకు సంబంధించిన నిబంధనలను గురించియు ధర్మసూత్రములలో ప్రస్తావింపబడియుండెను.

భారతీయ జీవితవిధానమున చతుర్వేదము లెట్లు పూజ్యములుగా భావింపబడుచున్నవో, చతురాశ్రమములుగూడ నట్లే పరమపావనములుగా నెంచబడుచున్నవి. చతురాశ్రమములవారు పాటింపదగిన శాస్త్రసమ్మతములైన ధర్మములెవ్విగలవో, వాని నన్నింటిని 'ధర్మసూత్రములు' సమగ్రముగ నిర్వచించినవి.

మానవులు భిన్నస్వభావులుగ నుండుట, భిన్నవిధములుగ సంచరించుచుండుట లోకమున గాంచుచున్నాము. ప్రపంచమున సర్వత్ర దృగ్గోచరమయ్యెడి యీ విభిన్నత యనాదిసిద్ధమైనట్టిదే. మానవుల గుణకర్మలనుబట్టి చతుర్విధముల నీవర్ణవిభాగ మొనర్పబడినది. నాలుగుమార్గముల పయనించెడి మానవులకు నాలుగురకములైన కర్తవ్యములు నిర్ణయింపబడినవి. సనాతన ధర్మముగావించిన ఈ వర్గీ

కరణము న్యూనాధిక్య భావమును సూచించునది కాదు. వారి వారి ధర్మములను వారు నిర్వహించుకొనుచు సర్వేశ్వరుని కృపకు సమానముగ నెల్లరు పాత్రులుకావచ్చునని సనాతనధర్మ ముద్ఘోషించుచున్నది. కావుననే యేయొక్క వ్యక్తిమీద నాధారపడక యేదో యొకకాలమునకు మాత్రమే కట్టుబడక నిత్యసత్యముగ సనాతన ధర్మము వెలుగొందు చున్నది. తద్ధర్మానుసారముగ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లనెడి పేర్లతో నాలుగువర్ణములవారు పిలువబడుచున్నారు.

> "చాతుర్వర్ణ్యం మయాసృష్టం
> గుణకర్మ విభాగశః"

అని భగవద్గీత ఈవర్ణక్రమమును గురించియే వివరించియున్నది. వర్ణవిభాగమున హెచ్చుతగ్గులులేవు. ఎవరిస్థానమున వారు గొప్పవారే. వారి వారి నిర్ణీత ధర్మములను నిపుణతతో నిర్వహించి ప్రత్యేకతను గడించుట కవకాశము కలదు. మనజీవితవిధానమున తొలుతనుండియు వచ్చుచున్న వర్ణములు నిష్కర్షగ నాలుగే యని నిరూపింపబడి యుండెను. ఐదవవర్ణము మనకులేదు.

> "బ్రాహ్మణోఽస్యముఖమాసీత్
> బాహూరాజన్యః కృతః
> ఊరూతదస్య యద్వైశ్యః
> పద్భ్యాగ్ం శూద్రో అజాయత"

ఋగ్వేదము కీర్తించిన విరాట్పురుషుని రూపమునందు బ్రాహ్మణులు ముఖము; క్షత్రియులు బాహువులు; ఊరువులే వైశ్యులు; శూద్రులు పాదములుగను వర్ణింపబడిరి. శరీరమునగల ప్రధానభాగములుగ విరాట్పురుషుడు నాలుగు వర్ణములను గలిగియుండెను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు విరాట్పురుషుని స్వరూపమున ప్రత్యేక ప్రత్యేక ప్రధానభాగములుగనే వర్ణింపబడియుండిరి. ఇందొకరు

గొప్పవారనియు మరొకరు కొద్దివారనియు భావమువచ్చుట కవకాశ మొక్కింతేనియు గన్పట్టుటలేదు. విషయమిట్లుండ నీ మంత్రమునకు పలువురు కువ్యాఖ్యలు గావించి విపరీతార్థముల గల్పించి యనవసర కలహముల కంకురార్పణచేసిరి. పై మంత్రమునగల 'అజాయత' అనెడి పదమునకు- 'అయ్యెను', 'పుట్టెను' అనెడి యర్థములను సందర్భానుసారముగ చెప్పుకొనవచ్చును. దాని నాధారముగ గొని బ్రాహ్మణులు ముఖమునుండి; క్షత్రియులు బాహువులనుండి, వైశ్యులు తొడలనుండి, శూద్రులు పాదములనుండి పుట్టిరనెడి ధోరణిలో వ్యాఖ్యానము కొనసాగించి న్యూనాధిక్య భావమును చతుర్వర్ణములవారిమధ్య రేకెత్తింపఁజేయ కొందఱు బుద్ధిమంతులు యత్నించిరి. ఈ యపవ్యాఖ్యానమునకు ఋగ్వేదమంత్రమునం దీషణ్మాత్రమేనియు నాధారము లేదు.

| | |
|---|---|
| 'ముఖం కిమస్య' | విరాట్పురుషునకు ముఖమేది? |
| 'కౌ బాహూ' | చేతు లెవ్వి? |
| 'కా వూరూ' | ఏవి తొడలు? |
| 'పాదాఉచ్యేతే' | పాదము లెవ్వి? |

ముందుమంత్రమున ప్రశ్న లీవిధముగ వేయబడినవి? వారు ముఖమగుదురు. వీరు చేతులగుదురని రెండవమంత్రమున సమాధానము చెప్పబడినది. ఈ మంత్రమున జన్మలవిషయమునకుగాని, జన్మస్థాన నిర్ణయముల విషయమునకుగాని ప్రసక్తిలేదు. శరీరమున బాహువులు (క్షత్రియులు) లేనిచో ముఖము (బ్రాహ్మణులు) చేయునదేమి? ఊరువులు (వైశ్యులు) లేనిచో ముఖబాహువులుండియు పూర్ణప్రయోజనము సిద్ధించునా? పాదములు (శూద్రులు) లేనిచో దేహధారి ముఖముగల వాడయ్యు, బాహువులు కలవాడయ్యును ఊరువులుకల వాడయ్యును నిరుపయోగకరుడేయగునుకదా? కావున నొకవర్ణము వారిని కించపరచి మరియొకవర్ణము వారిని మహోన్నత స్థానమం

దుంచెడి భావనకే యిచట ప్రసక్తి లేదు. సర్వావయవముల యొక్క సమిష్టి సహకార సంపత్తి వలన దేహధారి ఎట్లు సకలాభిమతములను సాధింపగలుగునో! అట్లే సమాన బాధ్యతలుగల సమానార్హతలుగల చతుర్వర్ణములవారు పరస్పర సమష్టిసహకార సంపత్తితో వ్యవహరించి సమాజజీవితమున సకల ప్రయోజనములను సాధించుకొనవచ్చుననెడి దివ్యభావనయే యిందు సూచితమైయున్నది. సందర్భశుద్ధిని గుర్తింపక మానవులనడుమ నిమ్నోన్నతస్థితులనే యీ మంత్రము వ్యక్తీకరించుచున్నదనుట వ్యాఖ్యాతల వక్రదృష్టికే సాధ్యము. వర్ణములు గుణకర్మలనుబట్టియే వచ్చినవి. జన్మముచేత మాత్రము కాదు.

'జన్మనా జాయతే శూద్రః సంస్కారాత్ ద్విజ ఉచ్యతే
వేదపాఠీ భవేద్విప్రః బ్రహ్మజ్ఞానీ చ బ్రాహ్మణః'

— మనువు

ఒక దేహమునగల యవయవము అందొకటి హెచ్చు మరియొకటి తగ్గును కాదు, అగుటకు వీలులేదు.

దేహసమష్టి సౌభాగ్యమునకు సర్వావయవ కృషియు నత్యంతావశ్యకము. పరస్పరానురాగముతో, సహనశీలముతో, సహకార తత్పరతతో నెవరిధర్మములను వారు చక్కగ నిర్వహించుచో లోకశాంతిని ఘటించుకొనుటకొరకే సర్వవర్ణములవారును సమిష్టిగ యత్నింపవలయును, వర్ణవ్యవస్థయందలి పరమాశయమిది.

ఈ చతుర్వర్ణములవారికిని గల నియమములను, జీవితాచార వ్యవహారములను, విధినిర్వహణమున పొరపడినప్పుడు జరుపుకొనవలసిన ప్రాయశ్చిత్తాదులను స్మార్తసూత్రములలో భాగములగు 'ధర్మసూత్రములు' సమగ్రముగ వివరించుచున్నవి. ఆపస్తంభ సూత్రములు, బోధాయన ధర్మసూత్రములు మొదలైనవన్నియు నీ విధముగ చాతుర్వర్ణ్యములవారి కర్తవ్యములను సూచించునట్టివే. సత్పథమున మానవకోటిని నడువుమని శాసించునట్టివే. వీనిలో బ్రహ్మ

చారులు, గృహస్థులు, సన్యాసులు పాటింపవలసిన ముఖ్య విధులన్నియు వివరింపబడినవి.

సర్వమానవుల నిత్యజీవిత విధులను వివరణాత్మకముగ మానవ జాతికి మూలపురుషుడైన మనువు తనధర్మశాస్త్రమున స్పష్టీకరించియున్నాడు. సనాతన ధర్మపరిబోధము గావించెడి శాస్త్రశ్రేణిలో మనుధర్మశాస్త్రమునకుగల స్థానము నిరుపమానము. మనుధర్మ శాస్త్రముమీద సర్వభారతమునగల సకల ప్రాంతములనుండియు వ్యాఖ్యలు వచ్చినవి. ఈ వ్యాఖ్యలలో శ్రీమేధాతిథి యనెడి విద్వద్వరేణ్యుడు సృష్టించిన 'మనుభాష్యము' మిక్కిలి పురాతనమైనదిగా నెంచబడుచున్నది. శ్రీగోవిందరాజ భాష్యము మిక్కిలిఖ్యాతిని గడించినది. సయామ్, జావా మున్నగు ద్వీపములలో మనుధర్మ శాస్త్రమునే న్యాయనిర్ణయమున నికషోపలముగ గ్రహించుచున్నారు. కొన్నిదేశములలో వాడుకయందుగల న్యాయశాస్త్ర గ్రంథముల మీద మనుస్మృతి ప్రభావము మెండుగనున్నట్లు కోవిదులుగ్గడించుచున్నారు.

'యద్వైకించ మను రవదత్ తద్భేషజమ్'

అనెడిసూక్తి మనుధర్మ శాస్త్రస్థాయిని ముక్తకంఠమున నెలుగెత్తి చాటుచున్నది. మనుధర్మము మానవధర్మమైనది.

యాజ్ఞవల్క్య నారదస్మృతులు స్మృతి పరంపరలో గణనీయములు. పరాశరస్మృతి కలియుగ వ్యవహారానుకూలముగ ప్రాచీన కాల స్మృతుల నన్నింటిని దృష్టియందిడుకొని తత్తద్ధర్మముల క్రోడీకరించుచు వివరింపబడినది. సందర్భానుసారముగ యుగధర్మానుగుణముగ-ఆచారకాండను కొంత సవరించి ధర్మానుష్ఠాన విషయమున ప్రజలకు కొంత సౌలభ్యముగూడ నిందు కల్పించబడియుండెను.

'కృతే తు మానవోధర్మః
త్రేతాయాం గౌతమ స్మృతిః
ద్వాపరే శంఖ లిఖితః
కలౌ పారాశర స్మృతిః'

ఇంద్రియముల బలము గొప్పది. వాని యుద్ధతి నుండి తట్టుకొని మానవుడు నిలువవలయును. లేనిచో సర్వేశ్వరానుగ్రహము వానికి సిద్ధింపదు. కావుననే ధర్మబద్ధమైన జీవిత విధానమును మానవుడు శిరసావహింపవలసియున్నది. మనోబలసంపన్నులైన మహర్షులు ధర్మ నిబంధనలను మానవక్షేమార్థమై వెలయించి యున్నారు. ధర్మ సంకల్పమునకు తలవంచి - ఇంద్రియముల నడుమలోనుంచి నరుడు నారాయణుడగుటకు మార్గము నన్వేషింపవలయును. మనువు తన శక్తివంతములైన వాక్కులతో మానవాళికి శ్రేయమును కలిగించెడి పథమున వెలుగు వెల్లువలను పొరలింప జేసినాడు. గౌతమాదులు సహజస్వచ్ఛకాంతులును త్రవ్విపోసెడి మణిదీపికలను వెలిగించి మహోపకారము గావించినారు.

ఎవరిధర్మములను వారు సక్రమముగ నిర్వర్తింపవలయుననియు పరస్పర సహనసహకార భావములను కలిగి యుండవలయుననియు, స్త్రీలకు సముచిత స్థానము నొసగవలెననియు వారుద్ఘోషించిరి. పని వారిపట్లయజమాని యుదారత వహించవలెననిరి. కేవలసైనికబలముపై గాక ప్రజల యాదరాభిమాన బలముపై ప్రభువు దృష్టిని కేంద్రీకరింప వలయుననిరి. సత్యసంధత - క్రోధరాహిత్యస్థితి - క్షమాగుణము - మొదలైనవి మానవుల కత్యవసరములని ప్రబోధించిరి. భూమాత యిచ్చెడి పంటలను సర్వప్రజలు సమానముగ ననుభవింపవలయునని నిర్దేశించిరి. నీతిశీలములు, నియమనిగ్రహములు, జీవితమునకు పునాదులుగ నుండవలయునని హెచ్చరించిరి, మానవతాదృష్టిని క్రమక్రమ వికాసమును పెంపొందించుకొనుటకై నరులు యత్నించవలయునని

యెలుగెత్తి చాటిరి. జీవకారుణ్యభావమును మానవు లలవరచుకొన వలయుననియు శాకాహారులుగనే మనుగడను కొనసాగింపవలయు ననియు విస్పష్టముగ సూచించిరి.

పరమేశ్వర పూజావిధానము శాస్త్రోక్తముగ నిర్వర్తించుకొను టకై వైఖానస పాంచరాత్ర శైవ శాక్తేయాగమములు వచ్చినవి. న్యాయ, వైశేషిక, సాంఖ్యయోగ, పూర్వోత్తర మీమాంసలు సృష్టిం పబడి జాతీయులకు ప్రసాదింపబడినవి. మహోజ్జ్వలమైన తమ మేధ శ్శక్తిని ధారవోసి - ఈశ్వరీయ విజ్ఞానమును సకల ప్రజల కందుబాటు నకు తెచ్చుటకొఱకై దివ్యకృషినికొనసాగించి మానవాళికి మహర్షులు వందనీయులైరి. ధనార్జనమునకై విప్రులు పరుగులెత్తరాదు. భోగ లాలసతకు లొంగకూడదు. త్యాగదృష్టి వారిలో పెరుగవలెను. పర మేశ్వర విజ్ఞానవిశేషమును ప్రచార ప్రబోధములందుంచుటయే పరమ కర్తవ్యముగ వారు భావింపవలయును. బాహుబలము నుపయోగించి క్షాత్రమునుజూపి ప్రజలను కన్నబిడ్డలవలె రక్షించి క్షత్రియుడు చల్లని పరిపాలన సాగింపవలయును. పంటలు పండించి, పశుపోషణ గావించి, యెల్లరకు నిత్యజీవితావసర వస్తువులనందించి, వైశ్యుడు ధర్మబద్ధముగ సంచరించవలయును. శ్రమను, శక్తిని ధారవోసి సేవాభావమున యెల్లరిమేలుగోరుచు సకల ప్రజల కత్యంత ప్రధానమైన వ్యక్తిగ శూద్రుడు మనుగడను ధన్యమొనర్చుకొనవలయును. ఈ విధముగ చాతుర్వర్ణ్యములవారు నిర్వహించవలసిన రీతులను స్పష్టీకరించిన విధముగనే మానవులు వయోభేదముననుసరించి చతురాశ్రమములను స్వీకరించుచు శాస్త్రోక్తములైన యాశ్రమధర్మములనుగూడ శిరసా వహింపవలయునని సనాతన ధర్మముపదేశించుచున్నది. వర్ణాశ్రమ విధానము లవిభక్తాంశములు.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసములనెడి నాలుగా శ్రమములు మనకు గలవు.

'బ్రహ్మచారీష్ణం శ్చరతి రోదసీ ఉభే
తస్మిన్ దేవాః సంమనసో భవన్తి
సదధార పృథివీం దివంచ
స ఆచార్యం తపసా పిపర్తి

(అథ. 11–6–1)

బాలుడుపనీతుడై వేదాధ్యయన మాచరించుచు బ్రహ్మచర్యమున మనసు నిలిపి - ఇంద్రియ నిగ్రహమును గడించినవాడై భూమ్యాకాశముల మధ్యగల సర్వమును గమనించుచు సత్యమును గ్రహించుచు సంచరించు చుండవలయును. దేవతలు వానికపు డనుకూలురగుదురు. బ్రహ్మచారి భువిని దివిని వశపరచుకొనగలడు. తపోబలముచే గురువుగారి యాశయములను సఫలమొనర్పగలడు. బ్రహ్మచర్య పాలనమే యిట్టి శక్తి యబ్బుటకు ముఖ్యసాధనము. దేవతలను తృప్తిపరచగలిగిన యధ్యయన విశేషము, గురువును మెప్పించగలిగిన తపోవిశేషము, బ్రహ్మచర్యాశ్రమముననే వ్యక్తి పొందగలడు. భావి కాలమున వ్యక్తి గడింపనున్న మహత్తర కీర్తికి బ్రహ్మచర్యాశ్రమమున సముపార్జించెడి నియమ నిగ్రహములే కారణభూతములై యుండును. బాలుడు విద్యాభ్యయన మొనర్చిన పిమ్మట వేదవిజ్ఞానమును గడించిన యనంతరము స్నాతకుడై మనోబలసంపన్నుడై యోగ్యతకల కన్యను వివాహమాడి గృహస్థాశ్రమమును స్వీకరించి పౌరజీవితమున ప్రవేశింపవలయును. ఆశ్రమములన్నింటను గృహస్థాశ్రమము పరమపవిత్రమైనట్టిది. తదితరాశ్రమముల నవలంబించిన వారికందరికి గృహస్థాశ్రమమే యాశ్రయమిచ్చును. పతిపత్నులు కలిసియే గృహస్థధర్మములను నిర్వర్తించుచు దివ్యజీవనము గడుపవలసియున్నది. వైదికదాంపత్యము యొక్క విశిష్టత యిది.

"యా దంపతీ సుమనసా మనుత
ఆదధావతః దేవా సో నిత్యయాశిరా"

(ఋగ్వేదము 8–31–5)

TIRUPATI.

"పత్ని పతిని ప్రేమధారలలో ముంచును. పత్ని గృహమునకు రాణి."

'అనవద్యా పతిజుష్టేవ నారీ'

(ఋగ్వేదము 1–73–2)

దోషరహితయు, పతిచేత సేవితయునగు స్త్రీవలె అగ్నిహోత్రుడుండె నని — ఈ మంత్రమున కర్థము. ఋగ్వేద మీ మంత్రమున స్త్రీ కెంతటి విలువ నిచ్చినదో గమనింపుడు! ఇంటి యందలి సొత్తున కంతకును వాస్తవముగ గృహిణియే సర్వాధికారిణియని తైత్తిరీయ సంహిత నిర్వచించుచున్నది. అందువలన నామె గృహలక్ష్మియైనది. తాదృశ మైన గౌరవమును సంపాదించుకొనుచు పతి కనుసన్నల మెలగుచు గృహస్థాశ్రమమును భార్య కళకళలాడింప వలయును. నిరతాన్న దానము యథాశక్తిగ నొనర్పవలయును. ధర్మార్థ కామమోక్షము లను సముచితలీల నారాధించి పురుషార్థములను సాధించ గలుగుటలో గృహస్థాశ్రమమున భార్యయు భర్తయు నేకముఖులై సంచరించ వలయును. అతిథ్యభ్యాగతుల నాదరింపవలయును. ధర్మసమ్మతమైన యర్థార్జనము, మోక్షానుకూలమైన కామప్రవృత్తి గృహస్థాశ్రమ నిర్వాహకులకు ధ్యేయములు కావలయును. నియమ నిగ్రహముల పాటించుచు సత్సంతానమునుగని వంశవృక్షమును పుష్పఫల విరాజిత మొనర్పవలయును.

వానప్రస్థాశ్రమము మూడవది. సంసారమున విధ్యుక్తధర్మ ములనన్నింటిని నిర్వహించిన పిమ్మట మమతలనురోసి, బంధనములను నిరాకరించి, భార్యతోగూడి యరణ్యములందేకాంతముగ నివసించుచు పరులకు శక్తికొలదిగ తోడ్పడుచు వానప్రస్థులు సర్వేశ్వరార్చనలో తనువును ధన్యమొనర్చుకొనవలయును. నాల్గవదియగు సన్యాసాశ్రమ మును జీవితమునందలి చివరిభాగమున స్వీకరించుట యోగ్యమని పలు వురు భావించుచున్నారు. సర్వసంగములను విసర్జించి మోక్షమునందే

దృష్టినిలిపి యూర్ధ్వరేతస్కుడై సన్యాసిజీవితమును గడుపవలయును. పునర్జన్మ వాంఛయుండరాదు. భిక్షాటనమున మనుగడ కొనసాగింపవలయును. సన్యాసి యెవ్వరిని భయపెట్టరాదు. తానెవ్వరికిని భయపడరాదు. పరమాత్మ భావనతో కాలము గడుపుచు మోక్షార్థియై తపించవలయును. పరమపవిత్రము కఠిన నియమసమన్వితమమునగు సన్యాసము సర్వలోక గౌరవపాత్రము. సన్యాసియెల్లరిచే పూజింపబడును. భారతీయ తత్త్వపీఠమునకధికారి సన్యాసియే. భారతీయ జీవిత విధానమునకు పరమగౌరవస్థితిని ప్రాప్తింపజేసిన పుణ్యపురుషుడాయన.

పైన పేర్కొనబడిన రీతిగా చతురాశ్రమములను సమయ సందర్భముల ననుసరించి మానవుడు పాలించుచు, చరితార్థత నందవలయునని సనాతన ధర్మము నిర్ద్వంద్వముగ నెలుగెత్తి చాటినది.

మహోద్భుతకరమైన యీశ్వరీయ విజ్ఞాన ప్రణాళిక యెంతటి యున్నతమైనది? ఎంతటి సుందరమైనది? ఎంతటి క్రమవిధాన బద్ధమైనది? లోకమోహనకరము, సకల మానవహృదయావర్జకము నయిన యీ మహత్తర విధాన సృష్టికి మూలభూతముగ నిల్చిన యా పరమాత్మునికి మనమెంత ఋణపడి యుంటిమి?

ఒకదాని వెంట మరొకటిగ - ప్రోజ్వలములయిన దీధితులను వెల్లివిరియించుచు సముత్పన్నములయిన యీ సనాతన మహాధర్మ తేజములను తిలకించి పరిమిత మేధాబలవంతుడైన నరుడు రెండుచేతులెత్తి మ్రొక్కి నిరుత్తరుడై నిల్చుట కంటె నేమొనర్పగలడు?

పరమేశ్వర ప్రోక్తములని భావింప బడెడి వేదములు నాలుగా! వేదధర్మములను క్రమానుసారముగ యోగ్యత ననుసరించి శిరసావహించిన యుగములు నాలుగా! జీవితమునందే పరమేశ్వర విజ్ఞాన రేఖలను ప్రసరింపజేసికొని ధన్యములు కావలసిన మానవజాతియందలి - గుణకర్మానుగుణముగా - నేర్పడిన వర్ణములు నాలుగా! ఆ వర్ణముల

వారు భక్తి శ్రద్ధలతో వయోభేదము ననుసరించి యాదల వహించి నడుపవలసిన - స్వీకరించి నిర్దుష్టముగ నిర్వహింప వలసిన యాశ్రమములు నాలుగా!

జీవిత పరమ లక్ష్యములయిన పురుషార్థములు నాలుగా!

అహో! ఏమి యీ మహత్తరానుక్రమణిక? ఈ నియమముల సుఫలప్రదములు గావింప నాధారములైన యోగములు నాలుగా!

బ్రహ్మాండ భాండమున గల సర్వగోళములను సమర్థవంతముగ నడపుచున్న సర్వేశ్వరుని చూచి — మన ధర్మ సర్వస్వమును - తు. చ. దప్పక పాటించి యనుసరించి యాచరించుట మనము నేర్చుకొనవలదా! అనాదిసిద్ధముగ మనకు దక్కిన యీ మహోన్నత దివ్య ధర్మమును మనము సభక్తికముగ శిరసావహించి నిర్వహింపవలదా! సముద్ధరింప వలదా! ఇది మనకు విధ్యుక్త బాధ్యతయగునా! కాదా? ఆలోచింపుడు — పరిశీలింపుడు — నిశ్చయించి అనుష్ఠింపుడు.

క్షణము పొరపాటురాని తెలిగున కాలపరిభ్రమణము జరుగుచున్నది. సమయాతిక్రమణ మొనర్పక భానుడుదయించు చున్నాడు. ఋతువులు వాని ధర్మములను నియమబద్ధముగ నిర్వర్తించుచున్నవి. నదులు ప్రవహించుచున్నవి. ఫలవృక్షములు ఋతు ధర్మము నతిక్రమింపక మానవాళికి ఫలప్రదాన మొనర్చుచున్నవి. సముద్రము నేల నతిక్రమించుటలేదు.

మన మేలుగోరి సర్వేశ్వరునిచే నిర్ణయింపబడిన చట్టబద్ధమైన పద్ధతిని మనమేల యనుసరింపక నియమభంగ మొనర్పవలెను?

ధర్మసమ్మతమైన ప్రణాళికను మానవాళి శిరసావహించినంత కాలము, సర్వేశ్వర శాసనముల సభక్తికముగ నౌదల దాల్చినంత

కాలము జాతిభద్రతకు చేటు వాటిల్లదు. జగత్కల్యాణమే సిద్ధించును. సనాతన ధర్మజ్యోతి బలమట్టిది. ఆ వెలుగుల వెల్లువలో సర్వవిధాంధకారములు పటాపంచలై పోవలసినదే.

ఈ సత్యమును గుర్తించి, ఈ సనాతన ధర్మజ్యోతిని కేలధరించి, మహోన్నతమైన భావవికాసమును సంతరించుకొనుచు మానవుడు ప్రగతిపథమున బయనింప వలయును. పరమ ప్రయోజనములను గడింపవలయును.

# ఇతిహాసదీప్తులు

* * *

కాలప్రవాహ వేగోద్ధతి నడ్డుకొనుట కెవ్వరికిని సాధ్యము కానిమాట నిజమే. ఇట్టి పరిస్థితులయందును మానవజాతి సమగ్రాభ్యుదయమునే దృష్టియందిడుకొని - వేదవిజ్ఞానము, తదన్తర్గర్భితమైన సారముగ వెలుగొందు సనాతనధర్మము - మార్గనిర్దేశ మొనర్చుచునే వచ్చినవి. మహాత్మరోపదేశముల గావించుచునేవచ్చినవి.

పరిస్థితుల ప్రాబల్యమునకు వారసులైన మానవులు బహువిధ పరివర్తనలకు గురియగుచుందురు. దైవాంశతో చిహ్నితమైన సనాతనధర్మమట్లు మార్పులకు గురికాదుకదా! తాను పరిభ్రమణలకు గురిగాక - తననే నమ్మియున్న విశ్వప్రజావళిని తగినరీతి సంస్కరించి యోగ్యపథముల నడిపించుటయే పరమపావనమైన మన సనాతన ధర్మవిశిష్టత. ధర్మ సత్యాన్యాయశీలములు విమలపథముల జూపెడి వెలుగు దివ్వెలుగ సహకరించుచుండ భగవంతుని గమ్యముగ నిడుకొని పావన ప్రాక్తన ధర్మకల్పవృక్షచ్ఛాయలలో చింతలు వంతలులేనిలీల విశ్రమించి విహరించిన యదృష్టవంతులు కృతయుగ ప్రజలు.

సత్యవ్రతదీక్షితులు దయామయులునగు చక్రవర్తులు పాలన మొనర్చు తఱి ప్రజలుమాత్రమిట్లుండక యెట్లుందురు? దోసగులు మనుగడలో మెసలకుండునట్లు పసితనమునుండియే శ్రద్ధవహించెడి యొకానొక నిసర్గైన దివ్యతత్త్వము వేయికన్నులతో నాటివారిని దిద్దుచుండ అస్తవ్యస్త స్థితులెట్లుదయించును?

'యథారాజా తథాప్రజా' అను తెఱగున సాగవలయును గదా! లోకగమనలీల. పరీక్షకులవలె పర్యవేక్షించుచున్న మహర్షుల శిక్షణలో కృతయుగము సత్యయుగముగనే ప్రశస్తిగాంచినది. సమున్నతాదర్శములనే శిరసావహించినది.

సత్యవాక్పాలనార్థము సర్వస్వము సంతోషముగ సంయమి చంద్రునకు సమర్పించిన ప్రభువు హరిశ్చంద్రుడు. సహధర్మచారిణి యగు సాధ్వీరత్నమును బజారున పెట్టి పశువుపగిది తెగనమ్మటకు వెనుకాడని సత్యదీక్ష నా మహారాజుకడమాత్రమే చూడగలము. తాను కాటికాపరియగుటకు, ధర్మపత్నితల తానే తనచేతులమీదుగ తరుగుటకు జంకని సార్వభౌముడాయన. ఇదియంతయు సత్యధర్మముల సంరక్షణార్థమే. కడకు సత్యశక్తి యా నృపాలుని చల్లగ జూచినది. ధర్మముతానురక్షితమై తుదకు హరిశ్చంద్రుని రక్షించినది. ఇదియం తయు ఆ ప్రభువును సత్యహరిశ్చంద్రునిగా చరిత్రలో నిల్పినది. 'ధర్మోరక్షతి రక్షితః' - అనెడి సూక్తిని గుర్తునకు దెచ్చుటలేదా!

అల్పాయుష్కుడని తెలిసియు - చేసిన సంకల్పమును వికల్ప మొనర్చుకొనుట కిచ్చగింపక - అందరిని కాదని, సత్యవంతునే వివాహ మాడి, పాతివ్రత్య ప్రభావమున పరిస్థితులనే తారుమారొనర్చి, ఘన విజయమును జూఅగొని భర్తతో సుఖములదేలిన పరమసాధ్వీరత్నము సావిత్రి. ఆమె నైతిక శీలసంపత్తికిగల మహిమనెగ్గెత్తి చాటుచున్న గాథ యిది.

ఈ కథలలో గర్భితములైన యంశములన్నియు వ్యక్తీకరించెడి దేమి? మానవుడెట్టి యననుకూల పరిస్థితులయందున్నను ధర్మమును విస్మరింపరాదు. సత్యము నలత్యమొనర్పరాదు. ధర్మము సర్వదా పరీక్షలకుగురియగు చుండును. ధర్మనిర్వహణకు కంకణధారణ మొన ర్చినవారు కఠినపరీక్షలకు గురిగాక తప్పదు. సత్యయుగమున మహర్షులీ పరీక్షలను నిర్వహించి నెగ్గినవారికి సమున్నతయోగ్యతా పత్రముల నందజేసిరి. పరీక్షలనగా బంగారమునకు పరిమళముల నలదుటయే. రత్నముల కొరపిడిబెట్టుటయే. ఈ రత్న సంస్కార కార్యక్రమమును సత్యయుగమున మహర్షులు సల్పుటాయుగప్రజలభాగ్యము.

త్రేతాయుగమువచ్చుసరికి సామాజిక ధోరణులలో కొలదిగ మార్పువచ్చినది. మహర్షుల సూచనలతోమాత్రమే సర్వమును సవ్యముగ నిర్వహించుకొనుచు సర్వేశ్వరార్పణతో చరితార్థతనుగడించుకొనజాలినవారు కృతయుగప్రజలు. త్రేతలో ధర్మోద్ధరణార్థము సత్య సంరక్షణార్థము భగవానుడే దివ్యావతారుడై యుదయింప వలసి వచ్చినది.

కృతయుగమునందెవరికి వారే ధర్మోద్ధరణ బాధ్యతను భుజ స్కంధములపై నిడుకొనిరి. త్రేతయందా విషయమున మహత్తర ప్రబోధ మవసరమైనది. ధర్మదేవత మొఱవిని సర్వేశ్వరుడు దివినుండి భువికి దిగిరావలసి వచ్చినది.

అయోధ్యాసామ్రాజ్య ప్రభువైన దశరథ మహారాజునకు మహాసాధ్వియైన కౌసల్యకు ముద్దుబిడ్డగ నొక సుముహూర్తమున శ్రీమహావిష్ణువు ప్రాదుర్భవించుట భూమాత నోములఫలమనియే సంభావింపవలయును.

'వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా'

వేదములచేతమాత్రమే యెఱుగబడెడి వాడగు సర్వేశ్వరుడీ లోకమున శ్రీరామచంద్రమూర్తిగ యవతరింపగనే వేదము వాల్మీకి మహర్షి ముఖమున శ్రీమద్రామాయణరూపమున నీలోకమునకు విచ్చేసినదట. భగవానుడు రాముడై యవతరించినాడు. భగవానుని విజ్ఞానమైన వేదము పరమ రమణీయ రామాయణ మహాకావ్యాకృతిని దాల్చినది.

వేదవిజ్ఞానము ధరించిన యాకృతులలో నిదియొక మధుర మోహనాకృతి. సనాతన ధర్మమును విశదీకరించుటకు గైకొనబడిన సాధనములయందిదియొక ముగ్ధమంజుల సాధనము.

పుణ్యభారత వసుంధరామతల్లీ! నీ సుకృతము నేమని యభి వర్ణింపగలమమ్మా! నీవు సర్వవిధముల పరమ పావనచరిత్రవే! కచ్చెబట్టి కాలసర్పము నిన్ను కాటువేసి గ్రసింప యత్నించినను సనాతన ధర్మ సంజీవి నిన్ను సంరక్షించుచునే యుండగలదు. వైదిక విజ్ఞానామృత ధార నీయందు సర్వదా నవచైతన్యమును వెల్లివిరియించుచునే యుండుట తిలకించెడి భాగ్యము మానవాళికి దక్కినది.

జన్మచే కిరాతుడయ్యును వృత్తిచే హింసాప్రవృత్తికల వాడ య్యును పరిస్థితులు కలిసివచ్చుటచే పరమాత్ముని పరిపూర్ణానుగ్రహ బలము పుష్కలముగ దక్కుటచే పరమయోగివరేణ్యుడుగా మారి వల్మీకమున భగవన్నామ సంకీర్తనానురక్తితో బ్రహ్మాండమైన తపస్సు కొనసాగించి దివ్యమైన శ్రీమద్రామాయణగాథనంతయు నారదమహర్షి వలన విని వల్మీకమునుండి బయటికివచ్చి క్రౌంచ మిథునమున కేర్ప డిన యాపదను కనులారగాంచి కరుణార్ద్రహృదయుడై గుండెకరగు నట్లు విలపించిన మహర్షి వాల్మీకి ఈ యుగమున సనాతన ధర్మసము త్తేజమునకు దోహదచర్య లొనర్చిన పుణ్యమూర్తి.

ఆయన శోకమే శ్లోకమైనది. మహర్షి వాల్మీకి తననోట ఛందో బద్ధమైన శ్లోకము వెలువడుట తలచుకొని విస్తుపోయినాడు.

'శ్లోక ఏవత్వయాబద్ధః నాత్రకార్యావిచారణా
మచ్ఛందాదేవ తే బ్రహ్మన్! ప్రవృత్తేయం సరస్వతీ'

అని స్వయముగ బ్రహ్మయేవచ్చి ఆయన సందేహమును నివా రించినాడు.

"మానిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచ మిథునాదేకమవధీః కామమోహితమ్".

లౌకిక వాఙ్మయమున సనాతన ధర్మసముద్ధరణార్థము సంయమి ప్రముఖుడైన వాల్మీకి మహర్షినోట వెలువడిన తొలిశ్లోకమిది.

శ్రీమద్రామాయణము లౌకిక వాఙ్మయమున వెలసినయాదికావ్యము. 'మానిషాద' యనునది రామాయణమునందాది శ్లోకము. ఆదికావ్య స్రష్టయైన వాల్మీకిమహర్షి యీ విధముగ నీ యుగమున సనాతన ధర్మఫలములను పండించి ప్రజావళికి పంచిపెట్టుటకై భవ్యకావ్య వ్యవసాయమును ప్రారంభించిన ప్రప్రథమ కవికృషీవలుడు. లౌకిక వాఙ్మయము నందాయన తొలికవిబ్రహ్మ.

'ఆదికవీ చతురాస్యౌ కమలజ వల్మీకజౌ వందే
లోకశ్లోక విధాత్రోః యయోః భిదాలేశమాత్రేణ'

విధాత కమలజుడు, ఆదికవి వల్మీకజుడు. ఆయన లోకస్రష్ట. ఈయన శ్లోకస్రష్ట. వీరిరువురికిని భేదము లేశమాత్రమే యున్నది. శకారమొకటి వాల్మీకికే యధికముగ గలదని యీ శ్లోకము చమత్కరించుచున్నది.

'చతుర్వింశత్సహస్రాణి శ్లోకానాముక్తవాన్ ఋషిః
తథా సర్గశతాన్ పంచషట్కాండానితథోత్తరమ్'

ఆరుకాండలు పైన నుత్తరకాండయు గల రామాయణము 24 వేల శ్లోకములతో మహర్షి వాల్మీకిచే సృష్టింపబడినది.

'ఐశ్వర్యం పుత్రలాభశ్చ భవిష్యతి నసంశయః
రామాయణమిదం కృత్స్నం శృణ్వతః పఠతః సదా.'

రామాయణ పఠన శ్రవణములవలన నెట్టి పవిత్ర ప్రయోజనములు సిద్ధించునో! సుస్పష్టముగ విశదీకరింపబడినది.

కృతయుగ ప్రసన్న భావకల్ప తరుచ్ఛాయలలో సత్యతేజమును ధర్మపరిమళమును బ్రకటీకృత మొనర్చుచు త్రేతాయుగమున వికసించిన మనోజ్ఞ సనాతన ధర్మపారిజాతమే రామాయణము. రామాయణ సాగరమున త్యాగధర్మములుత్తుంగ తరంగములతో వేల నతిక్రమించి

వెల్లువలుగట్టి ప్రవహించినవి. రామాయణము త్యాగమయజీవిత సందేశము నందించినది. పితృ, భాతృ, భక్తితత్త్వములకు ప్రతీకగ నిల్చినది. పుత్రప్రాప్తికొఱకు పరితపించుచున్న దశరథుని హృదయము సంశోద్ధరణయే ధ్యేయముగాగల పితృదేవతల తృప్తిపరచుటయే లక్ష్యముగాగల భారతీయుల సనాతన ధర్మభావన ద్యోతకమగుచున్నది. ఋష్యశృంగమహర్షి పర్యవేక్షణక్రింద నిర్వహింపబడిన పుత్రకామేష్టి సనాతన ధర్మకర్మములందగ్రేసరత్వము వహించిన యజ్ఞకాండను సమారాధించు ధోరణికి ప్రతిబింబము. యజ్ఞపురుష ప్రదత్తమైన పాయసమును భక్షించి, కౌసల్యా, సుమిత్రా, కైకలు శ్రీరామ, లక్ష్మణ, భరతశత్రుఘ్నుల గనిరి. యజ్ఞపురుష వరప్రసాద ఫలములుగా నుదయించిన కుమారులం జూచుకొని దశరథుడుప్పొంగి పోయినాడు. సత్యపరాక్రమ సంపదతో వర్ధిల్లుచున్న శ్రీరాముడు సాక్షాత్ శ్రీమన్నారాయణాంశ సంభూతుడయ్యు సంతతికొఱకు పరితపించుచున్న యొక మహారాజునకు బిడ్డరీతిగనే ముద్దు మురిపెములందీర్చుచు పెద్దవాడైనాడు.

రాజర్షియగు జనకునకు నాగేటిచాలునందు దొరికి అయోనిజగా వర్ధమానయగుచున్న సీతామహాదేవిని పెండ్లియాడినగాని ఆయనలో పూర్ణత్వము సమకూరదు విద్యాభ్యాస మొనరించి గురువై కులగురువై వశిష్ఠుడొకవంక ఈ కథాభాగమున ప్రధాన పాత్రధారికాగా

'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం'

అని వివరించి దశరథుని మెప్పించి తన వెంట గొనిపోయి బల, అతిబలయనెడి విద్యలనేర్పి రామునియందలి దివ్యశక్తిని వికసింపజేసి జగజ్జనని యంశలో జన్మించిన సీతామహాదేవిని పరిణయమాడజేసి భావికాల ధర్మకార్య నిర్వహణకు సర్వసమర్థతగల శక్తిమంతునిగ శ్రీరాముని సుశిక్షితు నొనర్చినట్టి విశ్వామిత్ర మహర్షిగూడ రామా

యణమునందు మరొక ప్రధానపాత్రధారియే యగుచున్నాడు. ఇట్టియుగమునగూడ సనాతన ధర్మసముద్ధరణ విషయమున మహర్షుల శక్తియే ప్రాధాన్యమును వహించినట్లు వ్యక్తమగుచున్నది. దశరథుడుమాట నిలుపుకొనుట కొఱకై తనముద్దుల బిడ్డయగు సుకుమారుడునగు రాముని విశ్వామిత్రుని వెంట పంపించి సత్యవాక్యపాలనార్థము తీవ్రపరితాపము ననుభవించినాడు. ఆ సత్యవాక్పాలనార్థమే కైకకు మున్నెన్నడో తానొసగిన వరములను చెల్లించుటకు సిద్ధపడి శ్రీరాముని యరణ్యవాస వార్తను విని భరించలేక తనువు చాలించినాడు. సనాతన ధర్మమునకు జీవనాడులనదగిన సత్యధర్మములు రామాయణము నందెట్లు ప్రభువులచే శిరసావహింపబడి ప్రజల దృష్టిని సమాకర్షించినవి.

పితౄజ్ఞాపరిపాలనార్థము, జనకునకు, అసత్యదోష మంటకుండు నిమిత్తము మహాదర్శప్రాయమైన దివ్యవ్రతమును రాముడాచరింప నుద్యుక్తుడైనాడు. రాముడు వనవాసమును శుభకరమైన వరముగనే భావించినాడు. తండ్రిమాటకొఱకై విశాల రాజ్యలక్ష్మిని తృణీకారభావమున త్రోసిపుచ్చి ఘోరారణ్యములలో సంచరించవలసిన కష్టపరిస్థితిని యేరాజకుమారుని చరిత్రయందేనియు తిలకింపగలమా? అది యట్లుండ అయాచితముగ తనకు దక్కనున్న రాజ్యాధికారమును ధర్మబద్ధుడై, అమాయకునివలె అన్నగారి కర్పించెడి త్యాగదృష్టికల తమ్ముడెచ్చటనేనియు నుండునా? భ్రాతృదేవునికి ప్రతినిధిత్వమువహించి తమ్ముడు నిర్వహించిన పాదుకారాజ్యపాలనము సృష్టియందెచటనేని తిలకింపగలమా! అట్టి యాదర్శ ప్రాయములైన పాత్రలు రామాయణమునందే మనకు కన్పించును. త్యాగభావమునకంటె ధర్మమునకంటె పరిపాలనాధికారము గొప్పది కాదని భావించెడి సోదరుల దివ్య తత్త్వము సర్వమానవాళికి మహత్తర గుణపాఠమును నేర్పుచున్నది. విధిగ వెళ్ళవలసిన యవసరము లేకున్నను వనవాస మొనర్ప

నుంకించిన శ్రీరామచంద్రుని దృఢచిత్తముతో ననుసరించిన సీతా లక్ష్మణుల భక్తిభావము నేమనవలయును? వీరెల్లరు సనాతన ధర్మో ద్దీప్తికి దోహదకరమైన శీలసంపదను ప్రకటించినవారు. భ్రాతృభక్తికి పతిభక్తికి సజీవచిహ్నములుగా నిలిచినవారు. స్వామిభక్తితో రామ చంద్రుని సర్వేశ్వరునిగ సంభావించి సకల సపర్యల నొనర్చిపాదసేవా భాగ్యము నందజాలిన వనచరుడగు గుహునియదృష్టము వర్ణనాతీతము. నిర్మల భక్తియున్నచో తదితరములైన యెట్టి యర్హతలు లేకున్నను పరమేశ్వరానుగ్రహమును మానవులెవ్వరేని జూరగొనవచ్చుననుటకిది ప్రబల సాక్ష్యము. తన యిచ్చకొలది రాముని పాదములను కడిగి సేవించుకొనెడి భాగ్యమునందిన గుహుడు సనాతన ధర్మమున ప్రధాన స్థానము నాక్రమించెడి పవిత్ర భక్తితత్త్వమున దేవదేవు ననుగ్రహ మును జూరగొన గలిగిన ధన్యుడు. పరమేశ్వరుడు భక్తిసులభుడని ప్రబలోదాహరణముగా నిల్చినకథ గుహునికథ.

వనవాస సందర్భమున లక్ష్మణుని కఠోర త్యాగప్రవృత్తియు, సీతాదేవియొక్క అకుంఠిత పతిభక్తియు అడుగడుగున మనకు గోచరించును. మహర్షుల ధర్మమును సంరక్షించుట, సాధువుల లాలించి అలరించుట, రాక్షసుల సంహరించుట శ్రీరామప్రభువునకు పరమ ధర్మము. మహర్షుల నిత్యజీవిత విధానమున కేయుపద్రవమేర్పడినను మనసంస్కృతికి పురోగతి లేనట్లుగనే భావింపవలయును. అవతార పురుషుడై జన్మించియు ధర్మస్వరూపుడై విరాజిల్లి ధర్మోద్ధరణార్థమే సకలక్లేశములను వలచి యాహ్వానించిన శ్రీరామచంద్రుడు మహనీయు లైన మహర్షులనందరిని వారివారి యాశ్రమముల కరిగి దర్శించి యాశీస్సులందుటలో గల పరమార్థమదియే. పండుబండిన ముసలి యవ్వ పరమసాధు స్వరూపిణి శబరి, నిండు భక్తితో నిచ్చిన మధుర ఫలములను మమతతో స్వీకరించుటలోగల పరమరహస్యమయ్యదియే గావచ్చును.

వనవాస సందర్భమున పరమపవిత్రములైన యిట్టి దివ్యకార్యముల నెన్నింటినో నిర్వర్తించుచు శ్రీరాముడు కరుణామయుడైన ప్రభువుగమాత్రమే కాక సనాతనధర్మ సంరక్షణార్థ ముదయించి స్వయముగ దుష్టశిక్షణయు, శిష్టరక్షణయు గావింప బయలుదేరి వచ్చిన శ్రీమన్నారాయణమూర్తిగనే మహర్షులచే సంభావింపబడెను. సంస్తుతింపబడెను.

అరణ్యావాసమొనర్చుచున్న తరి సీత నుద్దేశించి
"సహధర్మచారిణీ మే త్వం ప్రాణేభ్యోపి గరీయసీ"

అని సీత పట్ల రామునకుగల విపులప్రేమను విశదీకరించుటయే గాక స్త్రీలకు సమాజమున పురుషులీయవలసిన స్థానమును గురించి హెచ్చరించి నట్లున్నది.

శరభంగుడు జ్ఞానప్రధానుడైన మహర్షి. రామదివ్యసందర్శన భాగ్యము మాత్రమే యతడాకాంక్షించెను. సుతీక్ష్ణుడు రామాలింగనము నభిలషించిన తపస్వి. అనన్యమైన తదితర మహర్షి లోకదుర్లభమైన శ్రీరామ గాఢాశ్లేష సౌఖ్యమా మహర్షికి ప్రసాదింపబడినది.

"స నిరీక్ష్య తతో వీరం రామం ధర్మభృతాంవరం
సమాశ్లిష్యచ బాహుభ్యాం ఇదం వచన మబ్రవీత్"

ధర్మమును రక్షించు వారిలో శ్రేష్ఠుడైన రాముని, బాహువులతో నాలింగన మొనర్చుకొనెడి భాగ్యమునందజాలిన యామహర్షి భాగ్యమే భాగ్యము. ఈ విధముగ తపస్విజన సంరక్షణ ధ్యేయముగ నిడుకొని తాపసవాటికలయందు సంచరించుచు శ్రీరాముడొకనాడు మహాద్భుత మహిమాసంపన్నుడైన యగస్త్యమహర్షిని సందర్శించుటకు బయలుదేరి వెళ్ళినాడు. ఆ మహర్షి రాముని పలుతెఱగుల నభినందించి బహువిధ శరవిద్యల నుపదేశించి యానందించినాడు. సుకుమారియైన సీతను గాంచి కరుణాస్వరూపుడు గనుక శ్రీరామునితో నిట్లనెను.

‘రామా! బహుళ దోషభూయిష్ఠములైన యరణ్యభూముల కరుదెంచి నిన్ననుగమించుచున్న ఈ సాధ్వి మిక్కిలి దుష్కరమైన కార్యము నాచరించుచున్నది?’’ అని పలికి

ఇచటనే యామహర్షి లోకసహజమైన స్త్రీ స్వభావమును గూడ నిట్లు వివరించినాడు.

‘ఏషాహి ప్రకృతిః స్త్రీణా మాసృష్టే రఘునందన
సమస్త మనురజ్యంతి విషమస్థం త్యజంతిచ’

“సుఖములయందున్న భర్తననుసరించుటయు కష్టముల యందున్న భర్తను పరిత్యజించుటయు లోకమున సర్వసాధారణముగ స్త్రీ సహజ ప్రకృతియై యున్నది. సీతవిషయమిందుకు భిన్నమైనద’’ని యా మహర్షి వాక్కులు స్పష్టీకరించుచున్నవి.

మనోహరములైనయారణ్యక ప్రకృతివర్ణనలను రామాయణము నందు విస్తారముగ గాంచగలము. మహర్షుల నివాసభూములైన కాంతార ప్రదేశములను తరచు వర్ణించుటవలన ప్రజలలో సనాతన ధర్మము పట్లను తద్ధర్మమునకే జీవితముల నంకిత మొనర్చుకొనిన మహర్షులపట్లను గౌరవమును పెంపొందించుటకు కవి యత్నించినట్లు కనిపించును. తానరణ్యవాసియగుటవలన ఈ వర్ణనలకు సహజత్వమును రమణీయత్వమును మహర్షి వాల్మీకి సంతరింప గల్గినాడు. శూర్పణఖ ప్రదర్శించిన కామభావమును, రామలక్ష్మణులు ప్రదర్శించిన విజ్ఞతయు గమనార్హములు. మొదటిది లోకతత్వమును వ్యక్తీకరింపగ, రెండవది కర్తవ్యమును నిర్దేశించుచున్నది

అరణ్యవాస సందర్భమున లక్ష్మణుడు ప్రదర్శించిన, భ్రాతృ భక్తియు, నిరుపమాన సేవాదృష్టియు సర్వలోకాదర్శ పాత్రములు.

సీతాపహరణానంతరము రావణునితో ఘోరముగపోరి కొన యూపిరితో రామలక్ష్మణులకొరకెదురు చూచుచున్న జటాయువు

యొక్క స్వామిభక్తి తత్పరత, ధర్మకార్యానురక్తి, ప్రశంసాపాత్రములు. శ్రీరామలక్ష్మణులు వారి స్వహస్తములతో జటాయువునకు దహనకర్మలనాచరించుట నమ్మిన భక్తులకు పరమేశ్వరుడెట్లు ముఖ్యబంధువై సర్వము తానే నిర్వహించునో విశదపరచుచున్నది.

ఇట్టి దివ్యఘట్టములు సర్వేశ్వరార్చనయెడల సకల ప్రజలలో భక్తి భావమును పెంపొందించుచు సనాతన ధర్మజ్యోతిని పునరుద్దీప్తమొనర్చుచున్నవి.

రామలక్ష్మణులు వనవాస మొనర్చుచున్నతరి సాధుపీడకులైన యెందరో రక్కసుల నుక్కడించిరి. దుష్టశిక్షణయే పరమలక్ష్యముగా గల అవతారముల మహిమలనువిశదీకరించిరి. సుగ్రీవాదులతో శ్రీరామునకు మైత్రి యేర్పడుటయు నొకదివ్యప్రయోజనమునే సూచించుచుండును. రామసుగ్రీవులమైత్రి శ్రీమద్రామాయణ కథా విశేషమున చక్కని మలుపునకు దారితీసినది. ఈ దివ్యకార్యక్రమమునకనుసంధాత పరమభక్తుడైన యాంజనేయుడు. అంజనాదేవి పుత్రుడైన హనుమంతుడు సకల దేవతలను తనతపముచే మెప్పించి అసాధారణములైన వరములను సంపాదించి స్వేచ్ఛగ సంచరించుచున్న బలాఢ్యుడు.

ఇట్టి గుణవంతులను మంత్రులుగనే మహారాజు కలిగియుండెనో యా మహారాజు ప్రయోజనములన్నియు సఫలీకృతములు అగుచుండుటలో వింతలేదు. శ్రీరాముడే హనుమంతునిగూర్చి యొనర్చిన భావన యిది. ఆ దూతయే పిమ్మట శ్రీరామునకు నమ్మినబంటుగ నిల్చి సర్వప్రయోజన సాధకుడై అష్టకోటి యందగ్రగణ్యుడైనాడు. సోదర భార్యాపహరణలోలుడగు వాలిని వధింపజేసి సుగ్రీవునకు మేలు ఘటించుటకొఱకే హనుమంతుడీ స్నేహమును సమకూర్చినాడు.

పరభార్యాకాములకు పట్టెడి దురవస్థ యెట్టిదో! లభించెడిశిక్ష యెట్టిదో! వాలివధ నిష్కర్షగ సూచించుచున్నది. వాలివధలో వధ యనెడి విషయమునకు ప్రసక్తియే లేదు. అదియొక శిక్ష. సోదరభార్యాపహరణమొనర్చినవారికి సముచితమగు శిక్ష విధింపబడినట్లే యిచట మనము భావింపవలసియున్నది. కలుషిత చరిత్రుడగు వాలి యట్టి దండన కర్హుడని సనాతన ధర్మము స్పష్టముగ నిరూపించుచున్నది.

సుగ్రీవాదులు సంపూర్ణ భక్తిభావముతో రామకార్యము నిర్వహింపనుద్యుక్తులగుటయు, హనుమంతుడు పరమపూజ్య భక్తిభావమున అపారపారావారము నవలీలగదాటి దుష్టరావణునిచే నిర్బంధితయై యశోకవనమునందున్న సీతను దర్శించుటయు, జానకీ శోకాపహరణదక్షములగు శ్రీరామ క్షేమవార్తలు వినిపించుటయు, ధైర్యవచనముల నామె నుపలాలించుటయు, విజృంభించి విహరించి లంకాదహనమొనరించి రామచరణ సన్నిధికేతెంచి సీతాక్షేమ వృత్తాంతమును వినిపించుటయు, ధర్మశక్తికిగల విశిష్టతను వ్యక్తీకరించుచున్న మహత్తర సంఘటనలు. సనాతన ధర్మతేజమిట్టి సందర్భములయందే సకల మానవాళి నయనములను జిగేలుమనిపించి తనవంక కాకర్షించుకొనుచుండును.

స్త్రీసహజమైన సాధ్వీరత్నములకు జన్మసిద్ధలక్షణమైన దయార్ద్రదృష్టి, సీతామహాదేవియందెట్లు సువ్యక్తమగునో యెఱుకకు దెచ్చుకొనిన, మనము విభ్రాంతులము కాగలము.

జానకిని దర్శించి మరలిపోవుతరి ఆంజనేయుడు వినయ విధేయతతో దోసిలిబట్టి 'అమ్మా! యీ నీచులకు తగినబుద్ధి చెప్పుటకు దగిన యవకాశము నిప్పింపుము'ని యామెను ప్రార్థించినాడు. జానకీమాత యప్పుడాంజనేయునితో పల్కిన పల్కులను స్మరించినచో ఆ తల్లి హృదయము మనకు దర్పణమునందువలె గన్పించును.

'పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ।
కార్యం కరుణమార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి'

సీతామహాదేవి కారుణ్యదృష్టి స్పష్టముగ నిందు విశదీకృత మగుట లేదా!

'నాయనా! ఆంజనేయా! పాపులు, పుణ్యులు ననెడి విచక్షణ సలుపకయే చంపదగినవారి నందరిని కనికరించుట సనాతనధర్మ మయ్యా! కావున నీ వెవ్వరికిని ఎట్టి యపకారమును గావింప బూనకుము.'

తనకు ఘోరాపకార మొనర్చిన వాని అనుయాయులనందరిని దయామయ దృష్టితో చూడగల విశాల సహన భావము సీతామతల్లికి మాత్రమే చెల్లినది. అట్టి తత్త్వమునే సర్వమహిళాలోకము సాధన మీద నాచరణయందిడుకొనుటకు స్వధర్మమును చక్కగ నిర్వర్తించుటకు సాధ్వీత్వమును సమున్నత మొనర్చుటకు యత్నింపవలయునని రామాయణ మాదేశించుచున్నది.

సీతయెట్లయినను క్రూరరాక్షసుల బారినుండి విముక్తినంద గలదు. పరమపావనమైన సీతాపాతివ్రత్య ప్రభావమే యామెను భద్రముగ కాపాడగలదు. మధ్యలోజరిగిన సన్నివేశము లన్నియు దుర్మార్గులకు లభించెడి ప్రతిఫలములను బ్రకటించుటకు, ధర్మచింతనగల వారికి సిద్ధించెడి విజయమును గురించి విశదీకరించుటకు, ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రునిపట్ల అఖండ భక్తిభావ మాశ్రితులలో నెండగుటకు మాత్రమే సహాకరించుచున్నవి.

ఈయంశమునొకవిధముగ సూచనప్రాయముగ వాల్మీకిమహర్షి రావణుడు సీతనుగొని తెచ్చునప్పుడే యొక శ్లోకమునం దభివర్ణించి నాడు.

'శరాజ రాజపుత్రీతు విద్యుత్సౌదామినీయథా'

రావణాసురునిచే యపహరించుకొని పోబడుచున్న సీత నల్లని మేఘమునందలి మెఱుపుతీగవలె నున్నదట. దీనివలన దుష్టుడైన రావణుడు మేఘమువలె విశాలము. నీలమునగు కాయము గలవాడ నియు వానిచే నపహృతయైన సీత విద్యుల్లతవలె బంగారువన్నె గల దనియు స్పష్టమొనర్పబడు చున్నది.

అంతియేకాక ఇచట గమనింపయోగ్యమైన మరియొక విశే షాంశముగూడ గలదని యెంచవచ్చును.

మేఘమునందు మెఱుపుతీగ యే విధముగ నధిక కాలము నిలువదో, అట్లే రావణునిచెంత ధరణిజయు నధికకాలము నిలువ బోవదు. సత్వరమే సీతకు మరల శుభకాలము రాగలదు.

తాదృశమైన సూచ్యార్థ సూచననొసగెడి యుపమానమును మహాకవి యీ సందర్భమున ప్రయుక్తమొనర్చినాడు.

'ఋషీణాం పునరాద్యాణాం వాచమర్థోనుధావతి
లౌకికానాం హి సాధూనామర్థంవాగనువర్తతే'

ఋషులవాక్కుల నర్థము లనుసరించును. లౌకికులయిన వారి పలుకులర్థముల ననుసరించుచుండునని సూక్తియున్నది కదా!

అందువలన వాల్మీకిమహర్షి పలికిన పలుకు సత్యమయ్యెడి రోజు శరవేగముగనే సమీపింపదొడగినది. మహర్షులు దివ్యచక్షువులతో భవిష్యత్తును శిలకించినవారై యమోఘ వాక్కులతో ప్రవచించు చుందురు. వారు గావించిన తపస్సునకు, వారు సాధించిన భగవదను గ్రహ బలమునకుగల మహిమ యట్టిది. వారి పలుకులలో సనాతన ధర్మకాంతులు వెలుగులీనుచుండును. శ్రీమద్రామాయణమున సనా తన ధర్మవైభవమును సమగ్రముగ, సమున్నతస్థాయిలో బ్రకటింప గల్గి నది వాల్మీకి మహర్షి వాణి.

ఇంద్రజిత్తుచే బ్రహ్మాస్త్రమునకు గట్టువడి రావణుని సభకుపోవ నెంచియే పోయినాడు హనుమంతుడు. హనుమంతుడాచరించిన దారుణయుద్ధకాండకు కుపితుడై యున్న రావణునుద్దేశించి ఆంజనేయుడు పల్కినపల్కులాయనకు గల ధర్మబలమునకు సాక్ష్యములు.

"ఓయీ! పరస్త్రీలనపహరించుట, బలాత్కరించుట బుద్ధిమంతులైనవారు తలపెట్టరాని యంశము. రామలక్ష్మణులు మానవమాత్రులని భావింపకుము. క్రూర సర్పమును దెచ్చియింట నిడుకొన్నావు. గరళము గలిపిన యాహారమును భక్షింప నుంకించుచున్నావు. శ్రీరాముడొనర్చిన వాలివధ, సుగ్రీవస్నేహాది దివ్య కార్యములను దృష్టికి దెచ్చుకొని ఆ పూజ్యుని శరణువేడుము, సేవింపుము. స్వహస్తములతో లంకకు నిప్పుబెట్టెడి యరాజకచర్య అహంకారముతో సలుపవలదు. నామాటలయందలి పరమార్థము నాలింపుము.

సత్యం రాక్షసరాజేంద్ర! శృణుష్వవచనం మమ
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః

రాక్షసులవలె యసత్యములాడు టెఱుగని వానరుడను, రాముని బంటును దూతను నామాటల నాలించి మేలునందుము."

అగ్నిపై నాజ్యము బోసినట్లయినది. ధూర్తుడైన రావణునకు పావనిపలుకులు రుచించలేదు. భీషణద్వేషము వహించి హనుమంతుని వధించుడని రావణుడు గర్జించినాడు. వెంటనే విభీషణుడడ్డుపడినాడు. పరమకిరాతకుల యందును పరమసాధువు లొక్కరేని యుందురనెడి సూక్తియొక్కటి కలదు. తదనుగుణముగనే గంజాయివనమున తులసి మొక్కవలె విభీషణుడారాజ్యము నందున్నాడు. పాపభీతియు ధర్మచింతనయు న్యాయదృష్టియుగల రాక్షసుడాయన. దూతను వధింపవీలుగాదనియు పరిభవించుటే యొకశిక్షకాగలదనియు శాస్త్రప్రశిక్షదూతకు చాలనియు, దూతవధ మహాపాతకమనియు, తగని పనియనియు నిష్కర్షగ నిర్వచించినాడు.

రావణుని యుద్ధతి కొంతమాటుమణగినది. విభీషణుని కాదన లేక 'లాంగూలేన ప్రదీప్తేన స పషపరిణీయతాం' తోకగాల్చి వానిని పరాభవించి పంపివేయుడనినాడు.

రక్కసిమూక గొల్లుమని చెలరేగి తోకకు నూనెతో తడిపిన గుడ్డలుచుట్టి నిప్పుముట్టించినారు. హనుమంతుని వాలము ఘోరాగ్ని జ్వాలలకాలవాలమైనది. సీతకా వార్త తెలియగనే విలవిలలాడుచు అగ్ని దేవునిగూర్చి పలుభంగుల స్తుతింపసాగినది.

"యదికశ్చిదనుక్రోశః తస్యమయ్యస్తిధీమతః
యది వా భాగ్యశేషోమే శీతోభవ హనూమతః
యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసాం
సవిజానాతి ధర్మాత్మా శీతోభవ హనూమతః"

"శ్రీరామునికి నాయెడ దయయున్నచో, నాకేమేని పతిని బడయు భాగ్యమున్నచో, నేను సత్ప్రవర్తన గలదాననవియు భర్తృ సమాగమలాలసమానసననియు ధర్మాత్ముడైన శ్రీరామచంద్ర మూర్తి విశ్వసించి అనుగ్రహించుచో. పూజ్యుడవైన అగ్నిహోత్రుడా! హనుమంతునకు చల్లదనమునే సమకూర్చుము."

సీత ప్రార్థన యిది. జానకి యభిమతము ఫలించినది. ధర్మ దూత యగు హనుమంతుడు మలయమారుతమున విహరించుపగిది యథేచ్ఛగ సంచరించి లంకను దగ్ధమొనర్చి కిష్కింధకు మరలివచ్చినాడు

'దృష్టాసీతా' యనెడి పలుకులతో ప్రారంభించి యెల్లరికి సంతోషదాయకమైన సీతావృత్తాంతమును వివరించి సీత యొసగిన చూడామణిని శ్రీరామునకు సమర్పించి కృతకృత్యుడనైతినని హనుమంతుడు సంభావించినాడు.

దూతధర్మమును విధివిహితముగ సాహసోపేతముగ నిర్వహించిన హనుమంతుని గురించి

'కృతం హనుమతాకార్యం సుమహద్భువిదుష్కరమ్
మనసాపి యదన్యేన నశక్యం ధరణీతలే'

ఊహాతీతమైనట్టిదియు, లోకమునందెవ్వరికిని సాధ్యముగాని దియునగు దుష్కరమైన మహాత్కార్యమును మన హనుమంతుడొనర్చెనని సుగ్రీవునితో శ్రీరామచంద్రుడానందమున వక్కాణించినాడు. విధ్యుక్తధర్మ నిర్వహణ మొనర్చిన బంటుపట్ల ప్రభువు చూపిన ఈప్రేమ సకల సార్వభౌమలోకమున కాదర్శప్రాయమైనట్టిది. శ్రీమద్రామాయణమున శ్రీరాముడొనరించిన ప్రతికార్యము పరులకాదర్శప్రాయమై సనాతన ధర్మసముద్దీప్తికి సహకరించుచునే యుండెను.

హనుమంతుడొనర్చిన సాహసోపేత కార్యక్రమమును గాంచి యాలోచనలోపడిన రావణుడు భ్రాతృ మిత్రామాత్య సేనాధిపతుల సమావేశ మొనరించి యోచనసాగించినాడు. విభీషణుడు తీవ్రముగ వ్యతిరేకించి రామునితో యుద్ధము వలదని వాదింపబూనినాడు. ధర్మాధర్మముల క్రుమ్ములాట ప్రారంభమైనది. పశుబలమునునమ్మి యోగ్యతను గమనించని అన్న తమ్ముని దారుణముగ పరాభవించి తన్నితరిమివై చెను. కాలముమూడిన రక్కసులకు విభీషణుని పలుకులు వికటముగ దోచినవి. ఇంద్రజితాదులు రావణుని పాశవిక తత్త్వమును బాగుగ ప్రకోపింపజేసిరి. ధర్మశక్తిపై అధర్మశక్తి కన్నులుమూసికొని విజృంభింప నారంభించినది.

ఉభయపక్షములలో యుద్ధప్రయత్నము లారంభమైనవి. విభీషణుడు శరణార్థియై వానరసైన్యము విడిదిచేసియున్న ప్రాంతమునకు వచ్చి శ్రీరాముని శరణుజొచ్చినాడు. విభీషణుని రాకపై పలువురు పలువిధములైన వ్యాఖ్యల నారంభించి విమర్శలు విసరదొడగినారు. రాముడన్నింటిని విని విశాలహృదయముతో సనాతన ధర్మానుగుణమైన సృష్టితో శరణాగతునిపట్ల చూపవలసిన యుదారభావనను మరువక యెల్లరు విన చుండ నిట్లనినాడు.

"మిత్రభావేన సంప్రాప్తం నత్యజేయం కథంచన
దోషోయద్యపి తస్యస్యాత్ సతామేతదగర్హితమ్"

'స్నేహహస్తముచాచి చేరవచ్చిన వారిని త్రోసిరాజనుటయెట్లు? వచ్చిన వానిలో దోషముండిన నుండవచ్చుగాక! సత్పురుషులు శరణు గోరిన వారిని పరిత్యజించరాదు.'

రాముని పలుకులను విని మరల పలువురు పలురీతుల వారివారి వ్యతిరేక భావములనే వెల్లడించిరి. రాముడొక నిర్ణయము గావించి ఇట్లు వివరించినాడు.

"బద్ధాంజలిపుటం దీనం యాచంతం శరణాగతం
నహన్యాదానృశం స్యార్థమపి శత్రుం పరంతప"

ప్రపన్నులను; దోసిలిబట్టి దీనభావమున శరణుగోరిన వారిని వధించుటయు, వదలుటయు తగని పని. నన్నాశ్రయించిన వానికి నేనభయమిచ్చుట నా వ్రతము. విభీషణుడెట్టి వాడైన గావచ్చును. శరణుగోరినాడు. నేనభయమిచ్చితిని. రావణుడే శరణాగతుడైనను వానికభయమిచ్చుటకు సిద్ధముగ నున్నానని శ్రీరామచంద్రుడు పలికిన పలుకులు ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రునకు మాత్రమే చెల్లును. పరులెవ్వరును అట్లు పలుకజాలరు. కావుననే

"రామోవిగ్రహవాన్ ధర్మః" యనెడి ప్రశస్తి శ్రీరామచంద్రున కెన్నడో వచ్చినది.

ధర్మదేవతపై విజృంభించి, విక్రమించి వికృతమైన పోరు సాగించిన - అధర్మశక్తి క్రమక్రమముగా బలహీనపడసాగినది. అమాత్య పుత్ర పరివారబలమంతయు క్రమముగ నంతమగుచుండ రావణుడు ధర్మతేజమున మెరయుచున్న శ్రీరాముని తేరిపార చూడలేని స్థితి వచ్చినది. రాముని క్రుద్ధవదనముచూచి భూమాత కంపించినది. పంచభూతములు భయమునందినవి. సాగరము సంక్షోభించినది. భాస్కరుడు ప్రభావిహీ

నుడైనాడు. మారుతము స్తంభించిపోయినది. 'రాముడు రాక్షసాధిపుని జయించుగాక' యని దిశలు ప్రతిధ్వనించినవి. రామ రావణ యుద్ధము ఘోరముగ సాగుచున్నది.

"గగనం గగనాకారం సాగరం సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ"

అనుపమానమైన సంగరమది.

శ్రీరాముడు రావణుని శిరస్సులను త్రెంచుచున్నాడు. మరల నవి మొలచుచున్నవి. శ్రీరామబాణము మరల మరల తన పదును ప్రదర్శించుచున్నను రావణుని తలలు మరల మరల నుదయించుచునే యున్నవి.

మహర్షులు తనకు ప్రసాదించిన యస్త్రముల నన్నింటిని ప్రయోగించి చూచినాడు. ప్రయోజనము కనిపించలేదు. తుదకు వేదమంత్రములతో నభిమంత్రించి బ్రహ్మాస్త్రము నాకర్ణాంతముగలాగి రావణుని హృదయకవాటము నదిబ్రద్దలు గావించునట్లు ప్రయోగించినాడు. రావణవధ గావించినాడు. ధర్మశక్తి అంతిమవిజయమును సాధించినది. పరపీడన పరాయణతత్వము, పరస్త్రీవ్యామోహపిపాస, మహాదహంకార భావన, పైశాచికతృష్ణ ఘోరపరాజయమునకు గురియైనవి. ధర్మస్వరూపునకు ధరణి శిరమువంచి మ్రొక్కి కృతజ్ఞతను ప్రకటించుకొనినది.

వానరులు దివ్యానంద పారవశ్యమున మైమరచిరి. దేవతలు శ్రీరాముని సంస్తుతించిరి. యుద్ధము ముగిసినది. సీత రామునియెదుట నిలిచినది. రామునిలో హర్ష విషాద రోషములు ముప్పిరిగొనినవి. కోల్పోయిన ప్రియురాలిని మరల పొందగలిగినందులకు సంతోషము, చాలకాలము రావణుని యధీనమున ప్రవాసము ననుభవించిన కాంతను నిశ్శంకగ గ్రహింపజాల నైతినేయని విషాదము, సీత బహుకాలము

రాక్షసులమధ్య నిలచియున్నది. నాడు తనమాట వినక లక్ష్మణుని ధిక్కరించినది కష్టములు కొనితెచ్చుకొనినది. కృతాపరాధయైనది యని రోషము రామునిలో వరుస వరుసగా పెల్లుబికినవి.

విషయమును సీతగ్రహించినది. ఆమెహృదయము కోమలము. శీలము మహోన్నతము. చరిత్ర పవిత్రము. కాని! ఏమిచేయగలదు? కాలము కఠిన పరీక్షకు గురిచేయుచున్నది. చేతులుమోడ్చి రాముని వద్ద తలవంచి నిలిచి యిట్లు ప్రార్థించినది

"మహావీరా! కర్ణకఠోరములైన పలుకులతో నన్ను బాధింప వలదు. నా హృదయమునందు సర్వవేళల నీ రూపమే ముద్రితమై యున్నది. క్రోధమునకు వశుడవై ప్రాకృతునివలె నన్నేల శంకించెదవు?"

అని పలికి లక్ష్మణునివంక తిరిగి అగ్నిహోత్ర ప్రవేశము గావించుటకు వలయు ప్రయత్నముల గావింపుమనియు వ్యర్థనిందల భరింప జాలననియు కోరినది.

మౌనముతో సంగీకారమునే వ్యక్తీకరించుచున్న శ్రీరాముని భావమును గుర్తించినవాడై లక్ష్మణుడు సీత వాంఛించిన విధముగ అగ్ని ప్రవేశమునకు తగిన ప్రయత్నము లాచరించినాడు.

పాతివ్రత్యమున కగ్నిపరీక్షయది. సనాతన ధర్మమున గృహిణికిగల ప్రత్యేకత కడుంగడు శ్లాఘాపాత్రమైనట్టిది. ఇల్లాలికేర్పడిన పరీక్షయది. భారతనారీ మహిమలకు మూర్తిగనిల్చి సాక్షాన్మహాలక్ష్మి స్వరూపిణిగ నవతరించిన జానకి నడుముగట్టి పాతివ్రత్య ప్రభావదీప్తులను వెలయింప నుద్యుక్తయై నిలిచినది.

"యథా మాం శుద్ధచారిత్రాం
దుష్టాం జానాతిరాఘవః
తథాలోకస్య సాక్షీ మాం
సర్వతః పాతు పావకః"

అని పావకుని ప్రార్థించి యగ్నిలో దుమికినది. పదునారవ వన్నెబంగారము పగిది ప్రకాశించుచు సర్వులను దిగ్భ్రాంతుల నొనర్చినది.

భారతసాధ్వీత్వమున కపూర్వప్రాశస్త్యమును సంఘటించిన సన్నివేశమది. దేవతలందరు పుష్పవృష్టిని గురిపించినారు.

"తరుణాదిత్య సంకాశాం తప్తకాంచనభూషణాం
రక్తాంబరధరాం బాలాం నీలకుంచిత మూర్ధజాం"
.... .... .... .... .... ....
'దదౌ రామాయ వైదేహీం అంకేకృత్వావిభావసుః'

స్వయముగ నగ్నిహోత్రుడే విశుద్ధయు మహాపతివ్రతయు నగు సీతామహాదేవిని కొనివచ్చి 'ఈమె సువృత్త ఈమె-నీ వైదేహి-ఈ మహాపతివ్రతను స్వీకరింపు'మని శ్రీరామచంద్రున కప్పగించినాడు. పాతివ్రత్యమహిమ జయించినది. సనాతనధర్మము నెగ్గినది.

నిరాధారమైన యనుమానముతో శ్రీరాముడు సీతను బాధించెనని యనుకొందమా! కాదు.

మానవాళిలో సర్వసాధారణముగ నెన్నెన్నియో రూపముల శంకలుదయించుచుండును. వాని నుద్దేశించి సముచిత సమాధానమును సమకూర్చుటే సనాతనధర్మపరమలక్ష్యము. సనాతన ధర్మ ప్రబోధకులయిన వారావిషయమునందుపేక్ష వహించినచో, శంకలు బహుముఖముల పరివర్ధమానములగుచు ప్రచురమైన వ్యాప్తినందును.

సనాతనధర్మ స్వరూపులయిన వారిట్టి సందర్భముల నెట్లుపేక్ష వహించుదురు? కావుననే శ్రీరాముడీ పరీక్షకు సమ్మతించినాడు. సమ్మతించుటయు సమాజముకొఱకే. ఆ యనఘున కాతల్లి పవిత్రత తెలియదా! సర్వము తెలియును.

"ఏషా తే రామ వైదేహీ పాపమస్యాం న విద్యతే
.... ... .... ... .... ....
విశుద్ధభావాం నిష్పాపాం ప్రతిగృహ్ణీష్వ రాఘవ
నకించిదభిధాతవ్య మహమాజ్ఞాపయామి తే
అవశ్యం త్రిషులోకేషు న సీతాపాపమర్హతి"

"పాపమునెఱుగని మహాసాధ్వి సీత. విశుద్ధభావయగు జానకిని పరిగ్రహింపుము. ముల్లోకములలో నెవ్వరును సీతను పాపాత్మురాలని యనలేరు. నేను చెప్పవలసినదేమియును లేదు. సీతను స్వీకరింపుమని నిన్ను నేనాజ్ఞాపించు చున్నాను."

శ్రీరామునకు సీతను సమర్పించుచు అగ్నిహోత్రుడు పలికిన పలుకులివి. అంతయు శుభాంతమైనది. ఉత్తములైన స్నేహితులనందరను వెంటనిడుకొని సీతాలక్ష్మణోపేతుడై శ్రీరాముడయోధ్యకు బయలుదేరినాడు.

భరతాదుల క్షేమమును ముందుగ నరయుటకొఱకై శ్రీరాముడు హనుమంతుని పంపినాడు. మరలివచ్చి మార్గమధ్యముననే వారి క్షేమములను తనకు తెలియజేయుమని రామునియాజ్ఞ.

ఆంజనేయుడు రామునియాదేశానుసారముగ భరతుడు మొదలుగాగల వారి నందరిని దర్శించి శ్రీరాముని యాగమనవార్తను వెలిబుచ్చినాడు.

'చిరస్య పూర్ణః ఖలు మేమనోరథః'

భ్రాతృవియోగమున పరితపించి, కృశించి మలినాంబరధారియై రామాగమన శుభసమయముకొఱకు నిరీక్షించుచున్న భరతునకు హనుమంతుని వాక్యములు చైతన్యామృతధారలై శిరమున గురిసినట్లయినది. ఆనందమున "చిరకాలమునకు నా మనోరథములు పండినవి." అని పలికినాడు.

సర్వ సన్నాహములతో శ్రీరామునకు స్వాగతము చెప్పుటకు భరతుడు సంసిద్ధుడాయెను. ఏమి! ఆ భ్రాతృభక్తి. వారిసోదరప్రేమ యెంతటి పవిత్రమైనట్టిది! మహోన్నతమైనట్టిది! రాముని పాదుకలు శిరముననిడుకొని నందిగ్రామమున భరతుడు గగనమును తిలకించుచు నిరీక్షించుచున్నాడు.

నందిగ్రామమున కయోధ్యయంతయు గదలి వచ్చినది. మధ్య మార్గమున మహర్షులను దర్శించుచు వారి యాశీస్సులను స్వీకరించుచు వచ్చుచున్న శ్రీరాముని పుష్పకమాకాశమున దోడగట్టగనే భరతుని హృదయము పూర్ణిమనాటి జలధి గర్భమేయైనది. ప్రజలెల్లరు పరమానందమున "అదుగో! శ్రీరామచంద్ర ప్రభువు. ఆమెయే సీతామహాదేవి. ఆయన లక్ష్మణుడు" అని యాకసమువంక జూచుచు పరమానందమున జెప్పుకొన సాగిరి. నిస్తులమైనవారి సౌభ్రాత్రము నేమని వర్ణింపగలము? సనాతన కాలమునుండియు ప్రవహించుచు సకల ప్రపంచమును పవిత్రమొనర్చుచున్న వేదసంస్కృతికి ప్రతిబింబమైన సౌభ్రాత్రమది. సకలలోకముల కాదర్శప్రాయమైన సోదర ప్రేమయది.

అగ్రజు నయోధ్యకు గొనిపోయి భరతుడనినమాటలు మాన వాళి శ్రవణములకే సర్వవేళల మధురామృతమును పంచియిచ్చు నట్టివి.

"అన్నా! నాజన్మ ధన్యమైనది.

అయోధ్యకు మరలివచ్చిన-చక్రవర్తివైన నిన్ను కన్నులారజూచు కొనెడి భాగ్యమబ్బినది."

అద్యజన్మకృతార్థంమే
సంవృత్తశ్చమనోరథః
యస్త్వాం పశ్యామి రాజాన
మయోధ్యాంపునరాగతమ్

భరతుని మూర్తీభవించిన భక్తి భావమునకీ పలుకులు ప్రతిబింబములు. భరతుని రాముడు గాఢముగ కౌగలించికొనినాడు.

శిరస్యంజలిమాధాయ
కైకేయ్యానందవర్ధనః
బభాషేభరతోజ్యేష్ఠం
రామంసత్యపరాక్రమమ్.

దోయిలి బట్టి మ్రొక్కుచు-భరతుడు సత్యపరాక్రముడైన అగ్రజున కీ విధముగ మనవిజేయు చున్నాడట—

భరతుని హృదయమునం దానందజలధి వేల నతిక్రమించిన దేమో? రామునకు స్వాగతము పలుకుచు

"పూజితా మామికా మాతా దత్తం రాజ్యమిదం మమ।
తద్దదామి పునస్తుభ్యం యథా త్వమదదామమ"

'రామా! నాకీ రాజ్యపరిపాలనాధికారమిచ్చి నా తల్లిని గౌరవించియున్నావు. నీవు నాకొసగిన ఈ యయోధ్యను మరల నీకు సమర్పించుకొనుచున్నాను.' భరతుడంజలిపట్టి పలికిన పలుకులివి. భరతుడు బాల్యమునుండియు త్యాగభావముకల మహావ్యక్తి. తనతల్లి వాంఛించినరీతిగా రాముడు తనకు రాజ్యమిచ్చినాడు. తన తండ్రి వాంఛించిన తెఱగున రాముడు రాజ్యమునందభిషిక్తుడగుట తనకు ముదావహమైన విషయము. శ్రీరామపట్టాభిషేకముతో భరతునకు బరువు తీరినట్లయినది.

రాముని యరణ్యవాసమునకు మంధర కారణభూతురాలు కాదు, నాతల్లియగు కైకయునుగాదు. తండ్రియును కారణ భూతుడుగాడు. నాపాపమే దీని కంతటికిని కారణభూతమని భావించినాడు భరతుడు.

'తతః సప్రయతో వృద్ధోవశిష్ఠో బ్రాహ్మణైః సః
రామం రత్నమయేపీఠే సహసీతం న్యవేశయత్'

సీతారాములకు పట్టాభిషేకము జరిగినది. రామాయణ కథా మాలలో సూత్రమై సర్వత్ర తన సాధ్వీత్వమును ప్రకటించుకొనుచు చివరకు రామునితో బాటుగ రత్నమయ పీఠము నధిష్ఠించెడి భాగ్యమునకు నోచుకొన గల్గినది సీత. కావుననే రామాయణమును

"సీతాయాశ్చరితం మహత్"

సీతాదేవి మహోజ్జ్వలగాథగ నభివర్ణించియున్నారు.

శ్రీరామరాజ్యము ప్రజలకానంద సామ్రాజ్యమై వర్ధిల్లెను. కొలదికాలమునకు సీత గర్భవతియగుటయు నీచుడొకడు సీత శీలమును దూషించుచు పలుకుటయు, లేశమాత్రమేని యపనింద భరించుటకు సమ్మతింపని ఇక్ష్వాకువంశీయుడగు శ్రీరాముడు సీతను గంగానదీ పరిసరముల విడిచివచ్చుటకు లక్ష్మణుని పంపుటయు, లోకమున గల క్రూరస్వభావమునకు ప్రబలసాక్ష్యములు. మంచివారి కెప్పుడును కఠినపరీక్షలే యెదురగుచుండును.

సీతను పరిత్యజించిన ఘట్టము హృదయ విదారకమైనట్టిది. ఉన్నతధర్మ దృక్పథముతో అధికారపీఠమునకెట్టి యగౌరవమును కలుగనీయకుండుటకై శ్రీరాముడట్టి సాహసమున కొడిగట్టినాడు.

"అంతరాత్మాచమేవేత్తి సీతాం శుద్ధాం యశస్వినీమ్"

సీత విశుద్ధురాలు. మహాకీర్తిమంతురాలు. నేనావిషయ మెఱుగుదును, అని రాముడే స్వయముగ చెప్పినమాటలివి. సీత నిర్దోషురాలని యెఱింగియు రాముడామెను త్యజించుట శోచనీయము.

సర్వత్ర ధర్మప్రబోధమునే ధ్యేయముగ నిడుకొని ధర్మ స్వరూపుడుగ సంభావింపబడినరాముడు తుదివరకు ధర్మము కొఱకే కష్టముల ననుభవించినాడు. కావుననే యిట్టి సందర్భముల నాధర్మ

మూర్తియొక్క ధర్మపత్ని ధర్మబలముననే వాల్మీకి యాశ్రయమును సంపాదింప గలిగినది. ధర్మమును నమ్ముకొనినప్పుడు నమ్మినవారిని ధర్మమే సర్వదా సంరక్షించుచుండును.

"సర్వంచ విదితం మహ్యం త్రైలోక్యే యద్ధివర్తతే
అపాపాంవేద్మిసీతే! త్వాం తపోలబ్ధేన చక్షుషా"

అమ్మా! సీతా! ముల్లోకములయందలి విషయములను నే నెఱుగుదును. నీయందే దోషమును లేదని తపోబలమువలన లబ్ధమైన జ్ఞాననేత్రముతో తిలకింపగలిగితిని—" అని సీతనూరడించి యామెసంరక్షణకు పూను కొనినాడు వాల్మీకి. సీతాపరిత్యాగానంతరము రాముని పరిపాలనము నందొక విచిత్రము జరిగినది. రామురాజ్యమున పసివారి మరణములు లేవు. కాని యాకస్మికముగ నొకబ్రాహ్మణబాలుడు మరణించుట జరిగినది. నారదమహర్షి వచ్చి, రామా! నీరాజ్యమున నిట్టియస్త వ్యస్తస్థితి యేర్పడుటకు సశరీరముగ మోక్షమునందగోరి శూద్రుడు తపస్సుచేయుటయే యని చెప్పినాడు. వెంటనేరాముడు ఋషిపుంగ వుల రప్పించి సమావేశపరచి కర్తవ్యమేమియని ప్రశ్నించెను. వారంద ఱేకగ్రీవముగ తలక్రిందుగ తపస్సు గావించుచున్న శూద్రుని వధించ వలయునని నిర్ణయించిరి. రాముడట్లొనర్చినాడు. తపముగావించు చున్న శంబుకునకు మోక్షమే సిద్ధించినది. బ్రాహ్మణబాలుడు జీవించి నాడు. రాముడొనర్చిన యీకార్యము పిడ్డూరముగ కనపడవచ్చును. కాని సూక్ష్మముగ నాలోచించినచో వర్ణవ్యవస్థ ననుసరించి యుగధర్మ పద్ధతి ప్రకారము నారదుడు చెప్పినమాటమీద ఋషులయాజ్ఞాను సారముగ రాముడీకార్యమును నిర్వహించినట్లు వ్యక్తమగుచున్నది. ప్రభువుకూడా సంఘనియమములకు తలయొగ్గవలసినదే. సశరీరముగ మోక్షమునందవలయునని తల్లక్రిందుగ తపస్సు గావించుట లోకాను భవమునకు విరుద్ధమైన విషయము. కావుననే మానవుడుగ నుండి దేవత్వసిద్ధికొరకై, సశరీర మోక్షప్రాప్తికొరకై శాస్త్రవిరుద్ధముగ

తపస్సుగావించుచున్న వానిని ధర్మసంరక్షణతత్పరుడగు శ్రీరాముడు దండింప వలసినదే. సశరీరముగ మోక్షమెట్లును సిద్ధించని విషయమగు టచే శంబుకుని వధించి మోక్షమును సిద్ధింపజేసి, యతని కాంక్షను ధర్మ స్వరూపుడైన శ్రీరామచంద్రుడు నెరవేర్చినాడు. శంబుకుని మరణ ముతో బ్రాహ్మణబాలుడు పునరుజ్జీవితుడగుటచే రామరాజ్యమునకు గల కళంకము తొలగింప బడినది.

విశ్వశాంతి కొరకై ధర్మస్వరూపుడైన శ్రీరాముడు ధర్మ విరుద్ధమైన కార్యమునే వ్యతిరేకించినాడు. కాని, కులవిచక్షణకిట ప్రసక్తిలేదు. శబరి శూద్రాంగనయే. ఆమె తపస్సు గావించినది, రాముడామె తపస్సును ప్రశంసించినాడుగదా!

'అద్య మే సఫలం జన్మ'

నిన్ను చూచుటవలన నా జన్మ సఫలమైనదని శబరితో రాముడు పలికిన పలుకులు ధర్మసమ్మతమైన తపముపట్ల రామునకుగల భక్తిశ్రద్ధలను వెల్లడించుచున్నవి. జటాయువునకు రాముడు స్వయముగ దహన కర్మల నాచరించుట మోక్షమునొసగుట మొదలైన యంశములను తిలకించినచో రామునకు కులవివక్షతయేగాక పశుపక్ష్యాదుల వివక్ష తయు లేదని, యోగ్యతగల ప్రాణికోటి నంతయు రాముడభినందించె నని తెలియుచున్నది.

సీత వాల్మీక్యాశ్రమమున లవకుశులను గని సురక్షితముగ నున్నది. లవకుశులు వాల్మీకిచే సుశిక్షితులై రామాయణగాథనంతయు మధురాతి మధురముగ గానమొనర్ప నేర్చిరి. రాముడశ్వమేధ యాగ మొనరించుచున్న సమయమది. వాల్మీకిచే ప్రబోధింపబడిన వారై వారిరువురు రాముడున్న కడ కరిగి శ్రోతల కింపు గూర్చు నట్లు రామాయణమును గానమొనర్చిరి. రాముడు విషయమంత యును గుర్తించి రామాయణగానమున సీత నిర్దోషురాలని వివరింప

బడిన యంశమును దృష్టియందిడుకొని, దూతలనంపి సీతను వాల్మీకిని తన సభకాహ్వానించెను. వాల్మీకి మహర్షి సీతను వెంట నిడుకొని రాముని సభకువచ్చి పంచ భూతముల సాక్షిగా సీత శుద్ధచరితయని ముక్తకంఠమున సాక్ష్య మొసగినాడు. కాని! రాముడు వాల్మీకి చెప్పినది వినియు-సీతను ద్వితీయ పర్యాయము పరీక్షకు నిలువవలసిన దిగా కోరినాడు. సీతవ్యథచెందినది. కాషాయ వస్త్రధారిణియై వాల్మీకి వెంటవచ్చిన సీత సభకు నమస్కరించుచు రాముని మనస్సున ధ్యానించుచు

'యథాహం రాఘవాదన్యం మనసాపి న చింతయే
తథా మే మాధవీదేవీ వివరం దాతు మర్హతి'

'శ్రీరాముని దప్ప తదితరుని నేను మనస్సునందేని స్మరింపనిదాననగుచో మాయమ్మ భూదేవి ప్రేమ భావమున నన్ను తనలో జేర్చుకొనుగాక'- అని సీత భూమాతను ప్రార్థించినది. ఆ మహాసాధ్వీరత్నము వాం ఛించిన తెరగున భూమాత ,కరములుసాచి సీతను తనలో చేర్చుకొని యెను. దయకునిధి - ఉదారతకు నిలయము - పాతివ్రత్యభావమునకు పెన్నిధియైన

"సీతాయాశ్చరితం"
సీతాదేవియొక్కపూజ్యగాథ
"మహత్"
నిజముగ మిక్కిలిగొప్పది.

సీత ఆదర్శ ధర్మపత్ని. రాముడు ధర్మసంరక్షణకొరకే యవతరించిన పురుషోత్తముడు. భారత నారీత్వమును సఫలమొనరించి యాదర్శ శిఖరములకెక్కించిన మహాసాధ్వీసీత. మానవులకు, దేవతలకు పూజ నీయురాలే. ప్రపంచసారస్వతమున "సీత" వంటి మరియొక యిల్లాలిని గాంచజాలనైతిననియు, గంగాప్రవాహామువలె సీతగాథ

పరమపవిత్రమైన దనియు, లోకమున పెక్కుమంది సీతలు వెలయ వలయుననియు తన యాకాంక్షగా వివేకానందస్వామి వక్కాణించి నారు.

సకల కష్టములను చిఱునగవులతో స్వీకరించి భరించిన శ్రీరామచంద్రునివంటి ప్రభువును, మునిగణాభిమానపాత్రుని, ధర్మమూర్తిని కథానాయకునిగ వరించి, వేదధర్మముల నుద్బోధించెడి బృహ ద్రమణీయ కావ్యమును వాల్మీకిమహర్షి లౌకిక వాఙ్మయమున కాది కావ్యముగ సృజించి మానవాళికి మహోపకార మొనరించినాడు. సనాతన ధర్మవైభవమును సర్వవిధముల పునరుద్ధరించుటకు సహకరించు చున్న యీ దివ్యగాథ గిరులు - నదులు - లోకమునందున్నంతవరకు నిలిచి మానవజాతి నుద్ధరింపగలదనెడి పరమవిశ్వాస మెల్లరకును గలదు. శ్రీమద్రామాయణము వలెనే సనాతన ధర్మమును సర్వత్రవ్యాపింప జేయ సాయపడిన దివ్యేతిహాసము మహాభారతము. 'ఇతి-హ-ఆస' 'ఈవిధముగ జరిగెనని' తెలియజేయునది. కావున — ఇతిహాసము. మహాభారతేతిహాస విహాయసమున సనాతన ధర్మదీప్తులు తేజరిల్లి మానవజాతి కళ్యాణమునకు మంచిబాటలజూపినవి. మహాభారత స్రష్ట వ్యాసభగవానులవారు. కథాభాగములతో ప్రత్యక్షసంబంధములు గల కవిబ్రహ్మలే శ్రీమద్రామాయణ, మహాభారతములకు కర్తలగుట విశేషము.

భారతము స్థూలదృష్టితో చూచినపుడొక కుటుంబమునకు జెందిన యిరుపక్షముల సోదరులమధ్య చెలరేగిన భీషణ సమరమువలె గన్పించినను-సూక్ష్మ పరిశీలనసల్పినపుడు ధర్మాధర్మములమధ్య విజృంభించిన ఘోరమైన పోరుగనే భావింపవచ్చును. ధర్మమును వర్ధిల్లజేయుచు — ధర్మమునందే విశ్వాసము గలిగియుండి ధర్మమునకే జీవితము నంకిత మొనర్చుకొనిన పక్షమునకే విజయముదక్కినట్లు మహాభారతము విశదీకరించినది. రామాయణమున కలుపుమొక్కలు

మాత్రమే పెరికి వేయబడి-పంటమొక్కలకు రక్షణయు, పోషణయు గల్పింపబడగా-మహాభారతమున కలుపుమొక్కలతో బాటుగ పంట మొక్కలుగూడ నిర్దాక్షిణ్యముగ నిర్మూలింపబడుట జరిగినది. ధర్మా ధర్మములు రెండును సమబలములతో విక్రమించిన కాలమది. కావుననే రెండుపక్షముల యందుగలవారును సమయకతప్పలేదు. యువకులు, వృద్ధులుగూడ మడియవలసి వచ్చినది. సజ్జనులను దుర్జనులనుగూడ పక్షపాత రహితముగనే భారతయుద్ధదేవత గ్రసించివైచినది.

దురాశ వికృత స్వరూపమున విలయతాండవ మొనర్చిన సమయమది. భారతకాలము వేదధర్మములపట్ల భక్తియు ననురక్తియు క్రమముగ కఱగుచున్న వేళయది. సనాతన ధర్మకాంతులలో మసక లేర్పడుచున్న సమయమది. కావుననే మహాభారతము నాంధ్రీకరింప బూనిన-నన్నయభట్టారకులవారు వైదికధర్మసముద్ధరణార్థమే "భారత సంహితారచన" సలుపగడంగినట్లు వెల్లడించినారు.

ధర్మహాని గలుగనీయనని ప్రతినబట్టి పత్నీభ్రాతృగణ పరివృతుడై, భయంకరారణ్యవాసక్లేశముల ననుభవింప సమకట్టిన ధర్మరాజు—

సహోదర సంబంధమునగల మాధుర్యమునుగాని, మహిమనుగాని పరిగణింపక - చెలిమిని కాలరాచి - సంధినితృణీకరించి; స్వార్థమునకే నీరాజనము లెత్తి నిలిచిన దుర్యోధనుడు - వీరిరువురిమధ్య నేర్పడిన సంకుల సంఘర్షణయే 'మహాభారత' మనవచ్చును. కథా ప్రారంభ మెక్కడ జరిగెనో! మూలపురుషు లెవరో! కథా క్రమ మెట్లు వికాస దశనందుకొనినదో! అసర్వస్వ మొకయెత్తు - కురుక్షేత్ర సంగ్రామమునకు దారిదీసిన పరిస్థితులు తత్సందర్భమున నుప్పతిల్లిన వ్యవహారములో భాగస్వాములైనవారు-వీరినడుమ నడచిన కథయంతయు నొక యెత్తు. భారతకథా భాగమునకు ముఖ్యకేంద్రము హాస్తినా

పురము. భారతదేశచరిత్ర తిరిగిన మలుపులన్నింట హస్తినాపట్టణము ప్రధానభాగస్వామ్యమును వహించుచునే వచ్చుచున్నది.

శంతనుడు, విచిత్రవీర్యుడు, ధృతరాష్ట్ర పాండురాజులు మున్నగువారిలో తలయెత్తని దారుణస్వార్థము - దుర్యోధన ధర్మజులు పెత్తనమునకు రానున్న తరుణమున విజృంచుకొనిపడి విశ్వరూపమును దాల్చినది. తండ్రిసుఖముకొరకు శాశ్వతబ్రహ్మచర్యవ్రతదీక్షబూని తనకు దక్కవలసిన రాజ్యాధికారమును వదలుకొనిన మహాత్యాగి - భీష్మప్రతిజ్ఞానిర్వహణకుశలుడునగు - భీష్ముడు జన్మించిన కోవలో తమక్షేమమునకే సర్వముధారబోసిన పినతండ్రిబిడ్డలకు సూది మొనమోపినంత రాజ్యభాగమునేని పంచియిచ్చుటకు సమ్మతించక భీష్మికరించి సర్వవిధ్వంసనమునకు హేతుభూతుడుగ నిల్చిన దుర్యోధనుడుగూడ నుదయించినాడు.

కడుపులో నొకభావము నుంచుకొని నుదుటయందొక భావమును వెల్లడించెడి కపట స్వభావులతో బాటుగ - త్రికరణశుద్ధిగ జీవితమును కొనసాగించుటే దీక్షగనెంచిన పుణ్యమూర్తులు హస్తినలో సాక్షాత్కరించిరి. ధర్మమును శిరసావహించి - అందుకే జీవితమును ముడుపు గట్టిపెట్ట గల్గిన సజ్జనులు ధర్మాధిక్కృతియే జీవిత లక్ష్యముగ నిడుకొని, ధర్మమును కాలరాచి స్వార్థమున కంటిపెట్టుకొనియున్న దుర్జనులును హస్తినాపట్టణ వీధులలో కలిసియే కనిపించుచుందురు.

బాల్యమునుండియే కౌరవ పాండవులలో రగులుకొనుచున్న దారుణద్వేషాగ్ని - ఆరిపోవుట కవకాశమును కలుగనీయక పాపిష్ఠి హస్తములెన్నియో, పనిగట్టుకొని ప్రయత్నముల నారంభించినవి. ఒక్కచోట దిని, యొక్కచోటనాడి, యొక్కచోట విద్యలునేర్చిన, కౌరవ పాండవులలో బాల్యమునుండియే దారుణద్వేషము ప్రజ్వలితమగుట విచారకర విషయము.

తండ్రియైన పాండురాజు మరణించుటవలనగాని, సహజముగ ప్రవృత్తి యట్టిదగుటవలనగాని పాండవులాదినుండియు వినయ విధేయ భావభూషితులుగనే వ్యవహరించుచు పెద్దల మన్నన లందుచుండెడి వారు. దుర్యోధనాదులకిది కంటకముగ నుండెడిది. ముఖ్యముగ వారికి భీముడన నేదియో చెప్పగానిమంట. వానిని జంపవలయునని వారొనర్చిన ప్రయత్నములన్నియు వ్యర్థములగుటయే కాక, భీమునకు నవి ప్రయోజనదాయకములుగగూడ మారుటతో వారిద్వేషము పరిధుల నతిక్రమింప జొచ్చినది. ఈమచ్చరములిట్లు పసివారి గుండెలలో పెచ్చరిల్లుచుండ పెద్దలేల యుపేక్షించిరో! వారెరుగరా! ఎరిగియు నామోదించిరా! దేవరహస్యమది. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనముతో కౌరవ పాండవులలో అంతర్గర్భితముగనున్న వైరములు స్పష్టముగనే బయటపడి పడగలెత్తినవి.

అర్జునుని గెలువగల - జోదులు దుర్యోధనాదుల కవసరమనెడి యూహ యప్పుడే కల్గినది. కౌరవులు పాండవులునొకరిపై నొకరు కత్తులు దూయుటకు సమాయత్తులగుచున్న విషయమును విజ్ఞులప్పుడే పసిగట్టిరి. ఆసమయముననే సూతపుత్రుడుగ పెరుగుచున్న కర్ణుడు రంగమున ప్రవేశించినాడు. దుర్యోధనుని దృష్టి యతనిపై బడినది. పాండవులపైగల యీర్ష్యతో-కర్ణునకంగరాజ్యము నప్పటికప్పుడే యొసగి దుర్యోధనుడేదో ఘనకార్యము నాచరించినట్లు-కొండంత యండనుకోరితెచ్చుకొనగలిగినట్లు తృప్తిజెందినాడు. అగ్నికి వాయువు నాడే తోడైనది. ధర్మముపై నధర్మమప్పుడే సవాలొనర్చినది. ఆ యత్నములప్పటినుండియే బలపడి పవిత్రప్రేమకు ప్రతిబంధకములై నిల్చినవి. కాలమంతయు నానావిధముగ కశ్మలమై పోయినది. కారణ మెవ్వరని నిర్ణయింపగలము? సోదరులనే ద్యూతక్రియకు దార్చి ఘోర వంచనకు గురిగావించి గెలుపుసాధించుట కిరాతక చర్య గాక యేమగును? ధర్మాధర్మముల కుమ్ములాట యన నిదియేయగునుగదా

నిండుసభలో స్త్రీని వివస్త్రనుగావించి ఆనందింపవలయు ననెడి రాక్షసవాంఛకలుగుట, కలిగినదానిని తీర్చుకొన నుద్యమించి విఫలమగుట కౌరవ సభకే చెల్లినది. అట్టి పైశాచిక కృత్యమును చరిత్రలో మరెవ్వరును సల్పియుండరేమో! అట్టి నీచాతినీచ భావన మరెవ్వరితలంపునకును వచ్చియుండదేమో!

జూదమాడి కర్మఫలము ననుభవించుటకు సన్నద్ధులై సభయందే యున్న పాండవులయెదుటనే ద్రౌపది కిట్టి ఘోరావమానము కౌరవుల వలన తటస్థించినది. ధర్మభావబద్ధప్రవృత్తిగల ధర్మరాజుకనుసన్నల జరించెడివారగుటచే భీమాదులైన సహోదరులు మిన్నకుండవలసి వచ్చెను. లేనిచో–కౌరవదుష్టగర్వారణ్య సర్వస్వమును–లీలగ–భీమ క్రోధాగ్ని యెన్నడో భస్మమొనర్చియుండెడిదే! కవలల భావ ప్రచండమారుతము-విలాసముగా నెప్పుడో కౌరవకాంతారమును సమూలముగ నిర్మూలించి యుండెడిదే! పార్థుని పాశుపతాస్త్ర వైదుష్యము-ధార్తరాష్ట్రమిథ్యా బలపాండిత్యము నేనాడో జిఒతోస్మి యనిపించి యుండెడిదే!

కాని! ధర్మజునియాజ్ఞ తమ్ములు తలదాల్చి తమను తాము మరచిపోయిరి. ఉద్రేకమున కడ్డుకట్టలు వైచుకొనిరి. భావనలను పగ్గములతో బిగియగట్టిరి. అధర్మశక్తులెట్టి రీతుల విచ్చలవిడిగ సంచరించినను-ధర్మదేవతవైఖరి సర్వవేళలనిట్టిదిగనే యుండును.

సమయమువచ్చినప్పుడు సంగరరంగమున గుండెలుచీల్చి రక్తమును జుఱ్ఱుకొనెదననియు - తద్రక్తసిక్తహస్తములతో ద్రౌపది వేణినిముడుతుననియు-దుశ్శాసనుని జూచుచు దంతములను పటపట లాడించుచు ప్రతినబట్టినాడు భీముడు. దుర్యోధనుని యూరువులను గదాదండమున బ్రద్దలు గావించెదననియు, మరొక భీషణశపథమున కుంతీమధ్యముడు నిప్పులు వెలిగ్రక్కుచు బలికినాడు. ధర్మజుడు మాత్రము పెదవి కదలింపలేదు. సర్వలోకాదర్శప్రాయమైన సహాన

శక్తియూ మహనీయునకు గలదు. కావుననే యనంత కష్టపరం పరలవచ్చి చిరునగవులతో కాలమును దొరలించుట చక్కగనభ్యసించినాడామహనీయుడు. శుభకాలముకొరకు నిరీక్షించుట మంచిదనియు-క్రోధావేశములతో వీరవిహార మొనర్చుట తగదనియు, హింసాప్రవృత్తి నవలంబించి-అఖండసామ్రాజ్య పరిపాలనాధికారమును హస్తగత మొనర్చుకొనుటకంటె-శాంతిమయ భావనతో పల్లెలలో ప్రసన్న జీవితసుధ ననుభవించుచు కాలమును గడుపుకొనుట పరమ యోగ్య విధియని ధర్మజుని భావన. ఘోరారణ్యముల మనుగడ గడుపునపుడు గాని-మరలివచ్చి సంధికొరకు శ్రీకృష్ణుని ప్రార్థించి పంపునపుడుగాని యీవైఖరినే ధర్మజుడవలంబించి సంచరించినాడు.

తీవ్రపరాభవదవానలదందహ్యమానమానసయైన ద్రౌపది-"తాను సంధి వాంఛించుటలేదనియు, ప్రతిక్రియను కాంక్షించుచున్నాననియు" పలికినపుడు; 'నీకు విచారమేల? సర్వము నిర్వహింప నేనున్నాను" గదా! అని శ్రీకృష్ణుడు సమాధాన పఱచినాడు. దీని వలన నర్థమయ్యెడిదేమి? సకలలోకాధారభూతుడు సర్వేశ్వరుడునగు శ్రీకృష్ణుడు తన యిచ్ఛానుసారముగ నీ వ్యవహారమును నిర్వర్తించుచున్నట్లుగ దోచుటలేదా!

శ్రీకృష్ణనిర్ణయానుసారమే వ్యవహారమంతయు నడుపబడినది. పాండవులభిలషించిన తెఱగున సంధి జరుగలేదు, ద్రౌపది కాంక్షించినరీతి-శ్రీకృష్ణుడనుమతించినలీల ఘోరసంగ్రామమే కొనసాగినది.

పాండవులజ్ఞాతవాసమును సాగించిన సంవత్సరము విరాటరాజు కొలువున బ్రచ్ఛన్నవేషధారులై యుండిరి. ఆ సందర్భమున కీచకుడను నీచుడు ద్రౌపదిని మోహించి బలాత్కరించ ప్రయత్నింపగా ద్రౌపది విరాటరాజుసభకేగి సాగించిన ప్రసంగము-మహోదాత్తమైనట్టిది.

నిప్పులగ్రక్కుచు-నీరాజ్యమున స్త్రీలకు గౌరవములేదా! ఈ దుష్టుల స్వైరవిహారమిట్లు కొనసాగవలసినదేనా! అని ద్రౌపది యనును. "పరిస్థితులు ప్రమాదకరములుగ పరిణమించునేమో! అజ్ఞాతము భంగమగునేమో! అనెడిభీతితో నటురాలివలె - సభకెక్కియిట్లు తైతక్కలాడవలదు. మేమువిచారించెదము, నీవు వెళ్ళవచ్చునని" కంకుభట్టు వేషమునంగల ధర్మరాజు ద్రౌపదిని గాఢముగ మందలించును. ఆ మాటలువినగనే ద్రౌపది క్రోధస్వరూపిణియై "అవును నేను నటురాలినే. నాభర్తజూదరి. నాకేమి మర్యాద తెలియును-" అని యనుచు నిశితశరము దూసికొనిపోయిన లీల సభనుండి వెడలిపోవును.

అట్టి సందర్భములలో-ఆయా పాత్రలమనస్తత్వ చిత్రణమున కవిజూపిన ప్రతిభ మరొకచోట మనకుగాన్పించదు. ధర్మభావనకు కలిగిన సంఘర్షణ-తత్త్వము నిగ్గుదేల్చబడి ధర్మమునకే ప్రాధాన్యము నిచ్చిన పరిస్థితి-మొదలయిన యంశములు మనయూహాలనొక మహాత్తరాదర్శము వంకకు మరలించుచుండును. ద్రౌపది తాత్కాలికావేశమున నా సభయందట్లన్నది. అంతియే కానిచో ఘోరారణ్యములలో పదుమూడు సంవత్సరముల కాలము భర్తలతోబాటుగ నష్టకష్టముల ననుభవించు నాడననిమాట ధర్మరాజును నాడేలయనును? స్త్రీసహజమైన యసహన తత్త్వము నట్టి సందర్భములలో నెవ్వరును నిరోధింపజాలరు. కావుననే కఠినముగనట్లు మాట్లాడినది.

తరువాత పశ్చాత్తాపముజెందినదై భీమసేనుని గలిసి తనవేదనను నివేదించుకొని కర్తవ్యము నుపదేశింపుమని ప్రార్థించినది. యోగ్యతగల యిల్లాలి భావసంఘర్షణకిది ప్రతిబింబము.

భీముడామెనోదార్చి - దోసగు ద్రౌపది యందేమియు లేదని నచ్చజెప్పి - కీచకహననమున కొకమహాత్తరమైన పథకము నాలోచించి - ద్రౌపదికి వివరించిచెప్పి పంపినాడు. ఆశించిన రీతిగనే కామాతురుడైన కీచకుడు యుక్తాయుక్తవిచక్షణాత్మక దృష్టిని గోల్పోయి

యుండుటచే - ద్రౌపది గావించిన సూచన ప్రకారము - కుందేలు సింహపు గుహను ప్రవేశించినరీతి భీముడున్న శాల కరుగును. సర్వ సన్నాహము లొనర్చుకొని సంసిద్ధుడైయున్న భీముడు కిక్కురు మిక్కురు మనకుండ నతని నక్కడికక్కడనే యుక్కడంచెను. ధర్మ శీలమునకు ద్రోహ మొనర్పబూనిన దర్ప మెన్నటికేని యిట్లే ధ్వంసము గాక తప్పదని భీముడు ఋజువొనర్చినాడు. క్రొవ్వి పరస్త్రీ వ్యామోహ మున నెవ్వరేని యిట్టి యకృత్యములకు బూనకుందురు గాక యనెడి గుణపాఠమిందుండి యెల్లరు నేర్వవచ్చును. నయశీలములకు గల బల మెట్టిదో! యెల్లరు గ్రహింపవచ్చును. కౌరవసభలో శ్రీకృష్ణ వాణిధర్మాధర్మవిచక్షణాత్మక ప్రసంగ మొనర్చినది. పాండవుల యోగ్య తను - కౌరవుల దౌష్ట్యమును విశదీకరించినది. ధర్మమే నెగ్గునని ధృత రాష్ట్రుని హెచ్చరించినది. దైవచింతనకు విముఖులుగ ధర్మద్వేషులుగ నున్న వారిలో శ్రీకృష్ణరాయబార మొక విధమైన ధూర్తత్వమునే ప్రోత్సహించినది. వారిలో మదోన్మాదమును మరింతగ విజృంభింప జేసినది.

తొలుతనుండియు కౌరవుల పక్షమునందున్నను పాండవపక్ష పాతులుగనే - అనగా ధర్మపక్షపాతులుగనే వ్యవహరించుచున్న భీష్మ ద్రోణాదులకు మాత్రము శ్రీకృష్ణవాణి కర్ణరసాయనమైనది. వారి యొడలు పులకరించినవి. శ్రీకృష్ణ దర్శన కీర్తనములతో పరవశులు గాసాగిరి. దుర్యోధనుడు తనయనుచరులు నాత్మీయులునగు కర్ణాదు లతో గలిసి శ్రీకృష్ణుని బంధింప నుంకించుట దైవకృపలేని కుంటి వాడు హిమాలయోన్నత శిఖరసీమల కెగబ్రాకుటవంటిదే యగును గదా! గడ్డిపోచలు గజరాజును బంధించునా!

ఎచటివారచట దిగ్భ్రాంతులై పడిపోయిరి. శ్రీకృష్ణుడు పర మాత్ముడైనాడు. విశ్వరూపమున నందరి యాత్మలు మగ్నములై పోవుటను గిలకింపగలశక్తి జీవాత్మల కెచ్చటిది? భీష్మాదులతో బాటుగ

నే సుకృత విశేషము వలననో ధృతరాష్ట్రునకు మాత్రము విశ్వరూప దర్శనభాగ్యము లభ్యపడినది. విదురుడు వాసుదేవున కత్యంతప్రీతి పాత్రుడే యగును గదా!

ఎచ్చటి కచ్చటనే ధర్మాధర్మముల తులనాత్మక పరిశీలన భారత మున జరుపబడుచునే వచ్చినది. ఫలిత ప్రదానముగావింపబడుచునే వచ్చినది.

శ్రీకృష్ణుడు విదురునియింట విందు నందుకొనుట — సార్వ భౌముని సపర్యల దృణీకరించుట-దీనికి సాక్ష్యములు. యోగ్యతా యోగ్యతల కవి నిదర్శనములు. ప్రేమ ద్వేషములకవి చిహ్నములు. దుష్టశక్తియెంత బలిష్ఠమైనదైనను సర్వేశ్వరశక్తిముందు దాని గొప్ప తనమెంత? ఈ యంశమునే ప్రత్యణువున భారతగాథ వ్యక్తీకరించు చున్నది.

సంధి సంప్రదింపులు విఫలమగుట-సంగ్రామమున కుభయసైన్య ములు సంసిద్ధమగుట భయంకరఖండనము ప్రారంభమగుట వరుస వరుసగ జరిగినవి. పాండవ మధ్యముని - నిమిత్తమాత్రునిగ నిడుకొని కురుక్షేత్రమున నూడలుదిగినట్లున్న విషముష్టి వృక్షములనన్నింటి నూచకోతగోయ సంకల్పించినాడు శ్రీకృష్ణదేవుడు. ప్రథమమున నాత్మీయులను దిలకింపగనే యర్జుననకు మమత మనస్సు నావరించు టతో పరిస్థితి విషమించినది. పార్థునకు గల్గిన సందేహములు సాధా రణములైనట్టివి. నరులకందరకును గల్గునట్టివి.

న కాంక్షేవిజయం కృష్ణ! న చ రాజ్యంసుఖానిచ
కిం నో రాజ్యేన గోవింద! కింభోగై ర్జీవితేనవా
ఆచార్యాః పితరః పుత్రా స్తథైవచ పితామహాః "
మాతులాశ్శ్వశురాః పౌత్రాః స్యాలా స్సమ్బన్ధిన స్తథా.

“ఏతాన్నహన్తుమిచ్ఛామి”

గురువులను, తండ్రులను, బిడ్డలను, తాతలను, మేనమామలను, మనుమలను, బావమరదులను నాతో బహువిధ సంబంధముగల నా వారి నందరిని నేను చంపలేనయ్యా! కృష్ణా! నేను విజయమును కోరను. రాజ్యముగాని, సుఖములుగాని నాకు వలదు. ఈ రాజ్యమునకుగాని, భోగములకుగాని యుద్ధానన్తరము విలువగలదా!

“కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాస్సనాతనాః”

‘సనాతనములైన కులధర్మములు నశించును. స్త్రీలు దుష్టస్వభావలగుదురు. వర్ణసంకరమేర్పడును. పితరులు ముక్తిచెందరు. జాతిధర్మము నశించిననాడు మానవులందరు నరకమున కేగవలసినదే! రాజ్యసుఖ లోభలాలసతతో స్వజనహననమునకు సిద్ధపడజాలను.’. సవ్యసాచి హృదయమిట్లాందోళనల కాకరమాయెను. నరుని హస్తమునగల గాండీవము రథముపై జారవిడువబడినది. శత్రుభీకరుడైన సవ్యసాచి ప్రకంపించుచున్నాడు. యుద్ధము చేయజాల ననుచున్నాడు. మరలి పోవుదమనుచున్నాడు. రాజ్యమును దాయలనే యనుభవింప నిమ్మనుచున్నాడు.

నరునకు పట్టిన యీ దుస్థితిని - రుగ్మతనుగాంచి, నారాయణుడైన శ్రీకృష్ణుడు నిర్విణ్ణుడైనాడు. యుద్ధభూమియందిట్టి స్థితి యర్జునునియందేర్పడినట్లు శత్రువులు పసిగట్టిన సర్వము తల్లక్రిందగును, తిన్నగ తేరునొకవంకకు జేర్చి యాయనలోగల వైక్లబ్యమును దొలగింప శ్రీకృష్ణుడు దివ్యోపదేశము నారంభింపదొడగినాడు. నరుని నిమిత్తమాత్రునిగ బెట్టుకొని క్లిష్టపరిస్థితులయందున్న నరలోకమునకెల్లను - కర్తవ్యపథమును నిర్దేశించెడి ప్రబోధము నీసందర్భమున నారాయణుడు దయతో గావించెననుట లెస్స. ఆ ప్రబోధమే ‘భగవద్గీత’ యైనది. ఇది మహాభారత మధ్యమున వచ్చిన సన్నివేశము. నారాయణుని యమృతోపదేశము భగవద్వాణియైనది.

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేనగ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతం
అద్వైతా మృతవర్షిణీం భగవతీం అష్టాదశాధ్యాయినీం
అంబ! త్వామను సందధామి భగవద్గీతే! భవద్వేషిణీం.

అని భగవద్గీతామాత తదనంతరకాలమున సర్వదా సకలప్రజలచే సంస్తుతింపబడెడి స్థాయిలో కృష్ణపరమాత్మ గీతాప్రబోధము గావించినాడు.

పదునెనిమిది పర్వముల భారతగాథలో పదునెనిమిది యధ్యాయములుగల భగవద్గీత బ్రహ్మవిద్యగా ప్రస్తుతిగాంచినది. వివిధసందేహములను వెల్లడించుచు మందునివలె చేతులుగట్టుకొని చెంతనిల్చియున్న పార్థునకు సర్వశంకానివారణ దక్షమైన గీత యుపదేశింపబడినది.

నేను కర్తను. నీవు నిమిత్తమాత్రుడవు. విధ్యుక్త ధర్మమును విస్మరించుటకన్న పాపములేదు. నీవు శాస్త్రసమ్మతముగ వ్యవహరించుటకు సర్వదా సంసిద్ధుడవై యుండవలయును. శాస్త్రవిధిని నీవు నిరాకరించుచున్నావు. తత్ఫలితమును నీవుగుర్తించినట్లుగ లేదు. వినుము.

యశ్శాస్త్రవిధి ము త్సృజ్య వర్తతే కామకారతః
నసిద్ధి మవాప్నోతి నసుఖం న పరాంగతిం.

శాస్త్రధర్మోల్లంఘన మాచరించిన వారికి సుఖముదక్కదు. ముక్తిలేదు.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ
జ్ఞాత్వాశాస్త్రవిధానోక్తం కర్మకర్తుమిహార్హసి.

ఎవ్వరైనను శాస్త్రప్రమాణముల నాధారముగగొని కార్యనిర్వహణ మొనర్పవలసి యుండును గదా!

కావున శాస్త్రవిధిని గుర్తించినవాడవై కర్తవ్యనిర్వహణకునీవు పూనుకొనవలసియున్నది. ప్రత్యంశమునందును సంశయదృష్టి తగదు. సంగర మొనర్పవచ్చిన వానికి శంక లేల?

పార్థా! విచారముకినది యదనుగాదు. రాజ్యమువీరభోజ్యము. నీచే చంపబడెడి వారెవ్వరును లేరు.

'మయైవైతే నిహతాః పూర్వమేవ'

నాచేత వీరందరెప్పుడో! చంపబడినారు. మున్నగుమాటలతో అర్జునుని మోహమును శ్రీకృష్ణపరమాత్మ పూర్తిగ దొలగించి విశ్వరూపదర్శన భాగ్యము నిచ్చుటతో పార్థుడు సరియైన దారికి వచ్చినాడు.

నష్టోమోహః స్మృతిర్లబ్ధా
త్వత్ప్రసాదాన్మయా నఘ!
స్థితోఽస్మిగత సందేహః
కరిష్యే వచనం తవ—

అనెడి స్థితికి వచ్చినాడు. గాండీవమును కేలధరించినాడు. దేవదత్తము నొత్తినాడు. పార్థుడు పరాక్రమాటోప ప్రదర్శనకుబూని శత్రుకంఠ లుంఠన మాచరింప విక్రమించినాడు. పార్థసారథి మహోద్యోగము ఫలప్రదమైనది. ధర్మదేవత సఫలమనోరథయై మురియగల్గినది.

ధర్మమునకు విజయమును సిద్ధింపజేయుట కొరకై -ధర్మోద్ధరణ వలన జగమును సర్వశ్రేయములతో కళకళలాడించుట కొరకై పరమాత్మ యొనర్చిన దివ్య ప్రబోధబలమే యీ దివ్య ప్రయోజన సిద్ధికి మూలకారణమని మనము గుర్తింపగలము.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్రపార్థో ధనుర్ధరః
తత్రశ్రీర్విజయో భూతిర్ధ్రువానీతిర్మతిర్మమ.

అనెడి పరమపావనభావనను గీత మనలో శాశ్వతముగ నిలువగలిగినది.

పార్థసారథి పర్యవేక్షణలో పార్థుడు ప్రచండ ఖండనమున కుపక్రమించినాడు. ధర్మవిజయసాధన కొరకు సాగింపబడిన - ఈ రణ రంగమున - పరమాత్మదృష్టిలో నిహతులు గావలసిన వారందరు నేల

కోరగిరి. ధర్మదేవతకు విజయము సిద్ధించినది. శ్రీకృష్ణభగవానుని దివ్యానుగ్రహాబలమున సాధకులకు సంతోషము సమకూరినది. సనాతన ధర్మవిజయ సాధనకవసరములైన వేదవిషయములన్నియు భారతమున ప్రతిపాదితములైనవి. కావుననే భారతమునకు పంచమ వేదమనెడి ఖ్యాతి వచ్చినది. సర్వవిషయములిందు గలవు. దీనియందు లేని యంశ ముల నితరత్ర గాంచజాలము.

> ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ!
> యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్

వేదవిషయ వైభవమును విస్తృతముగ వివరించుటకు స్మృతులు వచ్చిన తెలుగు ననే పురాణేతిహాసములును వచ్చినవి. వేదార్థాలను సరియైన తెలుగున సమన్వయించుట వలననే భారతము పంచమవేదము కాగల్గి నది. మహర్షి యీామహేతిహాసమునకు స్రష్టగావడము మరొక భాగ్యము. వస్తుగౌరవమును బట్టి భారతమున కాపేరు వచ్చినట్లు కొందరు భావించిరి.

> వేదములకు నఖిలస్మృతి
> వాదములకు బహుపురాణ వర్గంబులకున్
> వాదైనచోటులను దా
> మూాదలధర్మార్థ కామమోక్షస్థితికిన్

సనాతనధర్మమునకు లక్ష్యమైన "జయము"ను వర్ణించిన గ్రంథమగుటచే దీనికి 'జయ' మనియు మరియొక నామము గలదు.

> "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
> అధ్యాత్మవిదులు వేదాన్తమనియు
> నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని
> కవి వృషభులు మహా కావ్యమనియు

లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిగొని యాడుచుండ ''

భారతము-బహుముఖ ప్రతిభావంతుల ప్రస్తుతులకు పాత్రమైనది. సకల విశ్వమున కాదర్శ గ్రంథముగ గణనకెక్కగల్గినది.

మహాభారతమువలెనే ధర్మముతోబాటుగ భక్తికిగూడ ప్రాధాన్యము నొసగి దివ్యతత్త్వమును ప్రబోధించిన మరొకపావన గ్రంథ రాజము శ్రీమద్భాగవతము. వేదవ్యాసమునీంద్రులచే సంగ్రథింపబడిన పావన ప్రబంధరాజమిది. మహాభారత రచనవలనగాని, అష్టాదశపురాణముల సృష్టివలనగాని సంతృప్తి చెందని వ్యాసమహర్షి తీరని వేదనతో క్రుంగుచు-శాంతిని గోల్పోయి పరితపించుచున్న తటి నారదమహర్షిచే ప్రబోధితుడై పుణ్యకథాబద్ధము-భగవత్తత్త్వ వర్ణనాత్మకము పావన భావ సంభరితమునగు శ్రీమద్భాగవతమును రచింప బూనుకొని భక్తిరససమ్మిశ్రితముగ నిద్దానినామహనీయుడు సృజించి-మహదానందము నందెనట. కాలము వికృత స్వరూపమును దాల్చి వ్యవహరించు తరి లోకమునందేర్పడిన వికార పరిస్థితులను భక్తిభావముతో సరిదిద్ది రక్షించెడి నిమిత్తమే భాగవత మావిర్భవించినది. భగవంతుని నమ్మి పూజించి తరించినవారు భాగవతులు. వారి పుణ్యగాథలిందుండుటచే దీనికి 'భాగవత' మని పేరు వచ్చినది. శ్రీహరినామ సంస్మరణ పరాయణుడై సర్వత్ర శ్రీమన్నారాయణుడే నిండియుండెనని విశ్వసించి రాక్షస చక్రవర్తియైన తండ్రి విధించిన శిక్షలననుభవించి భగవానుని దివ్యానుగ్రహమును గడించిన పరమ భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు.

'అంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపాన విశేషమత్త' - చిత్తుడు

ప్రహ్లాదుడు. గొప్ప చక్రవర్తియయ్యును భగవంతుని నమ్మి-ఏకాదశీవ్రతము నొనర్చుచు, దూర్వాసుని యగ్నిపరీక్షయందు నెగ్గి యాదర్శపాత్రుడైన నృపాల చూడామణి యంబరీషుడు.

స్వశక్తిపై నాధారపడి - అహంకరించి భగవంతుని లెక్కింపక పరమాత్ముని యునికిని గురించి సందేహించి-లావొక్కింతయు లేనితరి-ప్రాణంబులు ఠావులు తప్పినవేళ జ్ఞానోదయముకాగ, నీవేతప్ప నితః పరంబెరుగనని-అలవైకుంఠమున గలవానిని రావే యీశ్వరా! కావవే! వరదా! యని ప్రార్థించి-ఆయన కృపచే కృతార్థుడై తరించినవాడు గజేంద్రుడు. భక్తిమయ చిత్తమున శ్రీకృష్ణునే యర్చించి తనను తానే యర్పించుకొని వివాహమాడి ధన్యురాలైన తరుణీ రత్నము రుక్మిణి.

యమునానది యొడ్డున చుట్టునుచేరి యాటలాడుచు, చలుదులు తినుచు, సరస సంభాషణ సలుపుచు శ్రీకృష్ణునిదయకు పాత్రులైన వారు గోపబాలురు. కృష్ణనామస్మరణముతో తరించిన పుణ్యమూర్తి యుద్ధవుడు. కనిన దేవకీవసుదేవులు, పెంచిన నందయశోదలు, ప్రేమించిన గోపికలు, సేవించిన మహర్షులు శ్రీకృష్ణుని దివ్యానుగ్రహపాత్రులే.

భాగవత మీవిధముగ పరమపావన కథా భాగముల కెన్నింటికో నిలయమై భగవత్తత్త్వ నిరూపణ మొనర్చుచున్నది. సకల ప్రాణికోటి యందు భగవద్భావము నెవ్వడు దర్శించునో వాడు 'భాగవతు' డని యెరుగవలయును.

"నిగమకల్ప తరోర్గళితం ఫలం శుకముఖా
దమృతద్రవ సంయుతమ్
పిబత భాగవతం రసమాలయం
ముహురహోరసికాః భువి భావుకాః"

భాగవతమున ద్వాదశస్కంధములున్నవి. ద్వాదశాక్షరియైన

"ఓం నమో భగవతే వాసుదేవాయ"

యనెడి మంత్రమునగల యక్షరముల కివి సూచకములు. వాసుదేవ మంత్రానుష్ఠాతలు భాగవతతత్వసుధను బాగుగ గ్రోలి ధన్యులగు చుందురు. వాసుదేవ కథానిలయమైన భాగవతము మోక్షకాముకుడైన పరీక్షిత్తుచే వారము దినములలో శుకమహర్షి వలన శ్రవణమొనర్పబడినట్టిది. భాగవతము గంగవంటిది. గంగను దర్శించినవారు, గంగలో స్నానమాడినవారు, గంగాజలములను గ్రోలినవారు పవిత్రులుకాగలరు. అట్లే భాగవత విషయములను ప్రశ్నించి తెలిసికొననెంచిన పరీక్షిత్తు-సమాధానము చెప్పిన శుకమహర్షి, వినెడి భక్తులు పవిత్రులుకాగలిగిరి. పరమభక్తి భావమున పోతనామాత్యులవారి శ్రీమద్భాగవతము సాంధ్రమున కనువదించినారు. ప్రత్యక్షర రసాత్మకముగ; భవ్యభక్త్యావేశ భరితముగ నాంధ్రీకరింపబడిన భాగవతము తెలుగు ప్రజలకారాధ్య గ్రంథమైనది.

మందార మకరందమాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీ వీచికలదూగు
రాయంచ జనునె తరంగిణులకు
పూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం
బరుగునే సాంద్ర నీహారములకు
లలిత రసాలపల్లవఖాదియై చొక్కు
కోయిల చేరునే కుటజములకు

సంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుతగుణశీల! మాటలు వేయునేల?

తెలుగువారిలో పలువురి జిహ్వాగ్రములపై నిరంతరము నర్తించుచుండు పద్యమిది. పోతనకవితాధారను-మందారమకరంద మాధుర్యసమన్విత సారస్వత రసధారగా-భక్తిభావబంధుర దివ్యామృతధారగా ప్రజలు ప్రస్తుతించుచుందురు.

> శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వేయేటికిన్
> గాథల్ మాధవశేముషీతరణి సాంగత్యంబునంగాక దు
> ర్మేధన్ దాటగవచ్చునే సుతవధూమీనోగ్రవాంఛామద
> క్రోధోల్లోల విశాలసంసృతిమహాఘోరామితాంభోనిధిన్.

మొదలైన పద్యములలో పోతనామాత్యుని భగవత్సేవాభావము-మన ఆర్షసంస్కృతికి, ధర్మమునకు, సముత్తేజమును గూర్చునట్టిది.

> చేతులారంగ శివుని పూజింపడేని
> నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
> దయయు సత్యంబులోనుగా దలపడేని
> కలుగనేటికి తల్లుల కడుపుచేటు

భగవన్నుతిని, భగవత్పూజను విస్మరించిన వానిజన్మ నిరర్థకము. తల్లుల కడుపుచేటుగ-వాడు తనువు ధరించుట దండుగ. పోతనగారు నిండు గుండెతో నిర్భయముగ పలికిన పల్కులివి. అంతస్తులతో పనిలేక రేయే-అంతరంగ శుద్ధిని మానవులు ప్రదర్శించుట నేర్చుకొనవలయునని భాగవతము మనల నాదేశించుచున్నది. బాల్యముననొకే యొక గురువు వద్ద విద్యనభ్యసించిన వారియందొకరు ప్రభువుగావచ్చును. మరొకడు పరమదరిద్రుడు గావచ్చును. వారిరువురి నడుమ ప్రేమమయప్రవృత్తి కెట్టి యాటంకమేనియు సంఘటిల్లరాదు. సంఘటించిన నది మానవతకే తీరనిమచ్చ.

మైత్రి - మాననీయమైనది. మిత్రభావమును ప్రాణసమానముగ నెంచవలయును. స్నేహితుని యెరుగనట్లు కించపరచుటకు యత్నించ

రాదు. సనాతనమైత్రీ ధర్మమిది. ఈ ధర్మమును భాగవతము కృష్ణ కుచేలుల కథలో విస్పష్టమొనర్చుట మన మరయగలము. కుచేలుడు నిరుపేద. శ్రీకృష్ణుడు శ్రీమంతుడు. బాల్యస్నేహమును బురస్కరించుకొని తనను జూడవచ్చిన కుచేలుని కృష్ణుడెట్లు గౌరవించెనో గమనించిన, మనము సాగించుచున్న స్నేహముల కర్థమేమో, తేట తెల్లమగును. కుచేలుని కొరకు శ్రీకృష్ణుడు సింహాసనమునుండి దిగి యెదురుగవచ్చి అర్ఘ్యపాద్యాదుల నందించినాడు. పట్టపుదేవేరులచే సపర్యల చేయించినాడు. పట్టుపరుపులుగలశయ్యపై గూర్చుండబెట్టి నాడు. ప్రక్కనుజేరి యోగక్షేమములు విచారించినాడు. మమతతో మాటలాడుచు మధురాహారము నొసంగినాడు. ప్రేమతోదెచ్చి అంగవస్త్రమునగట్టి దాచియుంచిన యటుకుల ననురక్తితో తానే యడిగి పెట్టించుకొనినాడు. సకలైశ్వర్యములు ప్రసాదించినాడు.

శ్రీకృష్ణుడు భాగవతమున దైవముగ మాత్రమేగాక - మహాదర్శములను - సకల మానవాళికి దెలియజెప్పెడి మానవోత్తముడుగ గూడ సాక్షాత్కరించుచుండును. ప్రహ్లాదకథ-గజేంద్రగాథ-అంబరీషుని చరిత్ర మొదలైనవి-అంధ్రమున రసోజ్జ్వలశైలిలో భాగవతమునకు మెఱుగులు దిద్దుచున్నవనియు - మూలముతో పోటీపడిన యనువాద వైభవమిట్టి ఘట్టములలో వర్ణితమై-అనువాదకుని యద్భుతశక్తిని విశదీకరించుచున్నదనియు విజ్ఞులనుచున్నారు.

ధన్యున్ లోకమనోభిరాము కుల విద్యారూప వయోవర్ణ్యసౌ
జన్య శ్రీబలదానశౌర్య కరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్గోరరు? కోరదే? మును రమాకాంతాజలామంబు-రా
జన్యానేకపసింహ! నావలననే జన్మించెనే మోహముల్.

వినిర్మలభక్తియుక్త ప్రేమమయ హృదయమున రుక్మిణి శ్రీకృష్ణపరమాత్మున కొనర్చుకొనిన విజ్ఞప్తి యిది.

సంస్కృత దీర్ఘసమాసముల సృష్టియందెంత ప్రతిభయుండెనో, అచ్చిక పదముల కూర్పునగూడ నంతటి ప్రజ్ఞయేయున్న మహాకవి

పోతనగారు. కొందరకు తెనుగు నచ్చును-కొందరికి సంస్కృతపదము లన్న నిచ్చ హెచ్చుగనుండును, మరికొందరు ద్వివిధపదములు సమాన స్థాయిలో సముచితముగ ప్రయుక్తములైనపుడే మెచ్చుదురు. వీరి నందరి నాయారీతులతో నేను సంతృప్తిపరచుటకు యత్నింతునని సవిన యముగ మనవిజేయుచున్న యీ మహాకవి-తన లక్ష్యము నతురాతుర ముల భాగవతమునందములు పరచెనని యాంధ్ర భాగవత పఠనమొన ర్చినవారెల్లరనగలరు. పోతన కవీంద్రుని యసాధారణశక్తి యట్టిది. ఇది యంతయు శ్రీరామానుగ్రహమని యీ మహనీయుడు సవిన యముగ గావించెడి మనవి నాలకించిన లోకమున దైవచింతనా తత్ప రత యెట్లు వ్యాప్తమగుట కా మహాకవి కృషి యొనర్చినదియును మన కర్థమగును.

పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట—నే
పలికిన భవహరమగునట
పలికెద వేరొండుగాథ పలుకగనేలా।

సర్వము రామచంద్రుని దయావిశేషమని యెంచిన యీమహా కవి ధనకాంక్షకు లొంగక - రాజులకీ యుద్గ్రంథము నంకిత మొనర్చు టకు సమ్మతింపక శ్రీరామచంద్రునకే సమర్పించి - కవితారంగమున దివ్యాదర్శము నెలకొల్పిన పుణ్యమూర్తి. కావుననే!

"ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురమ్ములు వాహనమ్ములున్
సొమ్ములు కొన్ని పుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెటపోటులన్ బడక సమ్మతి శ్రీహరికిచ్చిచెప్పె-ఈ
బమ్మెర పోతరాజొకడు భాగవతమ్ము జగద్ధితమ్ముగన్"

అనియే మహనీయుడో! పోతనగారిని గురించి-అత్యుక్తిలేని ప్రశంస యొనర్చినాడు. పోతనగారే యీ పద్యమును రచించెనని కొందరందురు. పోతనవంటి సౌజన్యమూర్తి, పరమభాగవతుడు, వినయస్వరూపుడు, ఇట్టి పద్యమును వ్రాయునా! ఏమో! భాగవతము

# కావ్య కళాలక్ష్మి

* * *

పురాకవీనాంగణనా ప్రసంగే
కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసః
అద్యాపి తత్తుల్యకవేరభావా
దనామికాసార్థవతీ బభూవ.

మహాకవి కాళిదాసును గురించి - విజ్ఞు లొనరించిన ప్రశంస యిది. వ్రేళ్ళుమడచి మహాకవుల పేర్లు లెక్కింపబూనినపుడు చిటికెన వ్రేలుమడచి కాళిదాసు పేరు చెప్పిన తరువాత. మరొక వ్రేలుమడిచి చెప్పుటకు దగిన పేరు గన్పింపకుండుటచే చిటికెన వ్రేలు సార్థవతియైన దట! తరువాత నున్న - ఉంగరపు వ్రేలు అనామికగనే యుండెనట. నిజముగ కాళిదాసమహాకవి ప్రజ్ఞ తాదృశ మైనట్టిదేయని లోకమెల్ల నేకముగ వాకొనగలదు.

కృతయుగమున యాస్కునివలె - త్రేతలో వాల్మీకివలె-ద్వాపరమున వ్యాసునివలె - కలియుగము నందార్ష సంస్కృతికి పట్టుగొమ్మగ నిల్చి సనాతన ధర్మ ప్రబోధ మొనర్చిన ఋషితుల్యుడైన మహాకవి - కాళిదాసు. కాళికాదేవి వరప్రసాదబలమున - అసాధారణ మేధా సంపత్తి కలవాడై - అపూర్వ సాహిత్యసృష్టి యొనర్చినాడీమహాకవి. రఘువంశ, కుమార సంభవ, మేఘసందేశాది దివ్య కావ్యనిర్మాణ మొనర్చి ఘన కీర్తిగడించిన మహనీయుడీతఁడు. మాళవికాగ్నిమిత్ర ముతో నాటకరచనము నారంభించి - అభిజ్ఞాన శాకుంతల నాటక రచనముతో - అఖండ కీర్తి నార్జించిన కవివతంసుడీయన. వ్యర్థ పద రహితమైన కవితకు, మనోహరమైన - ఉపమాలంకార సృష్టికి పేరెన్నికగన్న వాడగుటచే "ఉపమా కాళిదాసస్య" అని కాళిదాసును కవికుల గురువుగా లోకము కీర్తించినది. రఘువంశమును రచింప

బూనుకొని

"క్వసూర్య ప్రభవోవంశః క్వచాల్ప విషయామతిః
తితీర్షుః దుస్తరం మోహాదుడుపేనాస్మి సాగరమ్"

అని వ్రాసిన శ్లోకము గొప్ప ప్రతిభావంతుడయ్యు నా మహాకవి ప్రకటించిన వినయమునకు తార్కాణము.

"నదీషుగంగా నృవరేషురామః
కావ్యేషు మాఘః కవికాళిదాసః"

అనెడి సూక్తి కవిలోకమున కాళిదాసుకు గల ఘనతను సూచించుచున్నది.

మాఘుడు రచించిన శిశుపాలవధ, భారవి కిరాతార్జునీయము, భవభూతి ఉత్తరరామ చరితము-బాణుని కాదంబరి, దండి దశకుమార చరిత్రము మొదలైన మహోజ్జ్వల గ్రంథము లెన్నియో సంస్కృత వాఙ్మయమున సృష్టింపబడి ఆర్షసంస్కృతికి వెలుగు జిలుగులను ఘటించి, విశ్వవిఖ్యాతి నార్జించినవి.

ప్రతాపరుద్రుని యాస్థానమునగల విద్యానాథుడు, మహామ్మదీయ ప్రభువులను సైతము తన యపూర్వ కవితాప్రతిభచే మెప్పించి మహత్తర కీర్తి గడించిన జగన్నాథ పండితరాయలు, సంస్కృతవాఙ్మయమున కాళిదాసుకంటె ముందే బహుముఖనాటక రచనకు పూనుకొని నిరుపమాన యశమును గడించిన భాసమహాకవి, పదునైన పలుకుబడిగల మయూరుడు, మొదలైన వారెల్లరు సంస్కృత భాషలో సర్వతోముఖ ప్రతిభావంతములైన గ్రంథముల నెన్నిటినో సృజించి కీర్తి నార్జించిన ప్రముఖులు

ఒకవంక వాఙ్మయ రంగము నందిట్లు మహనీయులైన విద్వద్వరేణ్యులు సనాతన ధర్మమునకు సేవ సలుపుచుండ - మరొక వంక బుద్ధునివంటి పుణ్యమూర్తులు తద్ధర్మమును సముద్ధరింప బద్ధకంకణులైరి. జంతుబలులతో జాతరలతో పరపీడనలతో - హింసాభావము విజృంభించి

విహరించుచున్న సమయమున దేశమునకు కొండంతయండగా సాయ పడినవాడు బుద్ధభగవానుడే. శుద్ధోదనప్రభువున కేకైక పుత్రుడయ్యు శాక్యసామ్రాజ్యమునకు సర్వాధికారియయ్యు - సౌందర్యరాశియగు భార్యను, పసిబిడ్డను, తృణప్రాయముగ త్యజించి సన్యసించిన త్యాగి. లోకమున గల వివిధ దారుణ సన్నివేశముల గాంచి, ప్రేమతత్త్వ మును ప్రబోధించి సర్వ సామ్రాజ్యమును పరిత్యజించి లోకము నుద్ధ రించుటకై సిద్ధపడిన యతిచంద్రుడు. భోగమును వదలి, రాగమును మరచి, జ్ఞానధనము నార్జించి ప్రేమభిక్షను లోకమునకు పంచిన-అవ తార పురుషు డీయన. కుంటుచున్న మేకపిల్లను గాంచి కన్నులనీరు పెట్టుకొని, కటుకు కత్తులకెదురు నిలిచి కాపాడిన కరుణామయ హృదయుడు. ఆయన ప్రవచించినది వేదధర్మమే. ఆయన యందించి నది వేదసందేశమే. వేదము సత్యమును వచింపుమనుచున్నది. ధర్మము నాచరింపు మనుచున్నది. "అహింసాపరమోధర్మః" అను సిద్ధాన్తము ననుష్ఠింపు మనుచున్నది. హింసాపూరితమైన యజ్ఞకాండ నాయన వ్యతిరేకించినాడు.

మానవ హృదయములలో ప్రేమబీజములునాటి శాంతి ఫలము లను పండించగలిగిన మహాత్ముడు బుద్ధుడు. బుద్ధసిద్ధాంతము భారతము నందే గాక సుమిత్ర, జావా, బోర్నియో, చీనా జపాన్ మొదలైన ప్రాంతములకు గూడ వ్యాపించినది. బౌద్ధులకృషి - ఆధ్యాత్మిక రంగమునందే గాక భౌతికశాస్త్రరంగములో, లలితకళారంగములో జ్యోతిషాయుర్వేదాది విద్యారంగములలో కూడ - అపారముగ కొన సాగినది. బౌద్ధయుగము నిపుణులైన శిల్పుల నెందరినో లోకమున కందించినది. బుద్ధుని యాత్మబలము విస్తృతస్వరూపమున వ్యాప్తి గాంచుటకు ప్రియదర్శిగ పేరెన్నికగన్న - అశోకుని శాసనబలము ముఖ్యకారణము

తొలుత అశోకచక్రవర్తి సర్వరిపుజనభయంకరుడు. హింసా త్మక ప్రవృత్తికలప్రభువు. మహాసాహసి. కాని బుద్ధుని బోధనలతో -

అశోకుడు ప్రేమఖనియైనాడు. యుద్ధములకు స్వస్తిచెప్పినాడు. క్రూరవిధానములను విస్మరించినాడు. సహృదయచక్రవర్తియై దయామయుడై మనుజులకే కాక పశుపక్ష్యాదులకు గూడ సేవచేయువాడుగ మారినాడు. అన్నదాన సత్రములు మానవులకే కాక పశు పక్ష్యాదులకు గూడ. జలాశయములు, ఉచిత వైద్యశాలలు నిర్మించి అఖండ భూతదయను ప్రదర్శించినాడు. విశ్వప్రేమను వెలయించినాడు. ఈ విధముగ బౌద్ధయుగము స్వర్ణయుగముగ విశ్వవిఖ్యాతి గాంచినది. సర్వమానవ సంక్షేమమే ధ్యేయముగ నిడుకొని సాగిన - ఈ ప్రయత్నమంతయు హీనయాన, మహాయానములనెడి పేర్లతో బౌద్ధమతము రెండు భాగములుగ చీలిన వెంటనె తారుమారాయెను. బౌద్ధ సంఘారామములలో స్త్రీ పురుషులు సమముగ సన్యాసదీక్ష స్వీకరించి - ఉత్తమజీవితమును నిర్వహించుటకై యొసగబడిన సదవకాశము దుర్వినియోగ పరచబడినది. నయశీలములు నశించినవి. మనోదౌర్బల్యము పెరిగినది. నందరాజుల, గుప్తరాజుల కాలమున చెప్పుకొనదగినంత చైతన్యము సనాతన ధర్మమునకు కలుగలేదు. మహాప్రజ్ఞానిధియైన చాణక్యుడు చంద్రగుప్తుని పక్షమున చేరి సాగించిన కృషి - ఆ మహావ్యక్తి యొక్క మేధాబలమునకు సాక్ష్యమై సనాతన ధర్మమునకు కొంతగ సహకరించిన మాట నిజము. తరువాత కాలమున దేశగౌరవమును కాంక్షించి - ఆర్ష సంస్కృతిని పెంపొందించిన సార్వభౌములలో విక్రమాదిత్యుడు గణనీయుడు. నవరత్నములనదగిన మహాకవులను; పండితులను పోషించి సాహిత్య సంపదను పెంపొందింపజేసి సనాతన ధర్మమును సంరక్షించిన గౌరవము విక్రమాదిత్యునకు దక్కినది. నాయనారులు శివభక్తిని వ్యాపింపజేయు తేవారములను (దేవహారములు) రచించి ప్రజలలో భక్తి భావమును పాదుకొల్పిరి. వైష్ణవ భక్తులైన ఆళ్వారులు విష్ణుభక్తిని ప్రబోధించుచు మధుర కవితలో పాశురములను రచించిరి. మధురాతి మధురముగ గాన మొనర్చిరి. కుల మత శాఖా తార తమ్యములు

లేకయే పరమభక్తివలన మానవులెల్లరును తరింపవచ్చునని ఆళ్వారుల సందేశము. భక్తిభావ భరితమైన పద్ధతిలో సనాతన ధర్మమును వ్యాప్తిగావింప సంకల్పించిన యాళ్వారులు పన్నిద్దరు. వారిలో కొందరు పంచములున్నారు. అండాళ్ మహిళారత్నము. కులశేఖరుడు రాజు. విష్ణుచిత్త నమ్మాళ్వార్లు బ్రాహ్మణులు. జీవితమునంతయు భగవద్విషయములను సేవించుటకే వినియోగించి వీరెల్లరు తరించిరి. భావితరముల వారిని తరింపజేయుటకు భక్తిమార్గములను చూపించిరి. ఆళ్వారుల భావ పరంపరలను సమాశ్రయించియే తరువాత కాలమున రామానుజాచార్యులు, వేదాన్తదేశికులు మొదలయిన వారందరు వైష్ణవతత్త్వమును సముద్దీపిత మొనర్చిరి.

## ఆచార్యత్రయము

కేరళప్రాంతమునగల కాలడిలో - ఆర్యాంబా శివగురుదంపతులకు జన్మించి మహా ప్రతిభావంతుడై బాల్యముననే తల్లియనుమతితో సన్యాసదీక్ష వహించి భారతదేశము నందంతట పలుమారులు పర్యటించి సనాతన దివ్యతత్త్వ పటిమను ప్రదర్శించిన శంకరాచార్యులవారు వైదికసంస్కృతికి అపారమైన సేవచేసినవారు. బ్రహ్మసూత్రములకు, భగవద్గీతకు, ఉపనిషత్తులకు శంకరులవారు వ్రాసిన భాష్యము సాటిలేనిది. బ్రహ్మసత్యమనియు; జగత్తుమిథ్యయనియు; జీవుడే బ్రహ్మయనియు శంకరుడు వాడవాడల ప్రచారము చేసెను.

"బ్రహ్మసత్యం, జగన్మిథ్యా జీవోబ్రహ్మైవ నాపరః"

దక్షిణమున శృంగేరిలో, పడమర ద్వారకలో, తూర్పున జగన్నాథములో, ఉత్తరమున బదరిలో తన సిద్ధాంతములను ప్రచారము చేయు నిమిత్తమై నాలుగు మఠములను స్థాపించిరి. అందు పీఠాధిపతులను నియమించిరి. మండనమిశ్రునివంటి మహావిద్వాంసునిగూడ జితోస్మి యనిపింపజాలిన ధీశక్తి శంకరాచార్యునకే కలదు. సర్వజన

వందనీయుడై వైదిక సంస్కృతిని సురక్షితముగ కాపాడుటకేగాక ప్రబలముగ వ్యాప్తమొనర్చుటకుగూడ ఈ సంయమి చంద్రుడొనర్చిన కృషి యసాధరణమైనట్టిది. ప్రఖ్యాతమైన మాయావాదమున కీయనయే స్రష్ట. శంకరుని యతిలోక ప్రతిభా సంపత్తికి మాయా వాదము సజీవ చిహ్నము.

"అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి" అనునవి శంకరాచార్యులు ప్రబోధించిన ఉపనిషత్తులంగల సత్యసూక్తులు. ప్రస్థానత్రయమునే అనగా ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత యనువానినే ప్రమాణములుగ నామోదించి వ్యవహరించినా డీ మహనీయుడు. అద్వైతమతమును బలపరచి ప్రబలవ్యాప్తికి గొనివచ్చినాడు మండన మిశ్రులతో శంకరులు సాగించిన వాదము లోకోత్తర ప్రశస్తి నందు కొన్నది. ఆ సందర్భమున మండనమిశ్రులవారి భార్య ఉభయభారతి న్యాయపీఠమున నిల్చి, శంకరులు విజయము నందిరని ప్రకటించుటొక మహత్తరవిషయము. ఉభయభారతి వైదుష్యమేకాక, విశాలదృష్టియు సర్వలోకాదర్శపాత్రమని చెప్పవలయును. శంకరుల మహాప్రతిభకు శిరస్సువంచి జోతలొనర్చుటకు నోచుకొనని ఈర్ష్యాపరులు కొందరు శంకరాచార్యులవారి తల్లి మరణించినపుడు పలుకరించుటకేనియు నొక్కరురాక వెలివైచి యామహనీయు నేకాకిగనొనర్చి బాధింప వలయునని నీచభావముతో యత్నించిరి. శంకరుడు జంకలేదు తల్లికి మున్నొనర్చిన వాగ్దానానుసారముగ తానొక్కడే విధ్యుక్తముగ నంత్య క్రియ లొనర్చినాడు. ఈర్ష్యాపరుల యల్పబుద్ధియే వ్యక్తమైనది. కాని శంకరున కేమిలోటు? మహోజ్జ్వలస్థాయిలో వైదిక ధర్మరక్షణకు సర్వవిధముల శ్రమించిన యీ పూజ్యుడల్పవయస్సునందే తనువు చాలించుట విచారకరము శంకరవాణి సర్వకాలములలో అద్వైత ధర్మ సముద్దీపనకు సహకరించుచునే యుండగలదు.

వైష్ణవధర్మ సిద్ధాంతములను ప్రజలలో బాగుగ వ్యాపింపజేసి దైవభక్తిని పునరుద్ధరించుటకై భగవద్రామానుజుల వారవతరించి

నారు. "ఓం నమో నారాయణాయ" అను తిరుమంత్రమును ప్రబోధించిన మహనీయుడీయన. శంకరునివలె యీయనయు ప్రస్థానత్రయమునకు భాష్యరచన కావించెను. సర్వప్రపంచమునగల వారికి వైష్ణవ మహిమలను విప్పిచెప్పుటయే ఈయన పరమలక్ష్యము. యాదవ ప్రకాశుడను గురువునకు శిష్యుడై యీయన సకల విషయ విజ్ఞానము నార్జించినాడు. అరమరిక లుండరాదనియు, అంటరానితనము తొలగింప బడవలయుననియు రామానుజుడాశించెను. సర్వప్రజలు సులభముగ శ్రవణమొనర్చుటకై గోపురాగ్రమున కెక్కి తిరుమంత్రము నీ మహనీయుడు వినిపించి ప్రబోధించెను. నా యనుమతి లేకయే తిరుమంత్రము నెల్లర కందజేసిన నీవు నరకమున కేగుదువని గురువు బెదరింపగా నేను గావించిన మంత్రోపదేశ బలమువలన లక్షలాది ప్రజలు మోక్షమున కేగుచుండ నేనొక్కడను నరకమున కేగినను దిగులుపడ నవసరములేదని మనవిజేసిన విశాల భావుడు రామానుజుడు. ఈయన విశిష్టాద్వైతమును స్థాపించి ప్రచారమునకు దెచ్చినాడు.

ఆర్షసంస్కృతి నుద్ధరింప నుద్భవించిన మహనీయులలో మధ్వాచార్యులవారొకరు. శంకరుని యద్వైతవాదమును మధ్వాచార్యులు తీవ్రముగ ఖండించినారు. రామానుజుని విశిష్టాద్వైతముగూడ ఈయన విమర్శకు గురికాక తప్పలేదు. మధ్వాచార్యులవారు పరిపూర్ణద్వైతి. ఉడిపిలో కృష్ణవిగ్రహమును స్థాపించి, యారాధించుచు మధ్వమత ప్రచారము కొరకై యచటనే యెనిమిది మఠముల నీయన స్థాపించినాడు. ప్రథమమున తనసోదరులనే మఠాధిపతులుగ నుండ నియమించెను. వారందరును ఆబాల్యసన్యాసులై యుండవలయునని శాసించుట మరొక విశేషము. మధ్వాచార్యులవారి నియమమట్టిది. పాండిత్య బలమువలెనే శరీరబలముకూడ పుష్కలముగగల యారోగ్యవంతుడాయన. మహమ్మదీయు లీదేశమున పరిపాలన సాగించునపుడు స్వసంస్కృతిని సంరక్షించి స్వధర్మమును

ప్రజలలో మరుగుపడనీయక వ్యాప్తము గావించుటకై యెందరో మహనీయులు వారివారి శక్తికి మించిన కృషిచేయవలసి వచ్చినది. వారనుసరించిన పథములు భిన్న భిన్నములైనవే యగుగాక! కాని వారికిగల యాశయము మాత్రమొక్కటే. అదియే, ఆర్ష సంస్కృతి సంరక్షణము, సనాతన ధర్మ సముద్ధరణము.

సింధునది కవ్వలియొడ్డునగల వారమగుటచే తరువాత కాలము నందితర దేశములనుండి మనదేశమునకు వలసవచ్చిన వారెల్లరు మనలను సింధువులనసాగిరి. పారశీక భాష యందుచ్చారణ వశమున 'స' కారము 'హ' కారముగ మారి కొలదికాలముననే 'హిందు' శబ్దము వ్యవహారమున స్థిరపడిపోయినది. ఆ కాలమున రాణాప్రతాపునివంటి యాత్మ గౌరవోపేతులైన రాజపుత్ర వీరచూడామణులు దేశభద్రత కొరకు, సాహసోపేత కార్యము లాచరించుచునే తనువులను త్యజించినారు. పదనుగల భావబలముతో శ్రమించెడి ప్రభువులు కొఱవడిన కొలది మహమ్మదీయుల క్రూర దండయాత్రల ఉద్ధతి ప్రబలసాగినది. పృథ్వీరాజువంటి దేశభక్తులు కొందరుండి దీక్షతో ప్రాణములనేని లెక్కింపక యవనులదాడినుండి జాతిగౌరవమును సంరక్షింప నుద్యమించినను జయచంద్రునివంటి నీచులు, దేశద్రోహులునుండుట వలన సనాతన ధర్మమున కీసమయమున రక్షణయే లేకపోయినది. హృదయ విదారకములైన పరిస్థితులేర్పడినవి. హిందువులలో పలువురు మతభ్రష్టులై పోయిరి. మహిళల మర్యాదకు తీరని లోటు వాటిల్లెను. మాతృదేశ గౌరవసంపదనే పణముగబెట్టి స్వార్థముకొఱకు వ్యాపారము సలుప దొడగిన కొందరు హిందువుల దురంత తృష్ణకు నాటి సామాజిక పరిస్థితులు ప్రతిబింబములు.

అక్బరువంటి ప్రభువులొకరిరువురు-కొంతవరకు హిందువుల యెడ గౌరవమర్యాదలు ప్రకటించినట్లున్నను పెక్కురు మహమ్మదీయులు హైందవధర్మ విద్రోహచర్యలనే తలపెట్టి భీభత్సపరిస్థితులనే

యనుతుణ మీదేశమున నాడు ప్రజ్వలింపజేసిరి. భారతీయులు చిత్త శాంతిని గోల్పోయినవారై-మరణించలేక జీవించిరనవచ్చును. మాన సింహునివంటి కొంతమంది స్వదేశరాజులుగూడ భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు సంస్కృతికి వెన్నుపోటు పొడిచినారు. స్వదేశగౌరవమును కాలరాచివైచినారు.

మొత్తముమీద మహమ్మదీయుల యుద్ధతి నాడు హిందూ సమాజముపై కొన్ని మాయనిమచ్చలనే వైచినది. ప్రజలు జుట్టు పన్ను వంటి భయంకరశాసనములకు దలవంచి కిక్కురుమిక్కురు మనకుండిరి. దేవాలయములపై బడిన మహమ్మదీయులదృష్టి దారుణ పరిణామములకు దారిదీసినది. బంగారురాసులను ద్రవ్యనిధులను, స్వేచ్ఛగ నచటినుండి మహమ్మదీయ ప్రభువులు తరలించుకొని పోయిరి. దేవాలయముల నన్నింటిని క్రూరముగ దగ్ధ మొనర్చిరి. విగ్రహములు ధ్వంసములై పోయినవి. కళలు సర్వనాశనము గావింప బడినవి. భారతీయ విజ్ఞానమునకు మూలకేంద్రములుగ- సరస్వతీ దేవాలయములుగ విరాజిల్లెడి గ్రంథాలయములనుగూడ వారు వదల లేదు. గ్రంథాలయములు మాడ్చి మసిగావింపబడినవి. సర్వనాశనమై పోయిన భారతీయ గ్రంథ సంపదను తలచుకొని నాటివారెంతగ కుమిలిపోయిరో! భావించుటకే భయంకరమైన విషయమది. లోక మోహనములై వర్ధిల్లుచు వారువీరను తారతమ్యములేక యెవ్వరికేని నయనానందమును సంఘటింపజాలిన సజీవశిల్పసంపదమీద నైతము వారు తమ కర్కశత్వమును ప్రయోగించుట కడుంగడు విచార కరము.

మహమ్మదీయుల స్వైరవిహారమునకు-సర్వనాశనమైపోయిన, శిల్ప సంపద-వారివిలయ తాండవ ప్రళయస్వరూపమును ప్రత్యక్షీకరించు చుండును. నాడు వారివలన హైందవధర్మ మిట్టుగట్టి దెబ్బలకు దట్టు కొని నిలువ వలసివచ్చినది. తుగ్లక్, ఘోరి, గజనీ, ఔరంగజేబ్

మొదలైనవారి దుష్టపరిపాలనమున మన సంస్కృతికి జరిగిన మహోప చారము మాటలతో చెప్ప సాధ్యముగానిది. మాటలతో చెప్పరగ నిది. నాడు మనధర్మదీక్ష కేర్పడిన యాఘూతము ప్రళయంకరమై నట్టిది. ఆ యుపద్రవ సమయమునందేర్పడిన ప్రమాదములనుండి జాతి నిలువ ద్రొక్కుకొనుటకు శతాబ్దముల కాలపరిమితిలో బ్రహ్మాండమైన కృషి జరుపుకొనవలసివచ్చెను.

మహారాష్ట్ర జాతికిజెందిన మహిళారత్నమగు జిజియాబాయికి బిడ్డగానుదయించిన శివాజీ తిరిగి యీ దేశ గౌరవాభ్యుదయమున కాశాజ్యోతిగ గన్పించినాడు. తల్లికిగల దేశభక్తియు, దైవభక్తియు సంస్తవనీయములైనట్టివి. ఆమె తనకుమారునికి దేశభక్తి నుగ్గు బాలతో కలిపిపెట్టి సర్వవిధముల తనయూహాల కనుగుణముగ తీర్చి దిద్దుకొనగల్గుటొక యదృష్ట విశేషము. జిజియాబాయిచే సుశిక్షితు డైన శివాజీ ఆత్మగౌరవసంపన్నుడైన మహావీరుడుగ తయారైనాడు. మహమ్మదీయ ప్రభువులను లెక్కసేయక మహాసాహసముతో విక్ర మించి క్రమక్రమముగ వారాక్రమించుకొనిన దుర్గములనన్నింటిని వశపరచుకొన సాగినాడు.

శివాజీయొక్క ముఖ్యానుచరుడు తానాజీ. శివాజీ సల్పిన దండయాత్రలన్నింట ఆయన కొండంత-అండగ నిలిచిపోరిన మహా సేనాని. తానాజీ తల్లియాజ్ఞ నౌదలదాల్చుచు, శివాజీ-మహారాష్ట్ర విస్తృతికొరకు, బ్రహ్మాండమైన కృషిసాగించి విజయమును గడింప గలిగినాడు. 'ఛత్రపతి' యనెడి బిరుద మీ మహావీరునిపట్ల సర్వ విధ ముల సార్థకమై విలసిల్లెననుట తథ్యము. శివాజీ గురుదేవుడు సమర్థ రామదాసస్వామి వారు. ఆ సంయమీంద్రుని సుశిక్షణ శివాజీ జీవిత మున బంగారు పంటలను బండించినది. భారతీయ సంస్కృతిపట్ల-సనా తన ధర్మముపట్ల ఛత్రపతిలో మహత్తరములైన భక్తి శ్రద్ధ లేర్పడు టకు సమర్థరామదాసస్వామివారి దివ్యోపదేశములే ప్రబల కారణము

లని భావింపవలయును. శివాజీ భవానీ పూజాపరతంత్రుడు. కావుననే మరల నీ మహారాష్ట్రప్రభువు కాలమున వేదభక్తి, సనాతన ధర్మాను రక్తి; భగవచ్చింతనాసక్తి - ప్రజలలో పెంపొందసాగినవి. ఈయన భారత దేశ స్వాతంత్ర్యమును సుప్రతిష్ఠిత మొనర్చెను. దేశ గౌరవమును సంరక్షించెను.

సనాతన ధర్మదీప్తులను పునః ప్రజ్వలితముల గావింప - కంకణము గట్టుకొనినవారిలో - ఏకశిలానగరమును రాజధానిగ నొనర్చుకొని కాకతీయ సామ్రాజ్యమును పరిపాలించిన గణపతిదేవ చక్రవర్తి ప్రముఖుడు. ప్రజానురంజకమైన పరిపాలన కొనసాగించిన యీ మహనీయుడు సనాతన ధర్మసంరక్షణకొరకొనర్చిన కృషియు గణనీయమైనట్టిదే. శిల్పకళ కాకతీయులకాలమున ప్రత్యేకస్థాయినందుట మన మీ సందర్భమున విస్మరింపదగదు. దేవాలయముల నెన్నింటినో నిర్మించుటకు కాకతీయ ప్రభువులు, భక్తిభావనతో ప్రబలమైన దోహద మొనర్చియున్నారు. గణపతిదేవుని యనన్తరము అఖండ సాహసోపేతమైన దీక్షతో రాజ్యపాలన సాగించిన రాణిరుద్రమదేవి ఆయన కుమార్తెయే. తండ్రికడ సకలరాజకీయ వ్యవహార రహస్యములను. యుద్ధతంత్రములను గుర్తించి - శత్రుజన భయంకరముగ - ఈమె సాగించిన పరిపాలన చరిత్రయందే ప్రత్యేకస్థానమును గడించినది.

యుద్ధసమయములలో పురుషవేషధారిణియై రణరంగమున వీరవిహార మొనర్చుచుండెడి యీమె ధాటికి తట్టుకొనలేక - శత్రువులు చెల్లాచెదరయ్యెడివారట - ధర్మదీక్షవహించి - దేశమున శాంతిని నెలకొల్పు నిమిత్తము - రుద్రమదేవి - ఆదర్శవంతమైన పరిపాలన కొనసాగించుచున్నప్పటికిని కొందరు నీచులు - స్త్రీ పెత్తనముక్రింద జీవితము సాగించుట సహింపలేనివారై యెన్నెన్నియో కుట్రలను పన్నియేదేదియో యొనర్ప బూనుకొనిరి కాని! రుద్రమదేవి దైవబల సంపన్నురాలు. దుష్టభావనల యెత్తులన్నియు నామెముందు వ్యర్థము

లై పోయినవి. రుద్రమదేవికిగల కళాత్మక దృష్టియు ప్రశంసాపాత్ర మైనట్టిది. పాలంపేటలో శిల్పకళా శోభలను వెలయించెడి దివ్యప్రభా వంతమైన దేవాలయము నామె నిర్మింప జేసినది. ఈ నిర్మాణమునం దుపయోగింపబడిన యిటుకరాళ్ళు నీళ్ళపై తేలునట.

ఈ దేవాలయము ప్రక్కన నిర్మింపబడిన పెద్ద తటాకమునందలి నీరు నేటికిని వేలాది యెకరముల భూమిని సస్యశ్యామల మొనర్చు చున్నది. యుగంధరమంత్రి ప్రజ్ఞాప్రాభవములతో దేశ గౌరవాభ్యు దయములను పెంపొందించిన ప్రభువు ప్రతాపరుద్రుడు. ఆయన దృఢ దీక్ష వహించి ధర్మసంరక్షణ కెంతగనో తోడ్పడి యున్నాడు. ప్రతాప రుద్ర ప్రభువు విద్యాభిమాని; విద్యాపోషకుడు, పండిత పక్షపాతియు నగుట మన సంస్కృతియొక్క మహాదృష్టము.

విద్యానాథుడు ప్రతాపరుద్రుని యాస్థాన పండితుడు, ప్రతాప రుద్రీయమనెడి ప్రసిద్ధలక్షణ గ్రంథము నాయన రచించెను కాకతీయ ప్రభువుల పరిపాలన మొత్తముమీద అణగారిపోవుచున్న వైదిక సంస్కృతిమీద చైతన్యామృతము ను జిలికించినది. సనాతన ధర్మము నకు విశేషాదరమును ప్రజలలో సంఘటించినది. సముచిత గౌరవ ప్రతిపత్తులను జాతికి సంపాదించి పెట్టినది

తరువాత కాలమున వచ్చిన యెందరో భారతీయప్రభువుల విశాలదృష్టివలన మరల సంస్కృతికి ధర్మమునకు తగినంత పుష్టియు, తుష్టియు లోకమునం దేర్పడినవి.

పరిస్థితుల ప్రభావమువలన మధ్యమధ్య విధిలేక నలిగిపోవు చున్నను సనాతన ధర్మసంస్కృతులు మరల నచిరకాలముననే పూర్వ వైభవము నార్జించుకొనుచు వెలుగగ గలెననుట కెట్టి సందియమునులేదు.

చరిత్రలో ధర్మమునకు, సంస్కృతికి నిరుపమాన సేవలొనర్చుచు ఖ్యాతిగాంచిన భారతదేశ ప్రభువరేణ్యులలో నెన్నదగినవారు హరి హరరాయ బుక్కరాయ, సోదరులు. వారి యభిమతములను ఫలింప

జేయ పెన్నిధివలె సహాకరించిన మహర్షి చంద్రుడు విద్యారణ్యస్వామి వారు. హంపీ విరూపాక్షస్వామివారి దేవాలయమునకు ధర్మకర్త. హిందూ ధర్మ సముద్ధరణము, సంస్కృతి సంరక్షణము అనెడి మాటలు వినుటతోడనే విద్యారణ్యులవారి మేను పులకరించెను. హరిహర బుక్కరాయ సోదరులను దిలకించుటతోడనే వారిరువురును సర్వ సమర్థులనియు తన హృదయమునగల దివ్యాదర్శములను వారు ఫల వంతము లొనర్పగలరనియు విద్యారణ్యస్వామివారు విశ్వసించిరి. వెంటనే కావలసిన కనకము విరూపాక్షస్వామివారి కోశాగారము నుండి గ్రహించుట కనుమతించిరి. ఆ సోదరులు ధనము సమకూరు టతో నూతనోత్సాహమున సైనికుల సేకరించి తుంగభద్రానదీ పరిసర ముల మంచిశిక్షణ యొసగి మహోజ్జ్వల ప్రయత్నముతో యుద్ధమునకు సన్నద్ధులైరి. దైవానుగ్రహము పరిపూర్ణముగ నుండుటచే మహా మ్మదీయ మత వాహినీవేగమున కడ్డుకట్టవైచి దక్షిణభారతమున హిందూధర్మ సముద్ధతి కెట్టి లోటును వాటిల్లని తెలుగున విజయ పతాకము నెగురవేయగల్గినారు. విద్యారణ్యమహర్షి దివ్యాశీర్వా దములతో నాడు సకల మానవాళికి నవచైతన్యము సమకూరినది.

మహర్షి సూచనానుసారముగ విద్యానగరమను పేరిట రాజ ధానీ నగరము నిర్మింపబడినది "విరూపాక్ష" యనెడి నామాక్షర ములు గల రాజముద్రిక అధికారము నెఱప నారంభించినది. విరూ పాక్షస్వామి వారి ప్రతినిధులుగానిల్చి హరిహరరాయ సోదరులు రాజ్య సంరక్షణభార నిర్వహణ మొనర్చిరి.

ఆ వరుసలో నెందరో ప్రభువులు విద్యానగరరాజ పీఠము నధిష్ఠించినారు. విద్యారణ్యుల వారి యాన నౌదలదాల్చి యేలినారు. వారిలో శ్రీకృష్ణదేవరాయలవారి కాలము సనాతన ధర్మసంస్కృతు లకు, సాహిత్య సంగీతశిల్పచిత్ర కళలకు స్వర్ణయుగమని వన్నెకెక్కి నది. రాయలు బాల్యమునుండి తిమ్మరుసు మహామంత్రిచే సుశిక్షితు

డైన వ్యక్తి ఆ యమాత్యవరేణ్యుని కలలు పండింపజాలిన సాహసి. ఆయనకు సర్వవిధముల నచ్చిన ప్రభువు. మూడు తరముల వారికి మంత్రిత్వము నెఱపి పరిపూర్ణానుభవము గడించుకొనిన ధీశాలియగు తిమ్మరుసుమంత్రి - రాయల నాదర్శ ప్రభువుగ తీర్చిదిద్దినాడు.

రాయల కేర్పడిన కళాభక్తి; తిమ్మరుసు శిక్షణఫలమే. దైవ భక్తి పరిపూర్ణముగ గల మహనీయుడు రాయలు. మంచిపండితుడు కవియునగు రాజు దేశము నేలిన బంగారుకాలమది. భువనవిజయసభ రాయల సాహిత్యభక్తికి తార్కాణము. మహోద్దండ పండితులైన అష్ట దిగ్గజ కవులు రాయలవారి భాషాపోషణకు సాక్షీభూతులు: రాయలవారు రచించిన ఆముక్తమాల్యదా మహాప్రబంధము రాయల భక్తిని, పాండిత్యశక్తిని, కవితాసక్తిని వెల్లడించుచుండును.

రాయల యాస్థానమున ప్రముఖకవిగ పేరెన్నికగన్న అల్లసాని పెద్దన సనాతన ధర్మవిజయమును సూచించెడి దివ్యకథా గర్భితమైన మనుచరిత్ర ప్రబంధమును రచించి రాయలవారి కంకిత మొనర్చినాడు. తదితర కవిశేఖరులు నాడు బహుముఖరచనా వ్యాపార దక్షతను ప్రదర్శించుచు పలు ప్రబంధముల రచించిరి. మన సంస్కృతికి వెలలేని వెలుగును ఘటించిరి. సాహిత్యమునకేకాక సంగీతమునకు, శిల్పము నకు గూడ రాయలు నిరుపమానమైన సేవయొనర్చినాడు. పరాక్రమో పేతుడై విజయలక్ష్మిని వరించి సకలాంధ్ర సామ్రాజ్య సార్వభౌము డైనట్లుగనే శ్రీకృష్ణదేవరాయలవారు - మహోద్భుత సారస్వత పోషణ బాధ్యతనువహించి - సాహితీసమరాంగణ సార్వభౌముడని యు ఘన కీర్తిని వహించినాడు. తాను విష్ణుభక్తుడయ్యును మత వైషమ్య ముల బాటింపక శైవవైష్ణవ కవుల సమదృష్టితో సత్కరించిన సార్వ భౌముడీయన. వసుచరిత్ర-పారిజాతాపహరణము - శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము మొదలయిన ప్రసిద్ధ ప్రబంధము లీ మహనీయుని కాలముననే వెలసినవి. రాయల యుగము కవితా సరస్వతికి చలువ

పందిరులు వేయించిన పుణ్యకాలము. సనాతన ధర్మసంస్కృతుల సముద్ధరణకు సర్వతోముఖ కృషిసాగించిన పవిత్రసమయము. ఛత్రపతి శివాజీ మహారాజును వైదికధర్మతత్పరునిగ, దైవభక్తునిగ సమర్థరామదాసస్వామివారు తీర్చిదిద్దిన పగిది రాయలవారిని తిమ్మరుసు మంత్రి సర్వశుభలక్షణ సంపన్నునిగ తీర్చిదిద్దెనని గుర్తించియున్నాము.

కావున రాయలయుగమున ఋషివలె సనాతన ధర్మసంరక్షణకు తిమ్మరుసుమంత్రి తోడ్పడెననుటలో నెట్టి సందియమునులేదు.

తరువాత ఇట్టి దివ్యకృషి యొనర్చినవారు నాయకరాజులు. మధుర తంజావూరులను పరిపాలనా రంగస్థానములుగ నిడుకొని దక్షిణాంధ్రమును వీరుపాలించిరి. వీరికాలమున భోగలాలసత పెరిగిన మాట వాస్తవమే. కాని! దైవభక్తియు, ధర్మానురక్తియు సారస్వత కళాసక్తియు పుష్కలముగనే యున్నవి. రాజగోపాలస్వామి నాయకరాజుల యిష్టదైవము. ప్రభువులంద రాదేవదేవుని కింకరులమనియే భావించుచుందురు.

విజయనగర ప్రభువుల యనంతరము - కవిపండితపోషణ మీ రాజ్యమున గనులార తిలకింపగలము. రాయలవారి కవిపండిత భక్తికిని నాయకరాజుల కవిపండితభక్తికిని, కించిన్మాత్రపు తారతమ్యము గలదు. మధురను పరిపాలించిన తిరుమల నాయకుడనురాజు ప్రజాపరిపాలనా తత్పరుడు, కళాపిపాసి, భగవచ్చింతనపట్ల శ్రద్ధగల చక్రవర్తి. నిత్యము శ్రీవిల్లిపుత్తూరునకేగి, ఆండాళు దేవాలయమున పూజలొనర్చి మరలివచ్చి మధురలో భుజించెడివాడట. ఈయనవాస్తుశాస్త్ర సమ్మతముగ నెన్నియో దేవాలయముల నిర్మింపజేసినాడు. రామేశ్వరమున, శుచీంద్రమున నీ ప్రభువు నిర్మించిన దేవాలయములు తులలేని శిల్పకళాశోభకు నిలయములు. అనంతపద్మనాభస్వామి దేవాలయమును తిరువనంతపురమున మనోజ్ఞ శిల్పశోభ వెల్లివిరియునట్లు నిర్మింపజేసినాడు. తంజావూరును పాలించిన అచ్యుతరాయలుగాని, ఆయన

కుమారుడైన రఘునాథరాయలుగాని యెట్టి పౌరుష సంపన్నులో-అట్టి కళాభిమానులని చెప్పవచ్చును. పరదేశీయుల యుద్ధతి నొకవంక తట్టుకొనుచు, మరియొకవంక రాష్ట్రమును సుభిక్ష మొనర్చుకొనుచు, వేరొకవంక స్వధర్మ సంస్కృతులపట్ల శ్రద్ధవహించిన రఘునాథరాయలకు కృష్ణదేవరాయలతో పోలికలెన్నియో యున్నవి. ఈయన తనకుగల సంగీతాభిమానమునకు చిహ్నముగ "రఘునాథమేళ" మనెడి వినూతన సంగీత ప్రక్రియనే యొకదానిని సృష్టింపగలిగినాడు. కళలపోషణకు రఘునాథుడు చూపిన శ్రద్ధ యసాధారణమైనట్టిది.

వైదికధర్మ తత్పరతను ప్రజలలో పెంపొందించుటకు గొప్ప కృషి కావించినను రఘునాథుని పరిపాలనా కాలమున శృంగార రస సంభరితమైన భక్తితత్త్వమునకే-సాహిత్యసృష్టికే-అధిక ప్రాధాన్యమీయబడినట్లు వ్యక్తమగుచున్నది. సనాతన ధర్మముపట్ల ప్రజలలో భక్తి విశ్వాసములు కలుగుటకొరకై ప్రభువు తగినంత శ్రమయొనర్చినను నాడు బయలుదేరిన సారస్వతము ప్రజల కాయవకాశము నంతగా కల్పించలేదు.

సరస్వతీమహాలునందు రఘునాథుడు రాజదర్బారును జరుపుచుండెడివాడు. ఆ మహాలులో పండితులు, కవులు గాయకులు శిల్పులు రఘునాథునిచే బహువిధముల సత్కరింపబడుచుండెడివారు. రఘునాథుడు ప్రతిభావంతులకు ఘనమైన సన్మానముల గావించి కళాలక్ష్మికి ఘనశోభను ఘటించుచుండెడివాడు. సరస్వతీమహాలనెడి పేరుతో నా కాలమున సుప్రసిద్ధమైన గ్రంథాలయముకూడ సమకూర్పబడినది. ప్రాచీన గ్రంథసంభరితమైన-ఈ గ్రంథాలయము తంజావూరు రాజుల భాషాప్రియత్వమునకు చెరగనిచిహ్నము. ఈ రూపమున సారస్వతసేవయు సంస్కృతిపూజయు నాయక రాజులకాలమున చక్కగనే జరిగెనని యంగీకరింప వలయును.

విశేషించి యీ సమయమున స్త్రీలు కావ్యరచనాధురంధరలై విరాజిల్లిరి. రంగాజమ్మ, రామభద్రాంబ, వీరకంపవిజయమును రచించిన వీరకంపరాయని భార్య గంగాదేవి, మధురవాణి, ముద్దుపళని- ఈ సమయమున కవయిత్రీ శిరోమణులుగ ఖ్యాతిగన్నవారు. రంగాజమ్మ సంగీతనృత్య విద్యలయందును సమగ్రపాండిత్యముగల విదుషీ రత్నము. యక్షగానము లీ యుగమున బయలుదేరి మంచిసంస్కృతిని లోకమున వెలయించినవి. విజయవిలాస కర్తయైన చేమకూర వేంకట కవి, చతురకవితా సామ్రాజ్యశాసకుడని వన్నెగన్న చెంగల్వకాళకవి మున్నగు వారీసమయమున ఆంధ్ర సరస్వతికి తారహారముల నేర్చి కూర్చిరి.

గోవింద దీక్షితులనెడి ప్రజ్ఞానిధియైన అమాత్యశేఖరుని పర్యవేక్షణ క్రింద తంజావూరు రాజ్యములో నీ కార్యక్రమమంతయు నిర్వహింప బడినది. ప్రభువులు వైష్ణవమతాభిమానులు. భగవద్భక్తి సారస్వతభక్తి కలిసిమెలిసి యీ కాలమున నిట్లభివృద్ధి జెందినవి.

# భక్తిభావ జలధి

* * *

"కులం పవిత్రం జననీ కృతార్థా
వసుంధరా పుణ్యవతీచ తేన.."

"ఎవరు పరమభక్తులై సర్వేశ్వరానుగ్రహమునకు పాత్రులగుదురో! వారికులము పవిత్రము. వారినిగన్నతల్లి కృతార్థురాలు. వారి జన్మవలననే దేశమునకు పుణ్యవతి యనెడి సార్థకనామ మేర్పడును." భక్తుల విశిష్టతను విశదీకరించుచున్న శ్లోకభావమిది.

హిందువులనుష్ఠానమునందిడి యానందించెడి నోములు, వ్రతములు, ఉపవాసములు మొదలయినవి సర్వేశ్వరోపాసనకు సంబంధించిన ముఖ్యభాగములే. భక్తి, ఉపాసనాత్మకము. సేవాభావనకు ప్రతిబింబము. 'భజసేవాయాం' అనెడి ధాతువునుండి వచ్చిన పదమే భక్తి. ప్రార్థనారూపకమైన జిజ్ఞాస భగవదారాధన విషయమున ప్రథమతః పరిగణనీయమైయున్నది. భక్తులు దేవదేవుని పలుతెఱగుల ప్రార్థించి ఆత్మీయునకు కష్టసుఖముల జెప్పుకొనినరీతి తమయంతర్వేదనను నుతులలో, నతులలో దైవమునకు నివేదించుకొనుట పరిపాటిగనే మనము చూచుచున్నాము.

ప్రార్థన నిశ్చలబుద్ధిని మనకు ప్రసాదించును. మానవుల యంతరంగములు విశుద్ధములై దైవానుగ్రహపాత్రము లగుటకు ప్రార్థన ముఖ్యకారణము. ప్రార్థనవలన మనలో నేకాగ్రతకుదురుకొనును. చిత్తశాంతికి ప్రార్థన చక్కనిసాధన

"ప్రార్థన మనకు సుఖనిద్రనొసగును. మనస్సునకు శాంతినిచ్చును. నరములకు స్థాయిని ప్రసాదించును. జీవితమునకు హాయినొసంగును."

Dr. Thomas Hyslops.

ప్రార్థన గావించి సర్వేశ్వరుని కృపకుపాత్రులైనవారే మహాభక్తులు. వారు మన సనాతనధర్మమును భక్తితో రక్షించి భగవత్తత్త్వమును పలుతెఱంగుల గొనియాడి ధన్యత గనినారు. సకల భారతమునందిట్టి పరమభక్తులెందరో యుద్భవించి దైవికతత్త్వశోభలను వెలయించినారు.

మహారాష్ట్రమున జన్మించి - అపూర్వమైన దైవోపాసనతో - అఖండశక్తి నార్జించి, ఆధ్యాత్మికదివ్యజ్యోతిగా వెలుగొందిన మహనీయుడు జ్ఞానదేవుడు. హీనకులమునకు జెందినవాడయ్యును, భగవదనుగ్రహబలమున పరిపూర్ణ విజ్ఞానియై దివ్యజ్ఞానదేవుడని ఖ్యాతి నార్జించినాడు.

వేదవేత్తలైన కొందరు బ్రాహ్మణు లీయనను వెలివేసి - తీవ్ర పరాభవమునకు గురిజేసిరి. వారి యజ్ఞానమునకు జ్ఞానదేవుడు వగచినాడు. వారేమి యొనర్చిననేమి? ఏమనిననేమి? ఆ పండితుల కన్నులను దెఱిపించుటకే జ్ఞానదేవుడు నిశ్చయించుకొనినాడు. తన సోదరిని సోదరుని వెంటనిడుకొని గోడపయినెక్కి దానిని నడిపించుకొనుచు వేదవేత్తలున్న చోటున కరిగి వారికి విస్మయమును గలుగజేసినాడు. విప్రులందరు విస్మయము జెందుచు దున్నపోతును జూపించి - నీకు ప్రజ్ఞయే యున్నచో దీనిచే వేదమును పఠింపజేయుమని పలికినారు వారిది వికృత సూచన. కాని, భగవదనుగ్రహ సంపన్నుడైన జ్ఞానదేవుడు వారికోర్కెను నెరవేర్చి, వారికే శృంగభంగమును గలుగజేసి వారి చేతనే పలుతెఱగుల సంస్తుతింపబడినాడు. తరువాత జ్ఞానదేవుని మహిమలను గుర్తించి మహారాష్ట్రమాయనను వేనోళ్ల గొనియాడినది.

దివ్యోపదేశసంభరితముగా జ్ఞానదేవుడు భగవద్గీతకొక విశిష్టమైన వ్యాఖ్యానమును వ్రాసినాడు. నయశీలసంపదలను బెంపొందించెడి దివ్యశక్తులను వెలయించిన జ్ఞానదేవుడు నిక్కముగ ధన్యుడు.

RELIGIOUS ... CENTRAL LIBRARY Acc No. 799

కులమత తారతమ్యపరిగణనను ద్వేషించుచు, విశాలహృదయుడుగ సర్వప్రజల సంస్తుతులనందుచు భక్తిమయభావనలను ప్రకటించిన ధర్మమూర్తియైన ఏకనాథుడుగూడ సర్వేశ్వరచరణ పూజాతత్పరత్వమును జాతీయులలో నెలకొల్పిన మహనీయుడే.

తనమధురాతిమధురములైన అభంగములద్వారా శ్రీకృష్ణ మహిమలను ప్రచారమొనర్చుచు పలు కష్టములకు గురియయ్యును దీక్ష వీడక దైవభక్తిని సముజ్జ్వలస్థాయిలో ప్రబోధించిన మహాత్ముడు తుకారాము. మహారాష్ట్రమున తుకారాము పాటలు ప్రజల జిహ్వాగ్రముల సర్వదా నర్తించుచునేయుండును. ఈ సాధుభావనుని సత్కృషి సకల భక్తలోకమున కాదర్శపాత్రమైనట్టిది. పాండురంగ విఠలుని భక్తుడీయన. మహారాష్ట్రమున భక్తిప్రచారోద్యమ మొనర్చినవారిలో కొందరు స్త్రీలును గలరు. సాధ్వీతిలకముగ వన్నెగన్న సక్కుబాయి సాటిలేని సహనశీలమునకు నామాన్తరమనియే చెప్పవలసియున్నది. శ్రీకృష్ణుని నామమును స్మరించిన మాత్రముననే యామె యొడలు పుల్కరించును. పరమ మూర్ఖురాలైన యత్త, అవివేకమునకు మారురూపముగనున్న మగడు, మాటి మాటికి నినుపముక్కులతో పొడిచి బాధింప సన్నద్ధమైయున్న లోకముమధ్య శ్రీకృష్ణ పదపల్లవమగ్న మానసయైన సక్కుబాయి మహాసాధ్వి యగుటవలననే యన్నికష్టముల ననుభవించియు కృష్ణానుగ్రహమున విముక్తినంది, సర్వమహిళాలోకమునకు సిగపూవుగ రాణించినది.

వంగరాష్ట్రమున దైవవిశ్వాసము అంతరించి వైష్ణవభక్తి సన్నగిల్లిన కాలమున ప్రజల హృదయమున కృష్ణభక్తి పతాకము నెగురవైచిన ఘనుడు చైతన్యుడు. మహమ్మదీయుల దురంతములు కోకొల్లలుగ సాగుచున్న రోజులవి. బాధలు భరింపజాలక వేలసంఖ్యలో హిందువులు మతాంతరులగుటకు గతిలేక తలపడుచున్న తరుణమున చైతన్యుడు తాను సన్యసించి భారతీయ సంస్కృతిని ధర్మమును

నలుమూలల ప్రబోధించుటకు నడుముగట్టిన మహా ప్రవక్త. వంగ ప్రజ లాయనను సాక్షాత్తుగ శ్రీకృష్ణావతారుడేయని విశ్వసించిరి

చైతన్యుని ప్రచారోద్యమమును బలాత్కారముగ, నిరంకుశ ముగని, నణచివేయుటకు మహమ్మదీయులెన్నియో దారుణకృత్యము లను గూడ నిశ్శంకగ గావించినారు. శ్రీకృష్ణాను గ్రహమున చైతన్యుడెన్నెన్నియో దైవికములయిన మహిమలను ప్రదర్శించి, తన శిష్యకోటిని సంరక్షించి దైవికశక్తి దుర్జేయమైనదనియు, సనాతన ధర్మబలము మొక్కబోవనిదనియు నిరూపించినాడు. గోపాలకృష్ణుని మురళీనినాదముల నాలకించి పరవశతనందిన గోపికగణముల పగిది వంగ ప్రజానీకమంతయు చైతన్యుని ప్రబోధములు విని పరవశులై, పవిత్ర మైన ఆర్ష ధర్మమును శిరసావహించి తరించిరి

క్షాత్రమునకు వాసిగాంచిన రాజకుటుంబములో జన్మించి, భగవన్నామసంకీర్తనలో మునిగి తేలుచు, నిత్యానందము నందిన పవిత్ర సాధ్వీమతల్లి మీరాబాయి. రాజమందిర భోగములపై రాగము చూపక కృష్ణ పద చింతనమునందే మనస్సు నిలిపి, మధురగీతముల రచించుచు, గళమెత్తికమ్మగపాడుచు, కాలము గడుపనేర్చిన కాంతా రత్నమామె పలువురు రాజకాంతలామెను గృహమును వదలి బయటి కరుగవలదని, రాజపుత్రస్త్రీల గౌరవమును కాపాడుమని కోరిరి. ఆమె భర్తయు మీరాబాయి స్వేచ్ఛను నిరాకరించినాడు. చివరకు శీలమునే శంకించినాడు. కాని యెవ్వరి నాతల్లి యెట్లు సమాధాన పరచినదో! యేమో! శ్రీకృష్ణ సందర్శన మొనర్చుకొను చునే యున్నది. కృష్ణనామ సంస్మరణము గావించు కొనుచునే యున్నది.

ఒకమారామె రూపగోస్వామి యనెడి మహాభక్తుని దర్శ నార్థమై బృందావనమున కరిగెనట. రూపగోస్వామి స్త్రీలకిట ప్రవే శము లేదని కబురంపుచు మీరాబాయి కనుమతిని ప్రసాదింపలేదట.

వెంటనే మీరాబాయి తనలో తాను నవ్వుకొనుచు "పాపము! మీ స్వామి, సాధనారంగమున తొలిదశయందే యుండినట్లున్నారే. లోకమున కృష్ణుడొక్కడు తప్ప పురుషులెవరున్నారు?" అని సమాధానము పంపినదట. స్వామి యా పలుకులను విని జ్ఞానియై స్వయముగ మీరాబాయికడకువచ్చి యామె దివ్యచరిత్రము నభినందించెనట.

భగవదారాధనమునందామె పలువురివలన పలుచిక్కులకు గురి కావలసివచ్చెను. గరళమిచ్చి యొకమారామెను హత్యచేయుటకే కొందరు యత్నించిరి. కృష్ణపరమాత్ముని కృపవలన విషమామె పాలిటి కమృతముగ మారినది. బాధల మధ్య పుటము పెట్టిన పసునారవన్నె బంగారమువలె, తేజరిల్లుచు, రాజస్థానమున మీరాబాయి సనాతన ధర్మమునకు మంచి యాలంబనముగ నిలిచినది.

వారణాసి ప్రాంతమున భక్తితత్వమునకు మేలి మెరుగులు దిద్దుచు కావ్యరచన సాగించిన ఘనుడు భక్తతులసీదాసు. జన్మించినది పేదకుటుంబమునందైనను, జ్ఞానబలమున గొప్పతనము నార్జించుకొనగలిగిన మహాభక్తుడు. కామవాంఛలు మానవుని యిచ్చవచ్చినపగిది నడిపించెడి నిండువయస్సులో మహాభక్తి ఆయన హృదయమునందుదురు కొనుటొకవిశేషము. తులసీదాసు భార్య సౌందర్యరాశి. ఆమె యందమును తిలకించుచు తులసీదాసు లోకమునే మరచెడివాడు. భార్య పుట్టింటనున్నతరి యామె వియోగమును సహింపజాలక – అర్ధరాత్రివేళ బయలుదేరి కుంభవర్షమును సరకుసేయక – అత్తగారింటికేగి గోడపై వ్రేలాడుచున్న పామునే త్రాడని భ్రమించి, దానియాధారమున లోపలికి దిగి, భార్యను చేరుకొనినాడు. చేతులయందు గల రక్తపుమరకలను చూచి, భార్య ప్రశ్నింపగ తన సాహసమునకు తానే నవ్వుకొనుచు, జరిగినదంతయు వివరముగ భార్యకు చెప్పినాడు. ఆమె నిర్లక్ష్యముగ నవ్వుచు "నాథా! మీరిట్టి భయంకర సమయమున అశాశ్వతమగు నా శరీరసౌందర్యముపై చూపిన– అనురక్తిని – ఏకాగ్ర

తను, శాశ్వతానందమును కలిగించెడి భగవదారాధనపట్ల చూపగలిగి నచో మనమందరము ధన్యులమయ్యెడి వారము కదా!" యని పలికి నది. భార్యపలుకులతో తులసీదాసు తల తిరిగిపోయినది. భ్రాంతి వదలినది. కాముకదృష్టి కరగిపోయినది. రామానామలోలుడు రామనామలోలుడైనాడు. భోగి యోగిగ మారినాడు. పడుచు దనము పరవళ్ళుద్రొక్కుచున్నవేళ భక్తిభావనను పరమేశ్వరార్చన కొరకు మరలింపజాలిన భార్య యెట్టి సుకృతాత్మురాలో! ఆమె యుపదేశ బలముననే తులసీదాసు మహాభక్తుడై; సాధుపుంగవుడై; భక్తితత్త్వ ప్రచారమునకు పూనుకొనగలిగెను. దేవాలయమున జరుగు చున్న పురాణకాలక్షేప సందర్భమున యొకవ్యక్తిని హనుమదంశ సంభూతునిగ నెంచి ఆ మహనీయుని కడకేగి శ్రీరామదేవుని దర్శన భాగ్యమును నాకు కలుగజేయువా? యని దీనాతిదీనముగ తులసీదాసు వేడుకొనెనట. "చిత్రకూటమున నీవు శ్రీరాముని దర్శింపవచ్చు" నని ఆ వ్యక్తి మాటవరుసకు చెప్పిన దానిని నమ్మి తులసీదాసచటికేగి గాఢభక్తితో రాముని సంస్మరించుచు భాగ్యవశమున రఘురాము దర్శనము నందుకొనగలిగినాడు. జీవితముననే యిది యొక మంచి మార్పునకు హేతువైనది. వాణి దయతలచినది. మధురాతి మధుర మైన శైలిలో హిందీ భాషయందు రామచరిత మానసమనెడి పేర రామాయణగాథను సృష్టించి, తులసీదాసు ధన్యుడైనాడు. ఉత్తర భారతమునగల పండిత పామరులెల్లరీ కావ్యమును పరమభక్తితో నిత్యము పఠించుచుందురు. తదనంతర కాలమున పలుభాషలయందా కావ్యమనువాదము చేయబడి తులసీదాసుని నిస్తుల భక్తితత్త్వమునకు నిదర్శనమై నిలిచినది.

ఉత్తరభారతమునగల భక్తకవులలో సూరదాసు గణనీయుడు. కన్నులులేని ఈ కవిచంద్రుడు భగవంతుని యనుగ్రహమున - అంతర్వీ క్షణ శక్తి కలవాడై శ్రీకృష్ణపరములైన పాటలను తానే యల్లుకొని తన్మయతతో పాడుకొనుచు ధన్యుడైనాడు.

ఈ సందర్భముననే యాధ్యాత్మిక, సాంస్కృతిక రంగములలో సమున్నత కృషి సలిపి యజ్ఞములలో జరిగెడి జంతుబలుల కడ్డుతగిలి పరమశివుడే ప్రపంచదైవమని చాటుచు, సర్వమతముల వారిని లింగాయతులను గావించుటకొరకు సమగ్ర కృషి సాగించిన మహనీయుడు బసవేశ్వరుడు. వీరశైవ మహామతమున కితడు స్థాపకుడు. వీరశైవు లందరు బసవేశ్వరుని శివావతారముగనే సంభావించుచుందురు. సకాలములో బసవేశ్వరునివంటి మహాభక్తుడు విశాలదృష్టిగల మత ప్రబోధకుడు జన్మించుట వలననే మహమ్మదీయుల ఘోరకృత్యములకు సనాతనధర్మము బలికాక, నిలవద్రొక్కుకొన వీలుకలిగినది. శివస్తుతి పరములైన బసవేశ్వరుని గీతములు, స్వధర్మవ్యాప్తికిని భక్తిభావ ప్రచారమునకును బాగుగ నుపయోగపడినవి.

ముస్లిముగ జన్మించియు–రామానందుని భక్తిప్రబోధ బలముతో హిందూ మహమ్మదీయ మతముల సమైక్యత కొరకు పాటుపడిన కబీరుమహాశయుని ఈ సందర్భముననే పేర్కొనవలసియున్నది. కబీరు మహమ్మదీయుడైనను హిందూదైవములపట్ల భక్తినే ప్రకటించెడివాడు. మనుష్యులమధ్య ప్రేమల పెంపొందించి యెల్లరు సఖ్యతతో మెలగుటకు దారిచూపిన పుణ్యాత్ముడు. నిరుపేద మహమ్మదీయ కుటుంబమున జన్మించియు కబీరువలెనే హిందూ మహమ్మదీయ సమైక్యతకు పాటుపడిన భగవద్భక్తుడు సాధుమూర్తి గురునానక్. కబీరు, నానకుల పరమాశయము భారతీయ ధర్మసముద్ధరణమే.

మహిళాలోకమున వన్నెగాంచి రామకథను రమణీయముగ – సంక్షిప్తముగ మొల్లరామాయణమను పేర రచించిన 'మొల్ల' కుమ్మరి కులమునకు జెందిన కేసనసెట్టి కుమార్తె. పరమేశ్వరానుగ్రహమున ఈమెకు కవితాశక్తి యబ్బినది. ఆ శక్తితో శ్రీరామునే సేవించి ధన్యతముకాలై జీవితసార్థకతను గడించుకొనిన యుత్తమ మహిళ. ఆమెకు విద్యనేర్పుటకే పలువురు పెద్దలు నాడంగీకరింపలేదు. సాధించిన

విద్యతో, లభించిన దైవానుగ్రహాఫలమగు కవితతో, మొల్ల భక్తి తత్త్వప్రబోధ మొనరించుచుండ పలువురు కుచ్ఛితులామెను విమర్శించిరి. పరిహాసించిరి. వారి అయోగ్యతకే యది పరమోదాహరణమగును. కాని! ఆమెకేమి కొదువ? నాటినుండి నేటివరకే కాక-ఏనాటికైన, మొల్లరామాయణము, భక్తలోకమున కారాధ్యగ్రంథమే.

కడపజిల్లా రాజంపేట తాలూకాకు జెందిన తాళ్ళపాకయనెడి కుగ్రామమున జన్మించి బాల్యమునుండియు భక్తిభావమున వ్యవహరించిన - తాళ్ళపాక అన్నమాచార్యులవారు - శ్రీవేంకటేశ్వరస్వామి వారి వరప్రసాదమున జన్మించిన మహనీయుడు. పదునాఱు సంవత్సరముల వయస్సులో విరక్తి జెందినవాడై తిరుమలకు జేరి శ్రీనివాస సందర్శనభాగ్య బలమున హృదయమున కవితాగంగ పొంగగా, భక్త్యావేశముతో శ్రీనివాసుని సంకీర్తన మొనర్చిన మహాత్ముడు. తొలి తెలుగుకీర్తన తిరుమలలో శ్రీనివాసుని సన్నిధిలో-రచించిన చరిత్రాత్మక గౌరవము తాళ్ళపాక అన్నమయ్యాదే యని విబుధులు వచించుచున్నారు. స్వరసహితమైన - లయసమన్వితమైన తొలితెలుగు పాట-అన్నమయ్యా నోటనే సమాకిష్కృతమైనది.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని గూర్చి మొత్తము 32 వేల పాటలనీ కవీంద్రుడు రచించినాడు. పరమేశ్వరానుగ్రహబలమున్నచో మహత్తరమైన కవిత - సముదయించుట సత్యమని యీ పుణ్యమూర్తి జీవితము ధ్రువీకరించుచున్నది. జోలపాటలు, లాలిపాటలు, మేలుకొలుపు పాటలు - మంగళహారతులు, స్తుతిరూపకములైన పాటలు - అర్చనోపయోగకరములైన పాటలు బహుభంగుల నీ మహనీయుడు రచించినాడు: దైవదత్తమైన కవిత, దైవమునకే సమర్పితము గావలయు ననెడి దివ్యాశయమునకు గట్టుపడినవాడై, యీ మహనీయుడు తన కవితలన్నింటిని శ్రీ వేంకటేశ్వరునకే యంకిత మొనర్చినాడు. నాడు విజయనగరమును పరిపాలించుచున్న ప్రభువు - తనపై కీర్తనలు

వ్రాయుమని కోరగా తీవ్రముగ నిరాకరించి పోతనకవివలె భగవదనుగ్రహమున కీయన పాత్రుడై నాడు. ఈ మహనీయుడొక శతకమును గూడ - అలమేలుమంగాంబపై రచించి సమర్పించుకొనినట్లు తెలియుచున్నది. ఈయన తొలితెలుగు గేయకవిగా పరిగణనకెక్కిన ధన్యజీవి.

కృష్ణాజిల్లా మొవ్వగ్రామమునకు జెందిన వరదయ్యయనువ్యక్తి మొవ్వగోపాలకృష్ణునిపై 11 వేల పదములను వ్రాసి, ధన్యతముడై భక్తలోకమున కాదర్శప్రాయుడై నాడు.

ఈయన గొప్ప విద్యావంతుడు కాకపోయినప్పటికిని గోపాలకృష్ణానుగ్రహమున కవిత్వశక్తిని, జ్ఞానబలమును, గడించినవాడై శ్రీకృష్ణనామమునే సంస్మరించుచు, సకలపుణ్యక్షేత్రములు సంచరించుచు పదములు రచించినాడు. క్షేత్రములు పర్యటించి ధన్యతముడైన వరదయ్య అప్పటినుండి క్షేత్రయ్యగనే పిలువబడుచున్నాడు. క్షేత్రయ్య పదములు భరతనాట్యమున కనుగుణములు. దక్షిణదేశమున నాట్యము నధ్యయన మొనర్చెడి వారెల్లరు క్షేత్రయ్య పదముల నధ్యయన మొనర్చి యభినయము పట్టెడిశక్తి సమకూర్చుకొనవలసినదే. అట్టి మహాభక్తుడు; సంయమి; క్షేత్రయ్య. నారదమహర్షి యనుగ్రహబలమున సంగీతవిద్యలో ప్రావీణ్యమును గడించి, జగత్ప్రసిద్ధినందిన వేలాది కృతులను రచించి శ్రీరామున కంకితమిచ్చి, చరితార్థుడైన వాగ్గేయకారుడు త్యాగరాజు ధనాశాపరుడైన అన్న భావములను మన్నింపక రాజాస్థాన మర్యాదలుకోరక దాశరథిని నమ్మి జీవయాత్రను, ఉంఛవృత్తితో కొనసాగింపబూనిన పరమ భక్తుడీయన ఆంధ్రభాష సంగీతమునకు దివ్యవేదాంత భావ ప్రకటనకు ఏ విధముగ తగియుండునో! తన కృతుల వలన త్యాగరాజు నిరూపించినాడు. భాష తెలియని వారైనను కర్ణాటక సంగీతప్రియులైన వారెల్లరు త్యాగరాజు కృతులను భక్తిశ్రద్ధలతో నాలాపించుచున్నారు. త్యాగరాజు పావనమైన సనాతన భక్తి భావమునకు, యోగ సాధనకు

మంచి వన్నెలు పెట్టి ప్రచారరంగమునందుంచి, సామాజికులలో ఆధ్యాత్మికదృష్టి వెల్లివిరియుటకు సాయపడినాడు. వీరేకాక వేరైనను పలువురు మహనీయులీ విధముగ భక్తితత్త్వమును నలుమూలల వ్యాప్తి గావింప నిరంతరకృషి యొనర్చిరి. ఈ విధముగ సాధనా మార్గములతో వారు తరించి అనుయాయులందరు తరించుటకు సహకరించిరి.

మతవైషమ్యములకు దూరముగ నిలిచి, మహాంధ్రమున రామభక్తి నిత్యప్రవర్ధమానమగుట కొరకై దాశరథీ శతకమును రచించిన మహాభక్తకవి కంచర్ల గోపరాజు. ప్రభుత్వోద్యోగ మొనర్చుచు భద్రాద్రి రామునకు దేవాలయమును నిర్మించు నిమిత్తము ప్రభుత్వ ద్రవ్యమును వెచ్చింప వెనుకాడని మహాసాహసి యీయన. రాజద్రవ్యమును ప్రభువులయనుమతి లేకయే వ్యయపరచినందులకై గోపరాజు కారాగారమున కఠిన శిక్షల ననుభవింపవలసి వచ్చినది. శ్రీరామచంద్రుడే స్వయముగవచ్చి ఈ భక్తుని రక్షించుకొనుట కొనర్చిన ప్రయత్నము తెలుగుగడ్డ చరిత్రలో నూతనాధ్యాయము. భక్తిభావనకొక మహావిజయము.

ఇంతలో దేశమున గొప్పమార్పులు వచ్చినవి. ఈస్టిండియా కంపెనీ యనుపేర ఇంగ్లాండులో వ్యాపారనిమిత్తమై రిజిష్టరు చేయబడిన యొక సంస్థ పక్షమున మనదేశమునకు వచ్చిన యాంగ్లేయులు వర్తక వ్యవహారములలో బాగుగ బలపడిరి. ఎగుమతి, దిగుమతిచేయవలసిన సరుకులను నిలువయుంచుటకై సొంతగిడ్డంగుల నేర్పరచుకొనసాగిరి. వానిసంఖ్యబాగుగ పెరిగినది. గిడ్డంగుల రక్షణకొరకై బ్రిటీషు సైన్యము రప్పింపబడుటతో మనదేశమున వారియునికికి స్థిరత్వ మేర్పడినది. పోర్చుగీస్, డచ్, ఫ్రెంచి దేశీయులకన్న ఆంగ్లేయులు మేధావులగుటచే వారియత్నము లన్నియు త్వరితగతిని ఫలప్రదములగుచు వచ్చినవి. వారి గిడ్డంగుల సంఖ్యయు సైనిక సంఖ్యయు బాగుగ పెరిగినది. తదనుగుణముగ వారియార్జన పెరిగినది.

9

వారి గుండెబలము పెరిగినది. వారి యాటలను కట్టించెడి శక్తి నాటి స్వదేశ రాజులలో లేకుండుటచే యాంగ్లేయుల పెత్తనము క్రమక్రమముగా బలపడసాగినది. కనుమూసి తెరచునంతలో వారిగడ్డపై క్రైస్తవ మతప్రచారమునకు గూడ గట్టిపునాదులు వేయగల్గినారు. దురదృష్టమేమో! స్వదేశ రాజులలో గుప్తముగనున్న పరస్పర ద్వేష భావములు భగ్గున రాజి బయటపడినవి.

ఆంగ్లేయులు ధీశక్తితో పరిస్థితులను అనుకూలపరచుకొనసాగిరి. దొంగలై దోచుకొనవచ్చిన విదేశీయులు వారి వారి యధికారములనే భారతదేశమున నెలకొల్పుటకు యత్నములు సాగించినను పై చేయి ఆంగ్లేయులదే యైనది. వారు కలుపవలసిన వారితో చేతులు కలిపిరి. వ్యతిరేకించవలసిన వారిని వ్యతిరేకించిరి. తమ దక్షతను ప్రకటించుకొనిరి. నానాఫడ్నవీస్ వంటి మేధావి, వీరుడుగూడ వారు వేసిన పీటముడులను విడదీయుట కశక్తుడై యాత్మగౌరవముతో పోరి, విజితుడైనాడు. ఆంగ్లపాలనకు గట్టి పునాది యేర్పడినది. చేతులు కాలిన పిమ్మట ఆకులు పట్టుకొనిన చందమున అధికారముల నాక్రమించుకొనిన తదుపరి ఆంగ్లేయులను పారద్రోలుటకు సాగిన ప్రయత్నములన్నియు నిరుపయోగకరములే యైనవి.

1857 వ సంవత్సరమున స్వాతంత్ర్యేచ్ఛ ముమ్మరముగ గల కొందరు భారతవీరులు ఆంగ్లేయులపై తిరుగుబాటు కావించినారు. తాంతియాతోపే మొదలైన వారి సాహసాత్మక ప్రయత్నములన్నియు నిష్ఫలములైనవి. రణచండికవలె 'నా గొంతులో ప్రాణముండగా ఝాన్సీకోటపై శత్రువడుగు పెట్టజాలడని' గర్జించిన ఝాన్సీలక్ష్మి పిరికి కండలేని వీరనారియయ్యు పరిస్థితుల ప్రభావమువలన వీరస్వర్గము నలంకరించినది. కనులు తెరచిన భారతీయులు పాశ్చాత్యుల దుష్ప్రవృత్తిని గుర్తించినారు. వారి దురహంకృతిపట్ల కుట్రలపట్ల ఏవ్యభావము పెరిగిపోయినది. దాస్యమున మునిగియున్న జాతి బానిస

తనమును నిర్మూలించుకొనుట కొరకై యుద్వేత్తుగలేచి విజాతీయుల పెత్తనమును నిర్మూలింప వలయుననెడి నిర్ణయమునకు వచ్చినది.

కాని నాడాంగ్ల దేశమును పాలించుచున్న విక్టోరియారాణి చతురతతో పరిస్థితులను చక్కదిద్ది ఈస్టిండియా కంపెనీవారి నుండి అధికారమును తాను కైవస మొనర్చుకొని, యుక్తిచాతుర్యములతో తనయధికారమును నిల్పుకొని సఫలీకృతురాలైనది. విద్యారంగమున మార్పులు వచ్చినగాని జ్ఞానశక్తి తగ్గిపోయి భారతీయులు మందులై పడియుండరని ఆంగ్లప్రభుత్వము భావించి ఆంగ్లవిద్యను మనదేశమున ప్రవేశపెట్టినది.

ఆంగ్లవిద్య పొగవలె దేశమునందంతట వ్యాపించి భారతీయుల నుక్కిరిబిక్కిరిజేసి వైచెను. దురదృష్టమేమన! మన మావిద్య నేర్చియు గుమాస్తాలుగనే జీవితములు గడపవలసిన వారైతిమి. ప్రధానాధికార పదవులందన్నింట నాంగ్లేయులే యుండి, వారి కొరడాను నిర్దాక్షిణ్యముగ మనపై నాడింపసాగినారు. ఆంగ్లవిద్యవలన మనకు ప్రత్యేక గౌరవములెవ్వియును లభ్యపడలేదు. కాని! అనుకరణవ్యాధి భారతీయులలో బాగుగ పెరిగినది. కట్టులో జుట్టులో వారి ననుసరింపగల్గినాము. దైవచింతనకు స్వస్తిచెప్పుకొనినాము. సనాతనధర్మమును విస్మరించినాము. స్వసంస్కృతిని నిర్లక్ష్యమొనర్చినాము. స్వజాతికి తలవంపుల దెచ్చినాము. సత్యమును గుర్తింపలేక పోయినాము. వారి నుండి యెన్నియో దుర్గుణముల నలవరచుకొనినాము. ఆంగ్లపాలనా రథము జోరుగ ముందునకుదూసుకొని పోవసాగినది. ఈదుస్థితికి వగచుట కన్న గత్యంతరమేమియునులేకపోయెను. కాని! అంధకారమెల్లపుడట్లే యుండునా! పూర్ణిమ తప్పక రాగలదు. వచ్చుటయే సహజము. రాక పోవుటేయసహజము. దేశమున ధార్మికరంగమున, సాంస్కృతికరంగమున నిట్టియస్తవ్యస్తస్థితు లేర్పడినప్పుడు మహనీయులు కొందరుద్భవించి పరిస్థితులను చక్కదిద్దుదురు. మనదేశమునగూడ నట్లే జరిగినది.

హారి మేధాబలముననే తిరిగి స్వదేశ సంస్కృతులపట్ల స్వధర్మవైభవము పట్ల మరల జాతిలో నత్యుత్కటమైన ప్రీతి ఏర్పడ నారంభించినది.

వారి సముజ్జ్వలకృషివలననే భారతీయుల మనస్సులలో పేరుకొనియున్న కాలుష్యము కరగింపబడినది. వారే సనాతనమైన మన వేద సంస్కృతి ప్రశస్తిని బాగుగ గుర్తించి, మనకు బోధించి, మనల నెల్లర నావంకకు నడిపించుటకు సాహసాత్మక ప్రయత్నముల నాచరించినారు. మనలో పెల్లుబుకుచున్న స్వాతంత్ర్య పిపాసను దీర్పగల మార్గములను జూపింపజాలినారు.

దురదృష్టమువలన భారతదేశ మొక ఘోరవిపత్తున బడిపోయినది. ఆంగ్లపాలన సమాజమున చిత్రవిచిత్ర పరిణామములనుదయింప జేసినది. సాంఘిక మర్యాదలలో గూడ నొకవిధమైన కట్టుబాటులేని తనమే తలయెత్తినది. యోగ్యతలను గౌరవించెడి మంచి మనస్సు కొఱత బడినది. దాస్యప్రభావము జీవితమునందనేక వికృతపరిస్థితులకు దారి దీసినది.

అట్టిపరిస్థితులలో రాజారామమోహన రాయలు మనదేశమున వెలిగించిన చైతన్యజ్యోతి మహిమ యిట్టిదని చెప్పసాధ్యముగాదు. రామమోహనుడు గొప్పవిద్యావంతుడు కాని! సంస్కృతిని విస్మరింపని ధీశాలి. సనాతన సంస్కృతిని సమకాలీన పరిస్థితుల కనుగుణముగ సమన్వయించి దాస్యమున మునిగియున్న స్వదేశీయుల కఖండ సేవ సల్పుటకై దలపెట్టినాడీ మహనీయుడు. పూర్వకాలమునుండి మన దేశమున పాదుకొనియున్న కొన్ని మూఢాచారములను నిర్మూలించుటకై బ్రిటీషు పార్లమెంటునకు గూడా వెళ్ళి సముచిత సంస్కారాత్మకమైన చట్టమును తయారుజేయించి సతీసహగమన దురాచారమును రద్దుజేయించిన మహాసంస్కర్త. మన యుపనిషత్తులలో గల మహత్తరాంశముల నన్నింటిని భారతీయుల దృష్టికి గొనితెచ్చి, విశ్వమే మెచ్చి యనుసరించెడి యీ యుత్తమ పథమును మనమెల్లర మనుస

రింతమని యుద్ఘోషించిన విజ్ఞాని. బ్రహ్మ సమాజ మతస్థాపకుడు, విశ్వ ప్రేమికుడు మహోపన్యాస శక్తిగల పండితుడు, తన మనోబలమున - దాస్యమగ్నులైన భారతీయుల నుద్ధరింప దీక్షవహించిన తాత్త్వికుడు. నాడెల్ల రాయనను మహర్షిగనే యెంచి గౌరవించినారు. పాశ్చాత్యులు గూడ నీమహనీయుని మేధాశక్తి కంజలిబట్టిరి. ఆయన పేరుతో మనదేశ మునగల వివిధవిద్యాలయములు, వైద్యాలయములు, సేవాసంస్థలు, రామమోహనునిమహోదాత్త కృషిపట్ల ప్రజలలోగల భక్తికి చిహ్నములు. అయ్యును ఆంగ్లభాషయందే విద్యావిధానమును కొనసాగింప వలెనవిన నిర్ణయమును ఈయన బలపరుచుట మన దురదృష్టము. ఈ విశాల భావసంపన్నుని కాలముననే హిందూసంఘమునగల భయంకర దురాచారములపై దండయాత్ర ప్రారంభమైనది. ముందడుగువైచి యీ కార్యక్రమమునకు ప్రారంభోత్సవము గావించిన యా మహర్షికి దేశమెంతయో ఋణపడియున్నదన్న మాట వాస్తవము.

భారతీయులలో మాటుమణగియున్న చైతన్యశక్తి - విదుర మేల్కొని కార్యరంగమున నిల్చినది. ఈ యుద్ధతితో చిరకాలదాస్య విచ్ఛిత్తికిగూడ జాతీయులు పూనవలయునని పలుతెఱగుల నాశించిరి. అట్లాశించిన వారికలలను ఫలింపజేయుటకే పలువురు యత్నములు సాగించిరి. విరజానందస్వాములవారి శిష్యకోటి యందగ్రగణ్యుడై - సర్వవిషయములలో గురువునకు దగిన శిష్యుడుగ పేరెన్నికగన్న మహర్షిచంద్రుడు దయానందసరస్వతి. బాల్యము నుండియు నిస్తుల బ్రహ్మచర్య వ్రతావలంబియై భారతీయ ధర్మశాస్త్రములయందు నిర్దుష్టమగు ప్రతిభ నీ మహనీయుడు సంపాదించినాడు. వేదవిజ్ఞానము నందియనకుగల ప్రజ్ఞ యసాధారణమైనట్టిది. నిశితపరిశీలనాదృష్టితో గురుదేవుల చరణ సన్నిధియందు వేదరహస్యముల నాకళింపునకు దెచ్చు కొనుట శిష్యులకెల్లరకును సాధ్యమయ్యెడిపనిగాదు.

వేదములయందు సర్వతోముఖవిజ్ఞానము గుప్తమై గూఢముగ నున్నదనియు - తన్మహిమను గుర్తింపనేరక యల్పబుద్ధులైన వారి సమస్యను జులకనగ జూచుచున్నారనియు; వారేనాటికేని కన్నులు దెఱచి సత్యమును గుర్తింపక తప్పదనియు గంభీరగళమున దయానందులవారు ప్రవచించియున్నారు. భౌతికశాస్త్రవిజ్ఞానమొక్కటియే పరిపూర్ణమైన విజ్ఞానముగానేరదు. ముఖ్యముగ భౌతికశాస్త్రవిజ్ఞానకు గూడ బీజప్రాయములైన యాధారములు వేదములయందే కలవని దయానందులుద్ఘోషించిరి. ఈ సత్యమును వేదమునగల యంశములనే యాధారముగగొని తాను నిరూపణజేయగలనని ముక్తకంఠమున ఆయన వక్కాణించిరి. పాశ్చాత్యులు - దయానందుల సుదృఢ నిర్ణయ ప్రకటనకు ముగ్ధులగుటయేకాక విభ్రాంతినందుటయు జరిగెను.

త్రికరణశుద్ధిగ తాననుష్ఠించిన విషయమును వెల్లడించుట కాయన యెన్నడును వెనుకాడలేదు. సర్వేశ్వరుని విజ్ఞానసంపదను సత్యదృష్టితో సమన్వయించుకొని సత్యానుభూతిగల్గినవాడై సత్యానురక్తితో సత్యప్రకటనకే సముద్యుక్తుడై - సర్వేశ్వరవిజ్ఞాన గర్భితములైన బహుముఖ విషయములను వివరించుచు సర్వేశ్వర విజ్ఞాన సత్యస్వరూప నిర్ణయార్థము "సత్యార్థప్రకాశ" మను బృహద్గ్రంథమును గూడ లోకమునకు ప్రసాదించిన మహర్షి దయానందులవారి ప్రతిభా విశేషము సర్వలోక ప్రస్తుతిపాత్రమైనట్టిది.

నిర్ణీత పరిధియందే పరిమితమైయున్న కించిన్మాత్రపు విజ్ఞానముగల వారెల్లరు వివేకహీనతతో అనంతవిజ్ఞాన భావభాసురుడైన దయానందుని విమర్శింపబూనుట వెఱ్ఱితనముగాక యేమగును? ప్రచండ వేగముతో పయనించుచున్న వాయుదేవుని పకపాదుడొకడు పట్టుకొని బంధింప సాహసించుట వివేకహీనమైన పనిగాక యేమగును?

దయానందుని విమర్శింపబూనుకొనిన వారిపనియట్లయినది. ఆంగ్లభాషాపరిచయము శూన్యమైనప్పటికిని - సంస్కృతభాషా పాండి

త్యముతో - వేదవిజ్ఞాన ప్రజ్ఞతో - ఆంగ్లేయులనుగూడ చకితుల నొనర్ప జాలిన పుణ్యపురుషుడీయన. వేదవిజ్ఞానమును స్త్రీపురుష తారతమ్యము లేక సర్వ మానవులును సంపాదింప నర్హులేయని ఆయన ప్రగాఢముగ విశ్వసించి ప్రకటించెను.

'మంత్రములు - సంహితలు' మాత్రమే వేదములని విస్పష్టమైన తీర్పు నిచ్చి - వేద స్వరూప నిర్ణయమున చెలరేగిన కల్లోలము నణచి వేయగల్గు టాయనకే చెల్లినది. జాతీయభావావేశము సువిస్తృత మగుటకు, సనాతనధర్మము సర్వవేళల కళకళ లాడుటకు వైదిక విజ్ఞానమే యేకైక శరణ్యమని యా మహర్షి యెలుగెత్తి చాటినాడు. దయానందులవారు నిర్భయముగ నంటరానితనమును నిర్మూలింపుడని ప్రజల నుద్బోధించినాడు. దయానందుడు ఆర్యసమాజ స్థాపకుడు.

"కృణ్వంతు విశ్వమార్యం" అనునది దయానందుని శంఖా రావము. దివ్యజ్ఞాన సమాజము వారీ పూజ్యుని తమవంక కెల్లెని యాకర్షించుకొనవలెనని యత్నించిరి. కాని! దయానందులవారు దివ్యజ్ఞానసమాజము వారినే తన యాశయముల కనుగుణముగ మార్చి వేద ధర్మములను వారిచే నామోదింప జేయగల్గినాడు. ప్రతిభా వంతమైన దైవిక శక్తికి ప్రతినిధిగా - దివ్యతేజో విశేషమున వర్ధిల్లు చున్న దయానందులవారు సంధిసమయమున క్లిష్ట పరిస్థితులలో దేశ - సముద్ధరణకు - సముద్యమించిన మహనీయుడు. సనాతనధర్మశక్తి తాదృశులైన పుణ్యమూర్తుల మనోబల ప్రాభవముననే నిత్యదీప్తులలో విరాజిల్లుచున్నది. ఈకోవకు జెందిన మహనీయుడే శ్రీరామకృష్ణ పరమహంస. ఖుదీరామచటర్జీ చంద్రమణీదేవులబిడ్డగ వారి నోముల ఫలముగ జన్మించిన యీ పుణ్యమూర్తి పూర్వనామము గదాధరుడు. ఈయన గదాధరదేవవర ప్రసాది. బాల్యమున కొంతకాలమీయన స్వగ్రామమైన కామారిపుష్కరమునందే యుండి పిమ్మట కలకత్తా యందుపాధ్యాయుడుగ పనిజేయుచున్న అన్నగారివద కేగినాడు.

పువ్వుపుట్టగనే పరిమళించుననెడి సామెత యొకటికలదు. ఆ సామెత యందలి యర్థము వలెనే గదాధరుని జీవిత ప్రశస్తియు క్రమక్రమ వికాసముననే సూచించుచు వర్ధిల్లసాగినది. పూర్ణిమనాటి చంద్రుని గాంచి యుప్పొంగుమని జలధి గర్భమున కెవ్వరుపదేశించిరి? నీలి మేఘముల గర్జనలనాలకించి పులకించి నటింపుమని మయూరమున కెవ్వరు బోధించిరి? వసన్తకాలము ప్రవేశించగనే గున్నమామిడి కొమ్మల మధ్యజేరి కిసలయములు మెసవి, కుహూకుహూ నాదముల గానింపుమని కోకిల నెవ్వరాజ్ఞాపించిరి? అట్లే బాల్యము నుండియే పరమేశ్వరానుగ్రహసిద్ధికొరకై అవ్యక్తానందమున యత్నింపుమని సుకృతము గావించుకొని జన్మించినవారి కెవ్వరును వివరించి చెప్ప వలసిన యవసరములేదు.

దేవాలయములకేగుట, భగవంతుని ప్రతిమలకుగల దివ్యలావణ్యా మును తిలకించుచు బ్రహ్మానందము ననుభవించుట - పరమాత్ముని యంశములను వినిపించుతరి మమతతో చెవినొగ్గి యాలకించుట మొదలైన సల్లక్షణములు బాల్యమునుండియే గదాధరునిలో వ్యక్తములుగా సాగినవి. జన్మించినది నిరుపేదకుటుంబము నందయినప్పటికిని గదాధరునిలో దురాశలుగాని, అఖండభోగలాలసతలు గాని పొటమరించ లేదు. గదాధరుని యదృష్ట విశేషమది. ఆయన సంపాదించిన పురాకృత సుకృతఫలమది. ఆయనధోరణియే వేఱయినట్టిది ఆయన మాటలో "ఊహాకందనియేదో దివ్యశక్తి యవ్యక్తముగ ద్యోతకముగా సాగినది." నాటికింకను గదాధరుని వయస్సు పెరుగలేదు. కాని! మనస్సు మాత్రము వయస్సునుమించి పెరుగుట జరిగినది. అదియే గదాధరుని ప్రత్యేకత.

అన్నగారి యింటివద్ద నున్నప్పటికిని తమ్మునిలో చిత్తశాంతి కుదురలేదు. "తానిచటచేయుచున్నదేమి?" అని ప్రశ్నించుకొని నిరుత్తరుడైనాడు. పొట్టకూటి చదువుచదివి సాధింపవలసినదేమి యను

కొని చదువుటయు విరమించినాడు. గదాధరుని యాలోచనయేమో! బాహ్యమున కవగతమగుటలేదు. కాని! గదాధరునకు తెలియునా! తెలియునో! తెలియదో! అన్నగారితో మాత్రము ముందుగనే తాను చదువు విరమించితినని స్పష్టీకరించినాడు. మరి గదాధరు డేమి చేయును? దైవప్రేరితు డా బాలుడు. భగవంతుడే యతని భావిని వ్యక్తీకరింపవలయును. అట్లే దైవము గదాధరునకొక బాట చూపుటయు జరిగినది!

దక్షిణేశ్వరమున గల కాళీమాత దేవాలయమున గదాధరుడర్చకత్వము నెఱపెడి సదవకాశము లభ్యపడుట భగవదనుగ్రహ విశేషము. కరుణామయుడైన పరమేశ్వరుడు తనభక్తుల కెల్లపుడేదో యొక సాధన మార్గమును తప్పక చూపగలడు. భగవంతుని వరప్రభావమున జన్మించిన గదాధరుడు భగవత్కృపచే-చేరుకొనదగిన చోటునకే తుదకు చేరుకొనక తప్పలేదు

అందువలననే గదాధరుడు-కాళీమాత చరణసేవకుడుగా చేరుట జరిగినది. అది గదాధరునికి సాధన కేంద్రమైనది. విద్య లేక పోయినను-సర్వేశ్వరుని కృపకు మానవులు సంస్మరణబలమున పాత్రులుగావచ్చునను మాటకు గదాధరుని జీవితముదాహరణప్రాయముగ కొనసాగినది. కాళీమాత చరణపూజాధురంధరుడుగా-ఆమెను ప్రత్యక్షము గావించుకొని నిత్యమామెతో బిడ్డవలె సంభాషించుచు-ఆమె దివ్యానుగ్రహబలమున మహత్తర దివ్యశక్తులను సమార్జించుకొనగల్గినాడు. నిత్యమాదేవి తన దివ్యవాణిని-ఈ మహనీయునినోటనే ఆవిష్కరించుచుండెడిది. ఆయనవాక్కు నెల్లరు వేదవాక్కుగనే శిరసావహించిరి. అచటనే గదాధరుడు రామకృష్ణపరమహంస యైనాడు. మనోనిగ్రహశక్తిసంపన్నుడైనాడు. ప్రబలమైన యాధ్యాత్మిక భావములను పండించుకొనగలిగినాడు. తాను తరించి-ఇతరులను తరింపజేయగల దైవబలముగలవాడైనాడు. క్రమక్రమముగ

నట్లు వికాసదశనందుకొనిన జీవితమును గదాధరుడు గడుపుచు శ్రీ రామకృష్ణపరమహంసగ ప్రజలచే నారాధింపబడెడి స్థాయికి వచ్చుట విశేషము.

తాను నిశ్చయించుకొనిన చోటనే తానుండి యెల్లరిని తనకడ కాకర్షించుకొనగల మహనీయుడై నాడాయన. అవిద్యావంతు డయ్యును, బ్రహ్మవిద్యావేత్తలకే యాదర్శపాత్రుడుగ నిలువగలిగి నాడు. రామకృష్ణుని పరమహంస జీవితమట్లు దివ్యత్వమున విరాజిల్ల సాగినది. నిరక్షరాస్యులైన వారుసైతము భగవంతుని యుపాసించి దర్శించి తరింపవచ్చునని యీ మహనీయుని జీవితము సాక్ష్యమిచ్చు చుండును. మానవాతీత శక్తిసంపత్సమన్వితమైన దివ్యవాణితో మాన వుల నెల్లర దరింపజేయగల సందేశముల నా మహనీయు డందించినాడు.

"అమ్మా!" యని మధ్యమధ్య పారవశ్యమున స్మరించుచు, కాళీమాతను పూజించుచు సమాధ్యవస్థయందున్న శ్రీ రామకృష్ణుని గాంచి ఆయనచేష్టలను, ఉన్మత్తునిచేష్టలుగా తలంచి - వెఱ్ఱిచూపులను జూచి - పాపమీయన యొక పిచ్చివాడని పెక్కురు భ్రమించిరి.

దివ్యశక్తి సంపన్నుడై వెలుగొందుచున్న యీపుణ్యమూర్తి మహత్తర వైఖరి కెవ్వరు భాష్యము చెప్పగలరు? పరుల భావనల కందని యీ మహర్షి యూహల నర్థమొనర్చుకొనగల శక్తి యెవ్వరి కుండును? అది యొకయసాధారణ ప్రతిభ. అది యెవ్వరికి నవగాహ నము గాదు.

కామినీకాంచనములను గెలిచి ప్రతిస్త్రీని తల్లిగాచూచి పూజించ గలుగుట యెల్లరికిని సాధ్యము కాని విషయము. భార్యలో జగజ్జనని స్వరూపమును చూడగలిగి పూజింపగలిగినవారు విశాల విశ్వమున నెవరేని యుందురా? రామకృష్ణ పరమహంస యొక్కడే అట్లు చేయ గలిగినాడు. డబ్బు ప్రతివారిని ప్రలోభపెట్టును ధనమును గాంచియు

మదిని చలింపనీయక తన గొప్పను చెప్పుకొనుట కంగీకరింపక కోరిక లను గెలువగలిగి జీవితమును కొనసాగించెడి వారెందరుందురు? రామకృష్ణుని వంటి వారెవ్వరో యొకరుందురు. తాను భగవంతుని చూచితిననియు; యోగ్యతగల వారికి చూపగలననియు చెప్పి యొప్పించగల వారెవ్వరేని కలరా? రామకృష్ణుడొకడే యటొనర్ప గలిగెను. బుద్ధుని ప్రేమ భావన, శంకరుని శాస్త్ర విజ్ఞానము, చదువులేని యొక వ్యక్తిలో మూర్తీభవించి జగదుద్ధరణ గావించుటకు సహకరించినవి. ఆయనయే శ్రీ రామకృష్ణ పరమహంస. పాశ్చాత్యులు సైతము రామకృష్ణుని బోధలువిని పరవశులైరనిన యామహనీయుని యాత్మశక్తి యెట్టిదో - అవగతమగును. రామకృష్ణుని కడ శుశ్రూష జేసి - జీవితములను తరింప జేసికొనుటకై యెందరో శిష్యులాయన నాశ్రయించిరి. వారిలో గణనీయుడు నరేంద్రుడు. తనను మించిన శిష్యుని లోకమున కందించజాలిన గురువుగ రామకృష్ణుని మహిమ ద్విగుణీకృతమయినది. భువనేశ్వరీ విశ్వనాథదత్తులకు కాశీ విశ్వేశ్వరుని యనుగ్రహబలమున కలిగిన బిడ్డపేరు నరేంద్రనాథుడు.

బాల్యముననే తల్లి శిక్షణలో భక్తితత్త్వము నరేంద్రునకు పట్టుబడినది. నరేంద్రునకు బైరాగులన్నను, సన్యాసులనినను బాల్యము నుండియే గౌరవము మెండు. విద్యార్థి దశయందే మంచి మేధావిగ రాణించుచు సకల విషయములలో నరేంద్రుడు ప్రథముడుగ పరిగణింపబడుచుండెడివాడు. తల్లి వలన దైవభక్తిని, తండ్రివలన విజ్ఞానశక్తిని నరేంద్రుడు పెంచుకొనగలిగినాడు. చదువునాడే గట్టి తార్కికదృష్టి నరేంద్రునకు కలిగినది. తత్త్వశాస్త్రము, చరిత్ర, వేదము, నరేంద్రున కభిమాన విషయములు. విద్యార్థిదశయందే జ్ఞానయోగసాధన చేసిన యీ బాలుడు క్రమముగ వివాహజీవితముపట్ల విముఖుడాయెను. విజ్ఞానము పెరిగిన కొలది కనపడిన పెద్దలనెల్ల నిలువతీసి ప్రశ్న పరంపరలతో తల్లడిల్లచేయుచు భగవంతుని చూచితిరా! యని నిగ్గదీయుచుండెడివాడు. నరేంద్రుని ధోరణి చూచి పలువురాయనను నాస్తికు

డనిరి. కాలము గడుచుకొలది తనను పీడించుచున్న ప్రశ్నలకు సరియైన సమాధానము రాకపోవుటచే నరేంద్రునిలో ఒక విధమైన భావ సంఘర్షణ యేర్పడినది. "హేస్టి" యను ఆచార్యుడు - "సమాధ్యవస్థను మాటలలో చెప్పజాలననియు అది ప్రత్యక్షముగ చూడదలచినచో రామకృష్ణ పరమహంసను దర్శింపవలసినదే!" అని నరేంద్రుడున్న తరగతిలో వివరించినాడు.

ఆ మాటజ్ఞప్తికి దెచ్చుకొని దక్షిణేశ్వరమునకుపోయి రామకృష్ణుని దర్శింపవలెనని నరేంద్రునకు కోరిక గలిగెను. ఒక భజన కాలక్షేప సందర్భమున - అనుకొనకయే రామకృష్ణుని దర్శించెడి భాగ్యము నరేంద్రున కబ్బినది. అట రామకృష్ణుడు నరేంద్రుని ప్రేమగ జూచినాడు తరువాత నరేంద్రుడు రామకృష్ణుని దక్షిణేశ్వరమున దర్శించి "మీరు భగవంతుని చూచితిరా? నాకు చూపగలరా?" యని నిర్భయముగ గురుదేవుని ప్రశ్నించినాడు. "నేను చూచుచున్నాను, నీకును చూపగలను." అని శిష్యుని రామకృష్ణుడు తృప్తి పరచినాడు. నాటినుండి భక్తితో రామకృష్ణునే ఆరాధ్యదైవముగ మనసునందు నిలుపుకొని సేవింపసాగినాడు. రామకృష్ణుడును, నరేంద్రుని యమితముగ ప్రేమించుచు - తనయంత్యసమయమున తనకుగల దివ్యశక్తుల నన్నింటిని నరేంద్రునిలో ప్రసరింప జేసినాడు. నాటి నుండియు దృఢదీక్షతో దీనమానవసేవ కీ మహనీయుడు పూనుకొనినాడు. కొద్దివయస్సులో - ఇట్టి దివ్యమన స్తత్వముకలుగుటయు సేవాభావముదయించుటయు - పరహిత చింతనతో కాలము గడుపుటయు వివేకానందుని మహత్త్వమును సూచించుచున్నవి. గురుదేవుల యంతర్వాణి ప్రబోధించిన తెలుగున వేదాంత సందేశమును వాడవాడల కందించుచు వివేకానందుడు దేశపర్యటన సాగించినాడు. చెన్నపట్టణమున పలువురు పెద్దలు సమావేశమై వివేకానందుని మహత్త్వమున కచ్చెరువంది, చికాగోలో జరుగనున్న వివిధమతముల మహాసభకు

భారతప్రతినిధిగ తాము బయలుదేరుడని వివేకానందులవారిని కోరిరి. అందుల కాసంయమీంద్రుడు సమ్మతించుట దేశీయుల యదృష్టము.

విశ్వవిఖ్యాతమైన యాసభలో మధ్యందినమార్తాండబింబ దీప్తులతో తేజరిల్లెడి కాషాయాంబరముల ధరించి బ్రహ్మతేజమున మెఱయు ఫాలభాగమున కుంకుమదిద్ది దీర్ఘదండధారియై నిలిచి ప్రశాంత ప్రసన్న గళమున "అమెరికా సోదరీసోదరమణులారా!" యనెడి సంబోధనతో సభ్యులను ముగ్ధులగావించి తనవంక కాకర్షించుకొని - ఆర్షసందేశము నందించినాడు వివేకానందుడు. సభకరతాళధ్వనులతో మారుమ్రోగినది. పలువురు మతప్రతినిధులున్న సభలో ప్రతిసభ్యుని హృదయమును తన మధుర గంభీరవాక్కులతో తనవంకకాకర్షించుకొని యెల్లరిమన్ననలకు పాత్రుడైనాడు. చికాగోనగర వీధులలో గల కుడ్యములపై వివేకానందుని చిత్రపటముల నలంకరించి ప్రజలు పూజింపదొడగిరట. ప్రసంగమువినినంతనే సభలోగలవారి యందు వివేకానందునిపట్ల నిట్టి గౌరవభావములు కలిగియుండవచ్చును. మన సనాతనధర్మమును గూర్చియు, మన వేద విజ్ఞానమును గూర్చియు, ప్రేమతత్త్వమును గూర్చియు ప్రసంగము గావించిన వివేకానందుని ప్రతిభకు విస్మయమంది పత్రికలన్నియు బ్రహ్మాండముగ కీర్తించినవి.

"నిక్కముగ నా మహాపురుషుడు సరళహృదయుడు. విద్వత్వతంసుడు. వివేకానందునితో మాపండితు లెంతమాత్రమును బోల్పదగరు.

—Boston Evening Transpost paper

'మతమహాసభోద్దేశమును-దాని లోతుపాతులను గూర్చి హిందూమతాచార్యునంతటి చక్కగ నుపన్యసించినవక్త మరియొకరులేరు.'

New york critique paper

నరేంద్రుడు ప్రపంచమునుఱ్ఱూతలూపగలిగిన మహావక్తకాగలడని రామకృష్ణుడు పలికిన పలుకులు నాడు సత్యములైనవి. చికాగో

నగరమున భారతీయవేదాంత విజయదుందుభిని మ్రోగించి గంగా ప్రవాహ తుల్యమైన ప్రసంగశక్తితో వివేకానందుడు గొప్పకీర్తిని గడించినాడు.

అమెరికాలోగల పలువురు శ్రీ వివేకానందస్వాములవారి భావ పరంపరలకు విపులవ్యాప్తిఘటింప దీక్షగైకొనిరి. కొందరు స్త్రీ పురుషులు వివేకానందులవారికి శిష్యులై ఇహలోక సుఖములపట్ల పూర్ణ వైరాగ్య భావమును గల్గినవారై, సన్యసించి స్వామి ప్రారంభించిన యాధ్యాత్మికోద్యమమునకు బలమును చేకూర్చుచు ప్రచార మొనర్ప సాగిరి.

క్రిష్టైన్‌కన్య యాధ్యాత్మికోద్యమమునకే సర్వస్వ మర్పించి స్వామివెంట మన దేశమునకుగూడవచ్చిన మహాత్మురాలు. విల్ కాక్సుసతి, ఎవరెట్ మహాశయుడు స్వామియుద్యమమునకు కుడిభుజముగా నిల్చిన ధన్యులు. స్వామివెంట మనదేశమునకు సెవియర్ దంపతులుగూడ బయలుదేరివచ్చిరి. సోదరి నివేదితయు నిట్టివారిలో చెప్పుకొనదగిన యొక మహనీయురాలు.

అమెరికాలో పలువురికి వివేకానందుని నామము తారకమంత్రమైనది. స్త్రీపురుషులాయనకడ శిష్యత్వము గైకొనిరి. శ్రీమంతులు భక్తితో కానుకగ నొసగిన ద్రవ్యములో కొంతభాగమును భారతదేశమునకు పంపి, దీనజనోద్ధరణకుపయోగింపుడని యా మహనీయుడు సూచించినాడు. భౌతిక శక్తులను నమ్ముకొని జీవించుచున్న పాశ్చాత్యులలో ఆధ్యాత్మిక తృష్ణను కలుగజేసి, 'మా నుండి సనాతన ధర్మము గ్రహించి తరించుడ'ని ప్రబోధించినాడు. ఆయన అమెరికా బ్రిటీషుదేశములలో కావించిన ఆర్షధర్మ ప్రసంగములు హిందూధర్మ సంస్కృతులపట్ల ఆ దేశీయులలో భక్తి ప్రపత్తులను రేకెత్తజేసినవి. స్వామి సందేశమునకు వారెల్లరు పరవశులైరి. లండను పట్టణము

నందున్నపు డామహానీయుడు "మాక్స్ముల్లరు" అను తాత్త్విక పండితుని దర్శించినాడు. వేదభక్తియు, సంస్కృతభాషా భక్తియు గల "మాక్స్ముల్లరు" భారతీయయోగికులతిలకుడైన రామకృష్ణ పరమహంస జీవితచరిత్రను భక్తిశ్రద్ధలతో రచించిన సనాతన ధర్మాభిమాని. మానవ చరిత్రలో అమూల్యములైన దివ్యసాధనములు భారతదేశమున మాత్రమే వెలుగొందుచున్నవని మాక్స్ముల్లరు పలుకుట ఆయన సహృదయతకు సాక్ష్యము. వివేకానందు డీమహానీయుని సాయణాచార్యులని సంస్తుతించినారు. ప్రపంచ మత మహాసభలో భారత ధర్మప్రబోధము గావించి, దిగ్విజయముగ తిరిగి వచ్చుచున్న స్వామినామము నాడు భారతదేశమున రామనామముగనే మారు మ్రోగినది. చెన్నపట్టణప్రజలు భగవంతుడే బయలుదేరి వచ్చుచున్నట్లు వివేకానందుని కెదురేగి మురిసిపోయిరి. ఏ మహారాజునకు గూడ వారట్టి ఘనస్వాగతము నిచ్చియుండలేదు. కలకత్తా ప్రజలు గూడ స్వామికి ప్రేమపూర్వక స్వాగతమునందించిరి.

విదేశములనుండి తిరిగివచ్చిన పిమ్మట స్వామి గురుదేవుని పేర మఠములను, సంఘములను సృష్టించి దరిద్రనారాయణ సేవ సలుపగడంగినాడు. విదేశములలో గూడ రామకృష్ణ మఠములకు శాఖలేర్పడినవి. ఈ సంస్థలు నేటికిని దివ్యతత్త్వములను ప్రబోధించుచు మన మత ప్రశస్తికి వన్నె దెచ్చుచున్నవి. దేశభక్తి, వేదభక్తి, సమాజ సేవ, సాధుపూజ పరమలక్ష్యములుగ పెట్టుకొని ప్రచారమొనర్చుచు, పరమపావన భారతీయ వేదాంతచరిత్రలో నూతన శకమునకు సృష్టికర్తయై గొప్పకీర్తిని గడించినాడు వివేకానందుడు. త్యాగము, విశ్వప్రేమ, శిష్యులకు నేర్పి, సనాతన ధర్మము సముద్ధరింపబడుటకు సౌకర్యము లేర్పరచి, గురుదేవుని యాశయములను ఫలింప జేసిన వివేకానందుడు, మన యార్షసంస్కృతి కొనర్చిన సేవ నిరుపమానమైనట్టిది.

వివేకానందుని తరువాత యాధ్యాత్మికబలోపేతమైన హృదయ శక్తితో ప్రపంచపర్యటనగావించి, దివ్య తేజమును లోకమున వెలయించి సనాతన ధర్మరక్షణకు పాటుబడిన మహర్షి రామతీర్థస్వామి. ముప్పదేండ్ల వయస్సుననె మరణించి నప్పటికిని వందలకొలది సంవత్సరములు జీవించినవారుచేయలేని దివ్యకృషిని కొనసాగించిన మహనీయుడీయన. బహుభాషాకోవిదుడు. బహుశాస్త్రపరిశీలకుడునగు రామతీర్థస్వామి గాఢనిద్రలో మునిగియున్న భారతజాతిని మేలుకొలిపి, స్వధర్మమును కాపాడుకొనుటకు యత్నము చేయవలసినదిగా ప్రబోధించి, తన మధుర వాక్కులతో వారి హృదయముల యందు సనాతన ధర్మ ముద్రల ముద్రింప గలిగినాడు. తొలుతనుండియు మాతృభాషకు — స్వదేశ సంస్కృతికి దూర మొనర్పబడి - బాల్యముననే విద్యార్జనకొరకై అంగ్లదేశమునకు పంపబడి - అట ల్యాటిన్, గ్రీక్, అంగ్లము మొదలైన భాషలలో ప్రావీణ్యమును గడించిన మేధావి అరవిందుడు. మన దేశమున పెత్తనము సాగించుచు - మనవారిని నీచముగ జూచుచున్న - అంగ్లప్రభుత్వమనిన - విద్యార్థిదశనుండియే - అరవిందునకు తీవ్రమైన యాగ్రహముండెడిది. కావుననే యే కొద్దిలోపమునో చూపి, అరవిందుని ఐ. సి. యస్ పరీక్షయందుత్తీర్ణుని గాకుండ వారొనర్చిరి. అదియునొక విధముగ మంచిదియే అయినది. అరవిందుడు స్వదేశమునకు తిరిగి వచ్చినాడు. దేశభక్తిపూరిత శంఖారావమును పూరించినాడు. అరవిందుని ప్రబోధము ప్రజలలోబాగుగ వ్యాప్తినందసాగినది.

ఇది యిట్లుండ మహారాష్ట్ర పర్యటన సందర్భమున అరవిందునికి "లేలే" మహాయోగి సందర్శనభాగ్యము కలిగినది. ఆ యోగీంద్రుని దివ్యశక్తి అరవిందునిలో ప్రవేశించినది. ఆయనలో దివ్య పరివర్తనము వచ్చినది. తత్ఫలితముగనే — గీర్వాణ భాష నభ్యసించి వేదసంస్కృతి నవగాహన మొనర్చుకొనుచు, సనాతన ధర్మప్రశస్తిని గుర్తించి, తన మనుగడను సాగింప దొడగిన విజ్ఞానఖని కాగల్గినాడరవిందుడు.

ఈయన గావించుచున్న దేశభక్తి ప్రబోధములకు ఆంగ్లప్రభుత్వము దద్ద టిల్లి బాంబులను తయారుచేయు చున్నాడనెడి నేరారోపణ గావించి అరవిందుని కారాగారమునందుంచినది. కారాగారమున శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై "నిన్ను కారాగారమునకు తెచ్చినది నేనే. నీకు త్వరలో విముక్తి కల్గును. నీవొక మహాకార్యమును సాధింపవలసి యున్నది" అని - అరవిందునితో పల్కినాడు

చిత్తరంజనుడు తనవాదనాబల ప్రాభవమున - న్యాయాధిపతిచే అరవిందుడు నిర్దోషియను నిర్ణయమును గావింపజేసెను. అరవిందుడు కారాగారమునుండి విముక్తుడైనాడు. కాని! ఏవేవియో చేయని నేరముల నరవిందుని నెత్తిపైరుద్ది - మరల నాయనను కారాగారమున కంపుటకే - నీచబుద్ధితో ప్రభుత్వము కుట్రగావించినది. ఆ విషయమును పసికట్టి - ముష్కర ప్రభుత్వ నేత్రములలో కారముగొట్టి, ఫ్రెంచి వారి పాలనలోగల పుదుచ్చేరికి - అరవిందుడు చేరినాడు. అటనొక యాశ్రమమును నిర్మించుకొని గొప్ప తపస్సును గావించుచు - తత్ఫల ముగ తనకు లబ్ధములైన భగవన్మహిమలను ప్రజల కుపదేశించుచు ప్రశాంతతపస్విగ - మహాయోగిగ కాలము గడుప దొడగినాడు. అతీత మానసిక దివ్యశక్తుల నార్జించినాడు. నేటి భౌతిక శాస్త్ర విషయములు మాత్రమే కాక భావికాల భౌతికశాస్త్రజ్ఞులు కనిపెట్ట నున్న యంశములు గూడ వేదములలో బీజరూపమున నిక్షిప్తములై యుండెనని - ప్రబోధించి - వైదిక విజ్ఞానమున కఖండకీర్తి నార్జించి పెట్టినాడీయన. సత్యసంకల్పము, లోకధ్యేయము గావలెననియు బ్రహ్మ తేజస్సు నెల్లరు సముద్ధరించు కొనవలెననియు, నిత్య చైతన్య సందీపకములైన యాధ్యాత్మిక సిద్ధాంతములు శిరోధార్యములనియు సర్వమును భగవదర్పణగ నెంచి నిర్వహించుటే మనకర్తవ్యమనియు జాతికొక మహోపదేశము గావించిన దివ్యమూర్తి అరవిందయోగి. రాజకీయ ప్రళయసంఘర్షణలకు దూరముగనిల్చి - నిశ్చలవిశ్వాసముతో -

దేశభద్రతకు అవసరమైన సత్కృషిని యీ మహనీయుడు కొనసాగించుట మనము గమనింపవలసి యున్నది.

మతలక్ష్యములకు గల పవిత్రతను విశదీకరించుచు - సర్వ ప్రజలను - సనాతనమతమగు వేదమతము నాశ్రయించి ధన్యతగాంచుడని- అరవింద యోగి ప్రబోధించెను.

సర్వమానవులకు నందుబాటునందుండి దివ్యత్వము నందించి - ధన్యుల నొనర్చునది వేదమతమనియు, వైదిక ధర్మమే నిత్య సత్య ధర్మమనియు వివరించుచు వేదసంస్కృతికి గణనీయమైన సేవ యొనర్చిన యరవిందునివంటి మరొక పుణ్యమూర్తి - రమణమహర్షి.

ఇంగ్లీషు చదివి - ఆత్మ ప్రబోధబలముతో గొప్పయోగము నభ్యసించి దివ్యశక్తిని గడించి - అరుణాచలమునకేగి సర్వప్రజానీకమును తన వంక కాకర్షించుకొని మితవాక్యములతో, మన వేద ధర్మ మహిమలను వివరించుచు, దర్శన మాత్రముననే యెల్లరను ముగ్ధుల గావించెడి బ్రహ్మ తేజముతో ప్రకాశించిన యోగిచంద్రు డీయన. తిరువణ్ణామలై — ఈయన కావాసముగా నుండుటవలన ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైనది.

భారతీయ జీవితవిధాన పవిత్రత నెల్గెత్తిచాటుచు - ప్రపంచమునకే విస్మయమును ఘటించిన యెందరో మహనీయులైన - సనాతన ధర్మసముద్ధారకులు - పవిత్ర భారతదేశము నందుదయించి దివ్యత్వమును వెలయించినారు.

ఈ సందర్భమున చరిత్రకే గర్వకారణమైన మరియొక విషయమునుగూడ వివరింపవలసి యున్నది. మనదేశముపై పెత్తన మొనర్చుచున్న బ్రిటీషుజాతికి చెందిన యొక మహిళ మనపవిత్ర ధర్మమహిమలకు పరవశురాలై - మనదేశమునకు సేవయొనరింపబూనుట ప్రశంసింపదగ్గ విషయమేగదా!

వేదసంస్కృతి నర్థమొనర్చుకొని, పొంగిపోయిన మహిళ యామె. హిమాలయ పర్వతరాజమును - పావనకృష్ణా, గంగా గోదావర్యాది నదీమతల్లులను, భావించి భావించి యాపాశ్చాత్య వనిత యెంతగ మురిసిపోయినదో! మాటలతో వ్యక్తీకరించుటకు సాధ్యముగాని విషయమది. భారతీయుల నైతిక సంపద, భగవత్సేవాను రక్తి - పరస్పర ప్రేమ ప్రపూరితమైన సాధుభావన యామె మనస్సు నాకర్షించినవి. కావుననే పాశ్చాత్యుల పరిపాలన యిచట జరుగుచున్న కాలముననే - ఆంగ్లజాతికి జెందిన అనిబిసెంట్ మన దేశముపట్ల నిట్టి గౌరవభావములను గల్గియుండుట - గర్వకారణమని చెప్పవలసివచ్చినది. "గతజన్మలో నేనీ పుణ్యభూమికి జెందియున్న దాననేమో! ఈ గడ్డపై కాలిడగనే నాలో జ్ఞానభాస్కరోదయమైనది. ఇచటి చల్లనివాయువులు నన్నలరించినవి. చిత్తశాంతి యిచటికి వచ్చిన వెంటనే నాకు పుష్కలముగ సిద్ధించినది. ఇచటి వారిని హృదయపూర్వకముగ సేవించి తరించెదగాక! ఈ పుణ్యభూమిలో నివసింపనివారి మనుగడ కర్థమేలేదు. పవిత్రులయిన భారతీయులారా! మీలో నొక వ్యక్తిగనన్ను పరిగ్రహించుట కనుగ్రహింపుడు" అనిబిసెంటు సతి మన దేశమునందడుగు పెట్టుచునే యిట్లు విజ్ఞప్తి యొనర్చినది. ఆమె మంచి వాక్చతురతగల విజ్ఞురాలు. కావుననే యనతికాలమునకే యామె భారతీయుల కత్యంత సన్నిహితురాలు కాగల్గెను. భారతదేశ స్వాతంత్ర్యమునకు, సాంఘిక సాంస్కృతిక రంగములకు ఆమె సంస్మరణీయమైన సేవ యొనర్చినది. ఉదాత్తములైన యుదార భావములతో మనయాధ్యాత్మిక శక్తిని బహుముఖముల నభినందించుచు బిసెంటు సతి మన దివ్యభూమిపై దివ్యజీవనమును సాగించినది.

———

# స్వాతంత్ర్యఫలము

* * *

మొత్తముమీద - ఆంగ్లపాలనము ఈ దేశమున దుర్భర పరిస్థితులనే సృష్టించినది. ఈ పద్మవ్యూహము నుండి జాతిని బయట పడవైచి- సనాతన ధర్మభావానుగుణముగ నడిపింప నెంచి ఆత్మశక్తి సంపన్నులైన యెందరో పెద్దలు బహుముఖ కృషి గావించినారు. మహర్షుల వంటి యెందరో ప్రముఖులు మన సంస్కృతిని, గౌరవమును పునరుద్ధరించు నిమిత్తము-సాగించిన ప్రయత్నములన్నియు-పర పరిపాలనలో, తగినంత సత్ఫలితము నిచ్చుటలేదు. కాని ఉద్యమము మాత్రము విరమింపబడలేదు.

20 వ శతాబ్ద ప్రథమపాదము వరకు బాల గంగాధరతిలక్ వంటి మహనీయులు మనదేశ గౌరవ ప్రతిష్ఠలను పెంపొందించుట కొరకే మహోజ్జ్వల ప్రయత్నము లొనర్చిరి. తిలక్ మహాశయుడు దేశభక్తుడుగ మాత్రమే కాక - సంస్కారభావనగల దివ్యాత్త్వికుడుగ గూడ జాతికి సేవ యొనర్చిన మహనీయుడు. పలుమారులు స్వాతంత్ర్య మహోద్యమమున బాల్గొన్న కారణముగా ప్రభుత్వముచే బంధితుడై కారాగారవాస క్లేశముల ననుభవించిన రాజకీయవేత్త. ప్రభుత్వ పాశవిక శక్తిని - అవసరమగుచో - సమరశక్తితోనైన యెదిరించవలెననెడి యూహాగల సాహసి యీయన. కారాగారవాస క్లేశములను - మన ధర్మశాస్త్ర గ్రంథముల పఠనతో - అవలీలగ విస్మరించి సుఖముగ కాలము గడుప నేర్చిన సహృదయుడు. కారాగారవాస కాలమున లభ్యపడిన విశ్రాంతి సమయమును - భగవద్గీతాది దివ్యగ్రంథములను వ్యాఖ్యానించుటకు సద్వినియోగపరచుకొనిన విద్వాంసుడు తిలక్ మహాశయుడు.

కాలము విషవాహినులను ప్రవహింపజేయుచున్నది. పర ప్రభుత్వము కరుణను మరచియే పోయినది. స్వాతంత్ర్య భావన నల్పుటయే నేరముగ భావింప బడుచున్న రోజులవి.

ఈ పరిస్థితులలో దురదృష్టవశమున లక్ష్యము సిద్ధింపకముందే తిలక్ మహాశయుడస్తమించుట జరిగినది.

లాలాలజపతిరాయి; బిపిన చంద్రపాలు మున్నగు మహనీయు లీ స్వాతంత్ర్య యజ్ఞమును దక్షతతో నిర్వహింపవలయునని యత్నించు చునే యుండిరి. అపూర్వదీక్షతో విద్యాసంస్థలను సృజించి - అచట నుండి పౌరజీవితమున ప్రవేశించెడి విద్యార్థులను స్వాతంత్ర్య భావ తత్పరులుగను - స్వసంస్కృతిపట్ల, ధర్మముపట్ల శ్రద్ధగలవారినిగను తీర్చిదిద్ది ఆరూపమున దేశసేవ గావింపవలయునని మాలవ్యా మహా శయుడొకవంక నిరుపమాన కృషిసాగించెను. మున్షీ పండితుని సనాతన సంస్కృతి ప్రియత్వము ప్రశంసనీయము. వేరొకవంక వినాయక దామోదర సావర్కారువంటి - భగత్సింగువంటి వీరులు సాహసాత్మక ప్రయత్నములొనర్చియైనను, బ్రిటీషు సామ్రాజ్యాధికారము నీగడ్డపై తుడిచి వేయవలయునని ముఖాముఖి సంఘర్షణలకుగూడ గడంగిరి. దయాదాక్షిణ్యశూన్య ప్రవృత్తితో యుక్తాయుక్త విచక్షణారహిత ధోరణితో ముష్కర పరప్రభుత్వము తనను ధిక్కరించిన వారినెల్ల భస్మీపటల మొనర్ప భీష్మించినది. దేశభక్తులతో కారాగారములు నిండిపోవుచున్నవి. జలియన్ వాలాబాగ్ కిరాతక కృత్యములతో భారతీయుల హృదయమున మహాగ్నిజ్వాలలు చెలరేగినవి. దేశ మంతయు భీకర సమస్యల కాలవాలమై - నిప్పుల కుంపటివలె రాజు కొనుచుండుట మోహనదాస్ కరంచంద్ గాంధి గమనించినాడు. సోదరుల గుండెలలో శాంతిని నెలకొల్పి - దాస్యపాశముల నుండి వారిని విముక్తుల నొనర్పవలయునని గాంధిజీ భావించెను. స్వాతంత్ర్య ఫలరుచిని స్వదేశీయులకు పంచిపెట్టవలయునని - ఆయన కాంక్షించెను.

పరిస్థితులన్నియు విషమస్వరూపమున విజృంభించుచున్నవి. ఈ తరుణమున దారుణ చర్యలకు బూనుకొనుట - సాహసము లొనర్చుట తగదని - ఆయన భావన. అట్టి దౌర్జన్య వాతావరణము నెన్నడును సృష్టించుకొనరాదనెడి నిర్ణయమాయనది. హింసాకాండపట్ల లవలేశ మేని విశ్వాసము లేని వాడాయన. సత్యాగ్రహమును సాధనముగ నెంచి-బహువిధఫలితములను సాధింపవచ్చునను ప్రగాఢ విశ్వాసమాయనకు గలదు. పశుశక్తిని గెల్చుటకు పశుశక్తినే ప్రయోగించుట ప్రమాదకర మని గాంధిజీ సిద్ధాన్తము. శాంతిని సత్యాహింసలను, నయశీలములను పునాదిగ నిడుకొని జీవితలక్ష్యసిద్ధికి ప్రయత్నించుటాయన-అభిమతము.

సత్యము దైవస్వరూపము. సత్యము నారాధించెడి వారికి మహత్తరమైన యాత్మబలము సిద్ధించును. కావున సత్య ధర్మ బలమున స్వాతంత్ర్యము నార్జించుటకు ప్రయత్నింపుడని ప్రజలనుగాంధిజీ యుద్బోధించినాడు. క్రొత్తవాణి వినిపించినది. స్వాతంత్ర్య సాధనకు క్రొత్తబాట కనిపించినది. ప్రజలలో నవచైతన్యము వెల్లివిరిసినది. కేవలము రాజకీయశక్తి యొక్కటే దేశమునకు స్వాతంత్ర్యమును ప్రసాదింపజాలదనియు - నిస్తులమైన యాధ్యాత్మికశక్తితో - రాజకీయ శక్తి చేయి గలిపి - సాధుపథమున సాగినపుడే ధ్యేయము సిద్ధించు ననియు గాంధిజీ గాఢముగ విశ్వసించినాడు.

సత్యతత్పరుడై, శాంతిమయభావనుడై, రామభక్తిపరవశుడై, గీతాపారాయణ పరాయణుడై, ప్రజా సంక్షేమ సాధనాలోలుడై, రాజకీయరంగమున 1919వ సంవత్సరమున తిలక్ మహాశయుని యనన్తరము గాంధిజీ సాక్షాత్కరించుట జరిగినది.

ఆయన సిద్ధాన్తములపట్ల - భక్తిగలవారై ప్రజలాయన వాక్కులను వేదవాక్కులుగనే భావించినారు. రామనామ సంస్మరణ ప్రభావమున రాజకీయ తపఃఫలమును సాధింప - శాంత్యహింసల అండదండతో,

బయలుదేరిన గాంధిజీని భారతీయులు భగవదంశ సంభూతుని గనే భావించిరి. విశ్వమున గలవారెల్లరు విస్తుపోయి చూచెడి తెలుగున స్వాతంత్ర్యసిద్ధికొరకై - మహత్తర ప్రణాళిక నందించి - సకల భారతీయుల ప్రేమాభిమానము నందుకొనజాలిన - మోహనదాసు కరంచందు గాంధీని - 'మహాత్ముడనియు, బాపూజీ' యనియు ప్రజలు పిలుచుకొనసాగిరి.

బాపూజీ భారతదేశమున జన్మించుట భారతీయులు తమ సుకృత విశేషముగనే భావించిరి. మనదేశమున గావించిన ఉప్పు సత్యాగ్రహము, వ్యక్తి సత్యాగ్రహము మొదలైన ప్రయోగము అన్నియు మహాత్ముని భావివిజయమును సూచించెడి యత్నములైనవి. బాపూజీ పథకమే యేనాటికేని ఉపద్రవ రహితముగ దేశమును దాస్యమునుండి సముద్ధరింపగలదని - అసంఖ్యాక ప్రజానీకము విశ్వసింప నారంభించినది. ఆయన సూచన నందుకొని - ఉద్యోగులు, నిరుద్యోగులు, శ్రీమంతులు, నిరుపేదలు, పెద్దలు, పిన్నలు, స్త్రీలు, పురుషులు, కోట్లాదిగా వ్యక్తిసత్యాగ్రహమునకు దలపడుట తిలకించి ప్రభుత్వము నివ్వెరబోయినది. నిరాడంబర వేషముతో - బలహీన కాయముతో - అట్టహాసములులేని కార్యక్రమముతో - ఆత్మబలపూర్ణమైన విధానముతో - ప్రజలచే సహాయ నిరాకరణోద్యమ మొనరింప జేసినాడు మహాత్ముడు.

మహాత్ముడు సాగించిన నిరశన వ్రతములు దేశమునందంతట సంచలనమును రేకెత్తించినవి. పరిస్థితిని గుర్తించి పాశ్చాత్యప్రభుత్వము బిత్తరపోయినది.

ఈ వ్యక్తిలో నిట్టియత్యద్భుతశక్తి యెచట దాగియుండెనా! అని పరిపరివిధముల ప్రభుత్వము పరిశీలింపసాగినది. ఒక పవిత్రధర్మ వ్యవస్థకు జెందిన దివ్యసంప్రదాయమునకు దోసిలొగ్గి - భావనకందని పరమేశ్వరశక్తినే నమ్మి - ముందుకు సాగుచున్న మహాత్ముని నిజమైన

బలమేదో, ఆధ్యాత్మికాభిరుచి కించిన్మాత్రమేనిలేని - పాశ్చాత్యుల కెట్లవగతము కాగలదు? వారెట్లు దానిని గుర్తింపగలరు?

స్త్రీలలో నైతిక సంపద పెంపొందినచో జాతి యంతయు దివ్య తేజమున కళకళలాడగలదని భావించి స్వరాజ్య సాధనారంగమునకు మహిళలనుగూడ నాహ్వానించినాడు బాపూజీ. ఆయన సంకల్పించిన దంతయు క్షణములమీద ఆచరణమునకు వచ్చుటయు ప్రజల యామోద మునకు పాత్రమగుటయు మహత్తర విషయముగనే తోచును.

భారతదేశమున, చిరకాలమునుండియు పీట బెట్టుకొని కూర్చున్న అస్పృశ్యతను నిర్మూలించుటకు మహాత్ముడు నిబ్బరముగ సముద్యమించి క్రమముగ సత్ఫలితములను సాధింపగల్గినాడు. మత భేదములు పనికిరావని యెలుగెత్తిచాటి, మహమ్మదీయ సోదరుల నాకర్షించినాడు.

"ముప్పదేండ్లుగ నేనందుకొన నుత్సహించినది భగవదను భూతినే. నాజీవితలక్ష్యమదియే. రాజకీయములలో నా సర్వప్రయోగ ములు ప్రయత్నములు తల్లక్ష్యసాధనకే."

ఇది గాంధీజీ హృదయము. గాంధీజీ యత్నములన్నియు ఫల ప్రదములగుచు వచ్చుటకు కీలకమిదియే.

కాలము కొంతదీర్ఘముగనే గడిచినను నిరుపద్రవముగ - మారణ కాండతో ప్రసక్తిలేకయే భారతస్వాతంత్ర్యసిద్ధికి బంగారుబాట లీమహా త్ముని దివ్యకృషివలననే యేర్పడినవి. భగవచ్చింతనను విశిష్ట సాధన ముగ నెన్నుకొని జన్మభూమికి స్వాతంత్ర్యమును సాధింపకృతనిశ్చయు డైన బాపూజీ తలంపులు ఫలించినవి. ప్రజాబలమును జూచుకొని విఱ్ఱ వీగక, సంస్తుతులకు పొంగక, ఉద్యమము ఫలప్రదమైనందుకు గర్వించక, ధర్మశక్తియే యీ గడ్డకు దైవానుగ్రహమున స్వాతంత్ర్యానుభూతిని ప్రసాదించెనని భావించినాడు మహాత్ముడు. భారతదేశ చిరకాల దాస్యము బాపూజీ శక్తివలన పటాపంచలైనది.

అపూర్వవిజయమని తదితర ఖండములన్నియు బాపూజీకీర్తిని పలుతెఱఁగుల కీర్తించినవి. హస్తినాపురమున భారతస్వాతంత్ర్యలక్ష్మి సాక్షాత్కరించినది. రెండు శతాబ్దముల దాస్యముతో నీరసించిపోయిన భారత ప్రజల యాశలు మరల చిగురించినవి.

భయంకర ప్రకృతియు స్వార్థదృష్టియు పుష్కలముగ గల పాశ్చాత్యుల క్రౌర్యమునకు బలియైపోయిన ఎందరో భారతీయుల యాత్మలు పరవశించు తెఱఁగున దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించినది.

ఒక్కమాటలో చెప్పవలయుననిన ఇది మహర్షి తుల్యుఁడై దేశ కళ్యాణము కొఱకై పరితపించిన బాపూజీ భావ విజయము. ఆయన యారాధించిన సత్యధర్మములు సాధించిన విజయము. సనాతన సంస్కృతికి విజయము. సాధుశీలమునకు విజయము. సత్యాగ్రహమునకు విజయము.

భారతదేశ చిరకాలవాంఛ నెరవేరి పాశ్చాత్యులు మన దేశము నుండి తరలిపోయినారు. భారతీయులు స్వదేశ పరిపాలనా భారమును స్వీకరించినారు. భారత స్వాతంత్ర్య భానూదయమునకు హేతు భూతుడై నిల్చి అఖండమైన శాంతి యజ్ఞమును నిర్వహించి సత్ఫలము లను సముపార్జించి దేశీయులకు పంచియిచ్చిన మహాత్ముడు భయంకర పరిస్థితులలో తనువు చాలించినాడు.

దయాదాక్షిణ్య రహితమై కృతజ్ఞతా శూన్యమైన యీ దారుణ చర్య మహాత్మునిపట్ల భారతజాతి చేసిన ఘోరాపరాధమై చరిత్రలో నిల్చిపోయినది.

భారత రాజ్యాంగము సృష్టింపఁబడినది. చిరకాలము దాస్య మున క్రుగ్గి కనులుదెఱచిన మన జాతికిది మంచితుష్టిని, పుష్టిని, ప్రసాదింపవలసియున్నదికదా! దీనికెంతయో సహనశక్తియు, అవిరళ కృషియు నవసరము.

ప్రజాక్షేమమును, సంఘశ్రేయస్సును ఆకాంక్షించి, నిష్కామ కృషిని తదేకదీక్షతో పెద్దలు సాగింప తలపెట్టిరి. అయినప్పటికిని దేశమున అస్తవ్యస్తపరిస్థితులు తలయెత్తసాగినవి. భారతీయుల ఆశయములపై సంతోషామృతధారలను వర్షింపవలసిన తటి తద్భిన్నముగ దేశమున పురోభివృద్ధి నిరోధక శక్తులు అవరోధములను కలిగించుచుండుట విచారకరము.

మనది మతసహనముతో (Secular) కూడిన ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగము. దేశములో విచ్చలవిడిగ వ్యాపించియున్న దారిద్ర్యమును నిర్మూలించి, సంఘమునందలి లోపములను సవరించి శ్రేయోరాజ్యమును నెలకొల్పుట దీనిలక్ష్యము. కాని కొందరు దీనిని మతరహితరాజ్యమని వక్ర వ్యాఖ్యానములు గావించుచు, నీతి శీలములను విస్మరించుచు, దేశమున లంచగొండితనమును, చీకటి వ్యాపారమును, వస్తువులను - ముఖ్యముగా ఆహారపదార్థములను కల్తీగావించుట మొదలగు దుర్వృత్తులకలవడి, 'తిను - త్రాగు' మున్నగు అవాంఛనీయ భోగలాలస జీవితవిధానముల నలవరచుకొని, విచ్చలవిడిగ సంచరించుచు, దేశశ్రేయస్సునకు ఆటంకములను కలిగింపసాగిరి. ఇట్టి వీరి నడవడికి నైతికపు పునాదులులేవు. అందువలన సంఘమున సంక్షోభములేగాని సంక్షేమము వర్ధిల్లదు. సౌష్ఠవవంతమైన పునాదిలేని భవనము మనజాలదు. మనది సనాతనధర్మము - పరోపకార పారమార్థికదృష్టి - ఆకొన్నవారి నాదరించి యుచితముగ నాహారము నిచ్చు దయాదాక్షిణ్యములుగల సత్సంప్రదాయము. మనము పవిత్రమైన వైదిక సంస్కృతికి చెందినవారము. దైవచింతనాతత్పరులము. ఇట్లు మనకొక పవిత్రసంప్రదాయమున్నది. ప్రపంచమునకందించు ప్రత్యేకపావన సందేశమున్నది. ఇది జీవితమునందు పెనవైచుకొని అంతర్లీనమై యుండకతప్పదు. దీనిని మనము మన్నింపమానుట వివేకవంతమగు చర్యయెట్లగును? దీనిని విశ్వసించి యనుష్ఠింపకుండుట

ఘోరాపరాధమే కాగలదు. శీలసంపదను కుంటుపడనీయక, మత సహనమును చూపగల్గిననాడే ప్రజలు కర్తవ్యపరాయణులు కాగలుగుదురు. సుప్రసిద్ధదేశభక్తులుగ వర్ధిల్లగలరు. దేశమున అభివృద్ధిని సాధించి సుఖజీవితము ననుభవింపగలరు - శాంతిని పొందుకొల్పగలరు.

ధనార్జనము వాంఛనీయమే కాని ధర్మమార్గమున నార్జించుచు దానికి ధర్మకర్తలుగనుండి, ప్రజలకొఱకు సద్వినియోగమొనర్పవలెను. స్వార్థమును చక్కబెట్టుకొనుటకు, ఇందేదో మమతను పెంపొందించు కొనుటకు, భౌతికజీవితమే సర్వస్వమని విఱ్ఱవీగుచు విచ్చలవిడిగ సంచరించుట మిక్కిలి యవాంఛనీయము. అక్రమధనసంపాదనాపరులు తాత్కాలికముగ గౌరవమర్యాదలను బడయుచున్నట్లు కనుపించుచున్నను - ఇది క్షణికము. ఇసుక పునాదులపై నిర్మించిన భవనమువలె కూలియే తీరును. ధనమదాంధులకు ధరణిని చాపగాచుట్టగలమను దురహంకారము ప్రబలుచుండును. వారిమాటలలో నిజాయితీగాని - నిలుకడగాని యుండదు. సాధుభావము మచ్చునకైనను వీరియందు గాంచము. ఈ స్థితి యంతయు శోచనీయము.

గురుశిష్యులమధ్య సత్సంబంధము లంతరించినవి. పెద్దలయెడ గౌరవభావము చూపవలయుననెడి యుద్దేశము విస్మరింపఁబడినది. వంచన స్వేచ్ఛగా విహరింపసాగినది. నయశీలములకు విలువ నశించినది సత్యము మటుమాయమైనది. ధర్మము సంఘమునుండి పారిపోయినది. మనస్సులలో కల్మషము - మనుష్యుల చర్యలలో కల్మషము - తినెడి తిండిలో కల్మషము - పుచ్చుకొనెడిమందులలో కల్మషము - చెప్పెడి మాటలలో కల్మషము - ఏమని వివరించుట? ఎట్లు సమర్థించుట? జీవితము సర్వస్వమిట్లు కలుషితమగుచున్నది. రాజ్యాంగమును మన్నించుటనే మానినారు.

కాబట్టి మహాత్మాగాంధీ మనకందించిన యుత్తమసాధనములతో గ్రామగ్రామములందు చైతన్యమును రేకెత్తించుచు, సక్రమ

కృషిని సాగించుచు, దారిద్ర్యమును నిర్మూలించవలెను. ఆహార పదార్థములను విస్తృతముగ పండించవలెను. వానినెల్లరకు సులభముగ నందించవలెను.

సత్యమునకు ప్రాతినిధ్యములేని ధర్మము, సనాతనసంస్కృతికి ప్రాధాన్యములేని జీవితవిధానము మనకనవసరము. ప్రాతనుకాదని క్రొత్తయేదో యొరిగింపగలదని భ్రమింపజేసి, గోతిలోదింపెడి తత్త్వమునకు స్వస్తి పలుకవలయును. బాపూజీ యారాధించిన భగవద్గీతామాతను మనము శిరసావహించి పూజించుట నేర్వవలయును. తిలక్ మహాశయుడు కాంక్షించిన - అరవిందాదు లభినందించిన - రామకృష్ణ పరమహంస తిలకించిన - వివేకానందస్వామి ప్రవచించిన వేదసంస్కృతిని మన నిత్యజీవితవ్యవహారమున నిలుపుకొనవలయును.

బాపూజీ పాటించిన రామనామసంస్మరణధోరణి మన మనుగడకు శరణ్యము కావలయును. నాడు మాత్రమే నరులు ధర్మబద్ధమైన ప్రవృత్తికి తలయొగ్గి ముందుకు సాగగల్గుదురు. నాడుమాత్రమే కాలుష్యమును కడిగివేయుటకు ప్రతివారును పూనుకొందురు.

తిరిగి దివ్యజీవనమును మనమాకాంక్షించుచు మరియొకమారు మన మహర్షుల భావమందిరముల ప్రవేశింపవలసినదే! మరల మన పవిత్ర గ్రంథముల తిలకింపవలసినదే! మరల మన సనాతనాచార వ్యవహారరీతులను మన్నింపవలసినదే! అయిన ఈ పరిస్థితులలో పవిత్రత యేర్పడుటెట్లు? భ్రష్టమైన యీవ్యవస్థ సముద్ధరింపబడుటెట్లు? సమాజమున సుఖశాంతులు సముద్భవించుటెట్లు? దీనికి చక్కని పరిష్కారమార్గము లేకపోలేదు.

# శుభాకాంక్ష

* ' *

శుభోదయమైనది. సుఖదాయకమైన సామాజిక వ్యవస్థను నిర్మించుకొనవలెనను ఆకాంక్ష మనలో స్థిరముగ పాదుకొనవలెను. దానినాచరణము నందిడి ధన్యులము గావలెను.

పశుప్రవృత్తిని పాఱద్రోలవలెను. స్వైర విహారమునకు స్వస్తిని జెప్పవలెను. నియమ నిగ్రహములలో స్వాతంత్ర్యజీవితమును కొనసాగింప వలెను. 'తిను, త్రాగు - కాంతాలుడుగ సంచరించు' అను ఇంద్రియలోల - భౌతికభోగలాలసతను విసర్జింపవలెను. నీతి శీలములతో జీవితమునకు నవనాందీ గీతముల నాలాపింపవలయును. మధురాతి మధురములైన యిట్టిపరిణామములు దేశవ్యాప్తములైననాడు శ్రేయోరాజ్యము సుస్థిరముగ వర్థిల్లగలదు. ఇది మన యభిమతము. ఇట్టి సుస్పష్టమైన పరివర్తనముల యాకృతి మనలో ప్రతిఫలింపవలయును. అగుచో మనకర్తవ్యమేమి? మన భావములు సఫలములగుటకు మార్గములెవ్వి?

ఏది యొనర్చుటకైనను పదునైన భావబలమవసరము. భావమునకు పటుత్వమేర్పడవలయునన్న జ్ఞానము పెంపొందవలయును. జ్ఞానవికాసమునకు ఉత్తమగ్రంథపఠనమొక చక్కని సాధనము. ఇది సుశిక్షణమువలన - సక్రమ విద్యావిధానము వలననే సంలబ్ధమగును. కాబట్టి నిర్మలమైన విజ్ఞానమును - ప్రగతిపూరితమైన వివేకమును - పావనమైన యనుభవము నందించు విద్యావిధానమును మన బాలబాలికలకు ఉగ్గుపాలతో నూరిపోయవలెను. ప్రారంభ విద్యనుండియు ప్రబోధింప వలయును. ఇది నేడు కడుంగడు వాంఛనీయము. ఇట్టి విద్యా విధానము మనయందున్న మహత్తర శక్తుల మహోజ్జ్వలముగ వికసింపజేయును. సదాచారములను సాధుశీలమును సాధింపజేయును.

విశాల దృష్టిని సహనసంస్కారములను ప్రేమతత్త్వమును సంవర్ధిల్ల జేయును.

ఇట్టి విద్యావిధానము మనకు లేదు. దీనిని సమగ్రముగ తీర్చి దిద్దుకొనవలె నన్న సంస్కృతభాషాబోధనమును ప్రాథమిక దశ నుండియే మన పాఠశాలలో ప్రవేశపెట్టవలెను. గతమున మన దేశము నుత్తమస్థాయిలో నిల్పజాలిన - సంఘమును కళకళ లాడించెడి దివ్య భావములను దక్షతతో ప్రబోధ మొనర్పజాలిన - ఆర్ష సంస్కృతికి సంబంధించిన సద్గ్రంథములను పఠించు సదవకాశము మనకు లభ్య మగును. నీతి శీలముల పునాదులపై నిర్మింపబడిన విద్యావిధాన పథకము మనకు లభ్యమగును. అప్పుడే సత్యధర్మములు మన హృదయ ఫలక ములపై చక్కగ హత్తుకొనును. ఇది జాతిలో నుత్తమలక్షణము లను ముద్రింపజేయును. దేశ గౌరవ ప్రతిష్ఠలను ప్రబలింపజేయును.

నీతి నియమములు లేని జాతి, శైలిలేని భాషవంటిది. శీలసంపత్తిని నియమ నిగ్రహములను గలిగియుండని జాతి గౌరవము, వాసనలేని పుష్పమువలె నెవరి యామోదమునకును పాత్రము గాజాలదు.

అప్పుడే సంఘ విద్రోహులు ప్రబలి - దేశమును చీడపురుగుల వలె నాశన మొనర్తురు.

అత్యుత్కటముగ ప్రబలిన అవినీతిపరులను - దోషులను గట్టిగ దండించుటెంతయో యావశ్యకము. ఈ పరిస్థితులలో ప్రభుత్వము దోషులను కఠినముగ దండింపబూనుట, దేశభద్రతను నిర్భయముగ సంరక్షింపబూనుట, ప్రభుత్వకార్యకలాపములను దీక్షతో కృషి సాగించుచుండుట ముదావహము, ప్రశంసనీయము.

భ్రష్టతవంకకు జాతిని జాతినే లాగు దోషులపట్ల దయజూపవలసిన పనియే లేదు. వారు దేశగౌరవ మర్యాదలకు, ప్రభుత్వపు పేరు ప్రతిష్ఠలకు వేలుపురుగులవంటివారు. వారి సంఖ్య పెరుగుట దేశ

క్షేమమునకు భంగకరము. నేఁడు ప్రభుత్వపీఠము లీవిషయమున కడుంగడు శ్రద్ధవహించుచుండుట గమనార్హము.

తమ కొఱకు దేశముపయోగపడవలయుననెడి కాంక్షను విడిచి దేశము కొఱకు తాముపయోగపడవలయుననెడి భక్తిభావన ప్రజలలో నెలకొనవలయును. సేవాదృష్టితో, త్యాగభావనతో ప్రభుత్వములు, ప్రజాప్రతినిధులు తమతమ ధర్మములను బాగుగ నిర్వహించుచుండవలెను. తుచ్ఛమైన యొకానొక ప్రయోజనమున కాశించి, పవిత్ర దేశగౌరవమునకు భంగకరముగా ప్రవర్తించెడి తత్త్వమును దేశము నుండి బహిష్కరింపవలయును.

సర్వము తన ప్రజ్ఞవలననే నిర్వహింపబడుచున్నదనెడి యహంకారమును వదలి, సర్వేశ్వరుడొకడుండెననియు - సర్వశక్తి సమన్వితుడైన యా దేవదేవుడే యీ సర్వమును నిర్వహించుచుండెననియు - నిమిత్తమాత్రుడుగ తాను నిలిచి యీవ్యవహారము నంతయు నా దయామయుని చలువవలననే సాగించుచుంటిననియు - భావించెడి పవిత్రవైఖరిని యెల్లరవలంబించవలెను.

మద్యపానాది మత్తుపదార్థములు మానవులను పశువులుగా వ్యవహరింప జేయుచు సమాజమున శాంతిని - ఆరోగ్యమును భంగపఱచుచుండును. మానవుల పాలిటికవి పరమ శత్రువులు. కావుననే గాంధీజీ వానిని నిషేధింపుడని బోధించినాడు. సత్యాగ్రహము లాచరించినాడు. కేంద్రప్రభుత్వ మీ మద్యపాన నిషేధమును తిరిగి యమలు జరుపుటకు సత్సంకల్పముతో కృషిని సాగింపనుండుట హర్షదాయకము.

విద్యాలయములలో గాని - ప్రభుత్వకార్యాలయములలో గాని సమ్మెలవలన సాధింపబడు ప్రయోజన మెద్దియునులేదు. అవి మిక్కిలి అవాంఛనీయములు. వానిని పరోక్షమున కొందరు వారివారి

స్వప్రయోజనముల కొఱకు ప్రోత్సహించుచుండుట ప్రగతికి నిరోధకము. వీనిని ప్రోత్సహించుట కొరవితో తలగోకుకొనుటవంటిది.

యోగ్యులైనవారు స్వీయ సంస్కృతిని, ధర్మమును విస్మరింపరు; విడువజాలరు. భగవద్దత్తమైనది వేదవిజ్ఞానము. తదనుగుణముగ సంఘటింపబడిన సనాతన ధర్మమొకటి యున్నది. దానిని నిరాకరించి, సంచరించుట విశృంఖల ప్రవృత్తియే కాగలదు. కట్టుబాటు గౌరవసిద్ధికి కారణభూతము. సాంఘికములయిన కట్టుబాటులను సడలించుచో జాతికి యోగ్యత శూన్యమే.

ఈ ధర్మభావన దేశీయుల హృదయములలో సదా మెదలుచుండ వలయును. పెద్దలమనుకొను వారు కొందరిప్పటికిని మనల నెన్నడో వదలి పోయెనని భావింపబడెడి పాశ్చాత్యుల విలాసమయ విధాన పరంపర ననుసరించుచు ననుకరించుచు వ్యవహరించుచున్నపుడు వీరు వారికి ప్రతికృతులు గాక యేమగుదురు?

నేటికిని మనజీవిత రీతులపై అవాంఛనీయములైన పాశ్చాత్య సంప్రదాయశక్తులు పెత్తన మొనర్చుచు స్వారిచేయుచుండుట మిక్కిలి శోచనీయవిషయము. జీవనరంగమునందంతట నెలకొనియున్న దుర్భరమైన యీ యనుకరణరుగ్మతను నిర్దాక్షిణ్యముగ విదళించి ప్రజల నాయాపదల బారినుండి తప్పింప - విజ్ఞులు యత్నింపనిచో దేశమునకిక ముక్తియే లేదు. ఎల్లరీబాట వెంటనడచి పవిత్రసనాతన ధర్మము నాచరణమునందిడి నిత్యనూతన తేజముతో సత్యధర్మసాధన దృష్టితో దేశము నుద్దీపింపజేయుదురుగాక! మన పవిత్ర దివ్యసందేశమును విశ్వవ్యాప్త మొనర్చు కృషికి గడంగుదురు గాక! పవిత్ర నిరాడంబర వ్యవస్థనే ప్రేమించుచు బాపూజీవలె నిరాడంబర జీవితమును కొనసాగింతుముగాక! అట్టియాదర్శప్రాయ సాంఘికవ్యవస్థను సృష్టించుకొందుముగాక! తదాచరణముతో సుఖశాంతుల ననుభవింతుముగాక!

అపుడపుడు తలయెత్తెడి అరాజక శక్తులను ప్రభుత్వము నిర్దాక్షిణ్యముగ నణచుటకు తగిన కృషి యొనర్చునుగాక !

నాడే మహాత్ముడాశించిన దివ్య జీవిత విధానము మరల భారత దేశమున నెలకొనును. జీవితపరమలక్ష్యప్రాయమైన సర్వేశ్వర సంస్మరణ మును విధిగ శిరసావహించి సనాతన సంస్కృతిని సముద్ధరించుటకు చిత్తశుద్ధితో పూనుకొని - ఒకానొక మహోజ్జ్వల దివ్య తత్త్వము నకు మనము నిత్యపూజలు భక్తితో జరుపుకొనవలసి యవసరము నేడెంతగనో యున్నది. దృఢమన స్తత్వముతో విధ్యుక్త నిర్వహణ మొనర్తుముగాక ! సర్వజనామోద ప్రాయమైన - అదర్శవంతమైన జాతి నాడే దేశమున వర్ధిల్లుట కవకాశ మేర్పడును. చిత్తశుద్ధిసమ న్వితాలోచన మన భావనకు వచ్చి - అనుభవమున కందును. జగ న్నియంతయైన భగవంతుని పరమపావన కృపాకటాక్షము మనపై ప్రసరించును. సత్యధర్మపాలనా బలముతో నిత్యశోభావంతులమై నాడు మనము వెలుగొందగలము. మంచిని మన్నించి చెడుగును చెండాడెడి యోగ్యత మనకు నాడే యబ్బును. ఉపనిషత్తులుపదే శించిన దివ్యభావనలజాడలలో బయనించుచు ధన్యతనుగడింపగల్గుదుము. ప్రజాకళ్యాణదాయకమైన పరిపాలన నెలకొల్పుకొన నేర్తుము. విశ్వ మంగళమును సమకూర్చుటలో మనపాలివంతు కృషిని మనము నిర్వ హించిన వారమగుదుము. శుభములను గెలుచుకొందుము. సుఖ ముల ననుభవించుదుము. ఓరిమితో కూరిమిని - కలిమితో బలిమిని- తుష్టితో పుష్టినిసముపార్జించుకొని దేశమును కళకళలాడ జేయుదుము.

భరతమాత సర్వదా ప్రేమించెడి సనాతన సత్సంప్రదాయ సమన్విత ధార్మిక జీవితలీలను నిశ్చలముగ, నిదానముగ నిర్వహించుచు ప్రపంచపు నలుదెసలకు మనదేశయశఃకాంతులను బ్రసరింపజేయ జాలు దుము. దేశము శాన్తి సుఖసందేశముల నందించి యుత్తమ దీధితు

లతో ప్రదీపించును గాక! కారుణ్యాపరిపూర్ణ భావజ్యోత్స్నల బలమున పాశవిక భావాంధకారపటలి పటాపంచలగుగాక!

నదీ తీరములలో క్షేత్రగర్భములలో సురక్షితమై వెలుగు లీను చున్న పావన ప్రాక్తన సంస్కృతి ప్రజాహృదయ సదనముల పరవశింప జేయుచు పదికాలములపాటు ప్రవర్ధమానమగుచుండును గాక!

తరణి కిరణ పరంపరచందమున - పద్మ బాల పకపకల లీల - మయూరనృత్యము మాదిరి - వెన్నెల వరదవలె - వెన్నముద్దవలె - విశ్వమును సర్వదా - ఆర్ష సంస్కృతియే ప్రతిభాసింప జేయుగాక! భద్రమగుగాక!

# సవరణలు

★

| పుట. | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 17 | 10 | 1480 | 1840 |
| 19 | 7 | చాన | చావ |
| 20 | 23 | భావనలు | భావనులు |
| 24 | 9 | ఉత్వతః | ఉతత్వః |
| 26 | 19 | పరోపకార | పరాపకార |
| 39 | 7 | దిదు | దిద్దు |
| 40 | 5 | సముద్దీవ్త | సముద్దీప్త |
| 46 | 2,17 | సమిష్టి | సమష్టి |
| 52 | 17 | ప్రోజ్వల | ప్రోజ్జ్వల |
| 60 | 7 | కామేష్ఠి | కామేష్టి |
| 64 | 3 | పలికి | పలికెను. |
| 66 | 9 | నిర్బందిత | నిర్బంధిత |
| 81 | 25 | నిర్ధోష | నిర్దోష |
| 100 | 20 | రూపవణ్య | రూపలావణ్య |
| 109 | 10 | తిరుమంతము | తిరుమంత్రము |
| 157 | 6 | కాంతాలుడు | కాంతాలోలుడు |
| 158 | 21 | ధీక్ష | దీక్ష |